- తలపాగా ధరించాడని దళిత యువకుడిపై దాడి
- నీటిలో తగ్గిపోతున్న ఆక్సిజన్: పరిశోధకులు
- డైనోసార్ అస్థిపంజరం రూ.373 కోట్లు!
- యూపీఎస్సీ చైర్మన్ సోనీ రాజీనామా!
- కర్ణాటకలో టెకీల పని గంటలు పెంపు!

..లోపలి పేజీల్లో

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

ఆదివారం SUNDAY 21.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 46 | వెల (Price) రూ.8.00

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

గురు పౌర్ణమి

ఆదివారం, సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-53. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం తిథి: పౌర్ణమి పగలు 3-47 వరకు. నక్షత్రం: ఉత్తరాషాఢ రాత్రి 12-14 వరకు. వర్జ్యం: ఉదయం 9-18 నుంచి ఉదయం 10-47 వరకు. రాహుకాలం: సాయంత్రం 5-14 నుంచి సాయంత్రం 6-51 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 5-08 నుంచి సాయంత్రం 5-59 వరకు. అమృతకాలం: సాయంత్రం 6-15 నుంచి రాత్రి 7-45 వరకు. గురు పూర్ణోత్సవం, సికింద్రాబాద్ మహంకాళి బోనాలు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి పార్టీ ఫిరాయింపులు, ప్రొటోకాల్ ఉల్లంఘనలు, నిరుద్యోగుల సమస్య తదితర అంశాలపై ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

రాష్ట్రంలో రాజ్యాంగ హననం

- ఫిరాయింపులను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం..రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం
- నిరుద్యోగులకిచ్చిన హామీల అమలు లేదు.. ప్రొటోకాల్ పాటింపు లేదు
- రాష్ట్రంలో భయానక పరిస్థితులు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాజ్యాంగ హననం జరుగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామా రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, ప్రతిపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించకపోవడం తదితర అంశాలపై కేటీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం గవర్నర్ రాధాకృష్ణన్‌కు శనివారం రాజ్‌భవన్‌లో కలిసి ఫిర్యాదు చేసింది. అనంతరం కేటీఆర్ › 2వ పేజీలో



యాదాద్రి అద్భుతం

ఆగమశాస్త్రం ప్రకారం అద్భుతంగా కట్టారు › 2

కేసీఆర్ ఆరోగ్యం ఎలా ఉన్నది? అడిగానని చెప్పండి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

40 లక్షల మంది రైతులకు రుణమాఫీ కట్?

- మాఫీలో కాంగ్రెస్ సర్కారు మాయాజాలం
- రైతుల సంఖ్య, నిధులపై ప్రభుత్వ దాపరికం
- చెప్పున్నది 70 లక్షలు.. ఇస్తున్నది 32 లక్షల మందికే
- రైతుల లెక్కలపై సీఎం, తుమ్మల విరుద్ధ ప్రకటనలు
- మూడు కాదు నాలుగు వాయిదాల్లో రుణమాఫీ
- 4 విడతలకు కలిపి రూ.27వేల కోట్లే కేటాయింపు!

" రుణమాఫీకి పట్టాదారు పాస్‌పుస్తకమే ప్రామాణికం. రైతుకు భూమి ఉండి, భూమికి పాస్‌పుస్తకం ఉండి, ఆ పుస్తకంపై రుణం తీసుకుంటే చాలు ఆ రైతుకు రుణమాఫీ అవుతుంది. రాష్ట్రంలో 90 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఇందులో రుణాలు ఉన్న రైతు ఖాతాల సంఖ్య 70 లక్షలు మాత్రమే. వీళ్లందరికీ రుణమాఫీ వర్తిస్తుంది.

- ఈ నెల 16న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలివి.

రాష్ట్రంలో 39 లక్షల రైతు కుటుంబాలు ఉండగా రుణ ఖాతాల సంఖ్య 60 లక్షలు ఉన్నాయి. వీళ్లందరికీ రుణమాఫీ వర్తిస్తుంది.

- 16న మీడియాతో మంత్రి తుమ్మల

రాష్ట్రంలో 25 లక్షల రైతు కుటుంబాలు ఉంటే 44 లక్షల రుణ ఖాతాలు (రుణం తీసుకున్న రైతులు) ఉన్నాయి. వీళ్లందరికీ రుణమాఫీ చేస్తాం.

- శనివారం మీడియాతో తుమ్మల మరో లెక్క

అటు సీఎం రేవంత్‌రెడ్డి, ఇటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన లెక్కల ప్రకారం చూస్తే అటు ఇటుగా రాష్ట్రంలో సగటున 65 లక్షల మందికి రుణమాఫీ కావాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది.రుణమాఫీకి అర్హులైన రైతుల సంఖ్య, అవసరమయ్యే నిధుల లెక్కను ప్రభుత్వం దాస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాటికి బలం చేకూర్చుతూ సర్కారు సిద్ధంచేసిన లెక్క బట్టబయలైంది. రుణమాఫీపై సర్కారు పైకి చెప్తున్న లెక్కలు వేరేలా ఉండగా, అసలు లెక్కలు మరోలా ఉన్నాయి. › 6

బ్యాంకుల్లో పొరపాట్లు.. ఆధార్‌లో తప్పులు



3 లక్షల ఖాతాలకు రుణమాఫీ అసాధ్యం › 6

తప్పులు సరి చేశాక అర్హులకు రుణమాఫీ

ఆగస్టులో రుణమాఫీ చేయకపోతే ఐదేయండి

విధి విధానాలు ఖరారు అయ్యాకే రైతుభరోసా

సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల

7 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

నలుగురు నిందితులు అరెస్టు

రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌కు సరఫరా › 10

హైస్కూల్ పనివేళల్లో మార్పు › 10

జిల్లాపై 9 నుంచి 4.15 గంటల వరకే

జంటనగరాల్లో 8.45 - 4 వరకు

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్




- ప్రతి మార్చిలోగా ఉన్న ఖాళీల వివరాలు తెప్పించుకుంటాం
- జూన్ 2లోగా నోటిఫికేషన్..
- డిసెంబర్ 9లోగా నియామకాలు
- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి › 3

జూకంటి జగన్నాథంకు దాశరథి అవార్డు



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఏటా ప్రకటించే ప్రతిష్ఠాత్మక 'శ్రీ దాశరథి కృష్ణమాచార్య అవార్డు'ను 2024 సంవత్సరానికి జూకంటి జగన్నాథంకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం మేరకు శనివారం ఉత్తర్వులు › 2వ పేజీలో





మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో మత్తడి పోస్తున్న పెద్దచెరువు

15 జిల్లాలకు హై అలర్ట్

- మరో మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- ముంచెత్తుతున్న ముసురు వాన.. రాష్ట్రంలో పొంగుతున్న వాగులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి.. అప్రమత్తమైన యంత్రాంగం
- లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం.. పెద్దవాగు పరిస్థితిపై సీఎం ఆరా
- జలపాతాలు, చెరువుల వద్దకు వెళ్లొద్దు: పోలీసులు › 5
- కలెక్టర్లను అప్రమత్తం చేసిన మంత్రి సీతక్క





యాదగిరిగుట్ట నిర్మాణం అద్భుతం

కేసీఆర్ ఆరోగ్యం ఎలా ఉంది? అడిగానని చెప్పండి

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రశంసించారు. ఆగమశాస్త్రం ప్రకారం కట్టారంటూ అభినందించారు. గవర్నర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శనివారం రాజ్‌భవన్‌లో కలిసిన సందర్భంగా వారి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని గవర్నర్ ఆరా తీసినట్టు తెలిసింది. 'కేసీఆర్ ఎలా ఉన్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉన్నది? అడిగానని చెప్పండి' అని అన్నట్టు సమాచారం. తాను కూడా యాదగిరిగుట్టను సందర్శించానని, అద్భుతంగా ఉన్నదంటూ గవర్నర్ కొనియాడారని బీఆర్ఎస్ ప్రతినిధులు తెలిపారు. 'కంగ్రాట్యులేట్ హిమ్' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారని తెలిసింది. కాంగ్రెస్ హామీలు, ప్రొటోకాల్ ఉల్లంఘనలు, ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై తాము చేసిన ఫిర్యాదుల విషయంలో గవర్నర్ స్పందన బాగున్నదంటూ బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సంతృప్తి వ్యక్తంచేసింది. అధికారులను పిలిచి మాట్లాడుతానని హామీ ఇచ్చారని తెలిపారు.



నేడే ఏడో విడత గ్రీన్ ఇండియా చాలెంజ్

ప్రారంభించనున్న ఒడిశా అసెంబ్లీ స్పీకర్

ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని సంతోష్‌కుమార్ పిలుపు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): దేశాన్ని హరితమయంగా మార్చే గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం భువనేశ్వర్‌లోని బిజిలీ గ్రామంలో ఉన్న ప్రభుత్వ హైస్కూల్‌లో ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాధి చేతుల మీదుగా గ్రీన్ ఇండియా చాలెంజ్ ఏడో విడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'హర హైతో భారా హై- గ్రీన్ ఇండియా చాలెంజ్' (భూమి పచ్చగా ఉంటే లోకం నిండుగా ఉంటుంది) కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజలను కోరారు. భూమి ని చల్లగా ఉంచేందుకు, జీవజాతులను కాపాడేందుకు అందరూ మొక్కలు నాటుదామని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి గ్రీన్ హీరోగా మారాలని కోరారు.

జూకంటి జగన్నాథంకు దాశరథి అవార్డు

మొదటిపేజీ తరువాయి...



జారీచేశారు. అవార్డుతోపాటు రూ.1,01,116 నగదు, జ్ఞాపికను ఆయనకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా జగన్నాథంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మూడున్నర దశాబ్దాల ప్రస్థానం

కవిగా, రచయితగా జూకంటి జగన్నాథం ప్రస్థానం దాదాపు మూడున్నర దశాబ్దాలు. ఆయన స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రం. ఆయన 1993లో మొదటి కవితా సంకలనం పాతాళ గరిగెను విడుదల చేశారు. తర్వాత సుమారు 16 కవితా సంకలనాలు వెలువరించారు. ఆయన కవితలు కన్నడ, తమిళం, హిందీ, ఇంగ్లిష్‌లోకి అనువాదం అయ్యాయి. 2005లో జూకంటి కథలు, 2020లో జూకంటి జగన్నాథం కథలు పేరుతో కథా సంకలనాలు వెలువరించారు. ఆయనను పలు అవార్డులు రివార్డులు వరించాయి. 1998లో మొదటిసారి సినారె కవితా పురస్కారం అందుకున్నారు. ఆయన 2014 నుంచి అలిండియా తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రాష్ట్రంలో రాజ్యాంగ హననం

మొదటిపేజీ తరువాయి...



గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జగదీశ్‌రెడ్డి, తలసాని, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, పాడి కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి, నవీన్‌కుమార్‌రెడ్డి.

మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, ఇతర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని, రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్టు వెల్లడించారు. నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడం, ప్రతిపక్ష నియోజకవర్గాల్లో ఎక్కడా ప్రొటోకాల్ పాటించకపోవడం వంటి అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. నిరుద్యోగ యువత, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను ఎలా తుంగలో తొక్కుతున్నారో గవర్నర్‌కు వివరించామని చెప్పారు. హామీలు అమలుచేయాలని కోరుతున్న విద్యార్థుల మీద నిర్బంధం, అణచివేత, అరెస్టులు, అక్రమ కేసులతో భయానక వాతావరణం పునరావృతం చేస్తున్నారని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ అంటూ ప్రచారం చేశారని, వాటిని అమలు చేయడంలేదని దుయ్యబట్టారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో లాఠీచార్జి, ఉస్మానియా యూనివర్సిటీ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులపై దాడి చేస్తూ ఉద్యమకాలం నాటి అణచివేత వైఖరిని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ప్రయోగిస్తున్నదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. గ్రూప్-1,2,3 పోస్టులను పెంచుతామంటూ ఇచ్చిన హామీని పట్టించుకోకపోవడం, మెగా డీఎస్సీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి తదితర హామీలను అమలుచేయని విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఆయా అంశాలపై గవర్నర్ చాలా సీరియస్‌గా స్పందించారని, హోంశాఖ కార్యదర్శిని పిలిచి వివరాలు అడుగుతానని హామీ ఇచ్చారని వెల్లడించారు. విద్యార్థుల మీద ఉద్రిక్తంగా జరగడం మంచిది కాదని గవర్నర్ అన్నారని కేటీఆర్ చెప్పారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తుంగలో తొక్కుతూ కాంగ్రెస్ పార్టీ పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎనిమిది మంది ఎమ్మెల్సీలను చేర్చుకున్న విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామని, స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశామని వివరించారు. బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీగా పోటీచేసిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. నిరుద్యోగుల విషయంలో గవర్నర్ చాలా సీరియస్‌గా స్పందించిన తీరును అభినందిస్తున్నామని, స్వాగతిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ పార్టీగా అండగా ఉంటుందని, వారికి కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేవరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

త్వరలో మేడిగడ్డకు...

మేడిగడ్డ కొట్టుకుపోయిందని, కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు గంగపాలు అయ్యాయంటూ దిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోవాలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అక్కడ జరిగిన చిన్న విషయంపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కొన్నిరోజుల్లోనే రిపేర్లు పూర్తి అయ్యాయని తెలిపారు. ఇప్పుడు గోదావరికి వరద వస్తున్నా మేడిగడ్డ తట్టుకున్నదంటే అది కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనమేనని చెప్పారు. త్వరలోనే మేడిగడ్డను సందర్శిస్తామని, ప్రజలకు వాస్తవాలు వివరిస్తామని చెప్పారు. పరీక్షలు వాయిదా వేస్తే కోచింగ్ సెంటర్లకు రూ.వందల కోట్లు లాభం వస్తుందని సీఎం అన్నారని, ఇప్పుడు నాలుగు నెలలు వాయిదా వేశారని, రూ.నాలుగు వందల కోట్లు వస్తున్నాయా? అందులో సీఎం వాటా ఎంత? అని ప్రశ్నించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు టీ హరీశ్‌రావు, మహమూద్‌అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, జీ జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కేపీ వివేకానంద, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, అనిల్‌జాదవ్, చింతా ప్రభాకర్, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు ఎస్ మధుసూదనాచారి, ఎల్ రమణ, నవీన్‌కుమార్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, శంభీపూర్ రాజు, దేశపతి శ్రీనివాస్, వాణీదేవి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

ప్రొటోకాల్ ఉల్లంఘనలను కూడా గవర్నర్‌కు వివరించామని కేటీఆర్ వెల్లడించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అగౌరవపర్చడం, అధికారుల తీరు, ప్రజాప్రతినిధుల హక్కుల భంగం వాటిల్లుతున్న తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీనిపై కూడా ప్రభుత్వాన్ని వివరణ కోరుతూ లేఖ రాస్తానని గవర్నర్ హామీ ఇచ్చారని చెప్పారు. భవిష్యత్‌లో విస్తృతంగా ఎలాంటి ఇబ్బంది వచ్చినా కలవాలని గవర్నర్ సూచించారని తెలిపారు. తన పరిధిలో ఉన్న అంశాల్లో తప్పకుండా న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ఒకవైపు రాజ్యాంగాన్ని రక్షిస్తున్నట్టు రాహుల్‌గాంధీ పోజులు కొడుతూ.. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.

అగ్నిమాపకశాఖలో భారీగా బదిలీలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో శనివారం భారీగా బదిలీలు జరిగాయి. 18 మంది డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు (డీఎఫ్‌వో), 22 మంది అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ డీజీ వై నాగిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కమిటీ ప్రొసీడింగ్స్ ప్రకారం మల్టీజోన్ల పరిధిలో జిల్లా ఫైర్ ఆఫీసర్ స్థాయి నుంచి సాధారణ ఉద్యోగి, కానిస్టేబుల్ వరకూ ఈ బదిలీలు జరిగాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డీఎఫ్‌వోలు, ఏడీఎఫ్‌వోలు, ఇతర ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని డీజీ ఆదేశించారు. మూడు రోజుల్లోపు రిపోర్టు చేయడంలో అలసత్వమైతే వారు రిలీవ్ అయినట్టుగా పరిగణిస్తామని హెచ్చరించారు.

11వ వేజ్‌బోర్డు ద్వారా పెన్షన్ చెల్లించాలి

సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

హైదరాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు 11వ వేజ్‌బోర్డు ప్రకారం పెన్షన్, ఇతర బకాయిలు చెల్లించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు విజ్ఞప్తిచేశారు. దీనిపై గుర్తింపు సంఘం నాయకులు వెంటనే సింగరేణి చైర్మన్ బలరాంతో చర్చించి సత్వరమే అమలయ్యేలా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. సింగరేణి ఉద్యోగులకు 11వ వేజ్ బోర్డు ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని కానీ, పెన్షనర్లకు మాత్రం ఇంకా 10వ వేజ్‌బోర్డు ప్రకారమే పెన్షన్ చెల్లిస్తున్నట్టు వాపోయారు. దీనివల్ల పెన్షనర్లకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ పెన్షన్, పాత వేజ్‌బోర్డు ప్రకారం పెన్షన్ చెల్లించడంతో తాము సమస్యలు ఎదుర్కొంటున్నట్టు వివరించారు.

సీడీపీవో పరీక్ష రద్దుపై అభ్యర్థుల నిరసన

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు గ్రేడ్-1 అధికారుల (సీడీపీవో) రాత పరీక్షను రద్దు చేయడంపై అభ్యర్థుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. సీడీపీవో పరీక్షల రద్దు విషయంలో టీజీపీఎస్సీ అత్యుత్సాహం చూపిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ఉద్యోగ పరీక్షల ప్రశ్న పత్రాలు లీకైన సంగతి తెలిసిందే. వీటిపై సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (సీఎఫ్ఎస్ఎల్), ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తునకు ఆదేశించారు. అయితే ఓవైపు దర్యాప్తు జరుగుతుండగానే సీడీపీవో పోస్టుల కోసం 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపికచేసి, వారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ ఫలితాలను ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదల చేశారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే అభ్యర్థుల తుది జాబితా కూడా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు అందింది. ఇప్పుడు పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రకటించడం అభ్యర్థులను తీవ్ర నిరాశ నిస్పృహలకు గురిచేసింది. అధికారులు ఇంతకాలం తమకు ఆశలు కల్పించి, ఇప్పుడు నీళ్లు చల్లారని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

హైకోర్టు చెప్పినా పట్టించుకోని టీజీపీఎస్సీ

సీడీపీవో పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మూడు వారాలలోపు నియామక పత్రాలు ఇవ్వాలని హైకోర్టు గతంలోనే టీజీపీఎస్సీకి ఆదేశాలు జారీ చేసిందని అభ్యర్థులు తెలిపారు. కోర్టు ఆదేశాలను అధికారులు బేఖాతరు చేశారంటూ మరోవైపు కోర్టు ధిక్కరణ కేసు దాఖలైంది. దీనిపై సోమవారం టీజీపీఎస్సీ వాదనలు వినిపించాల్సి ఉన్నది. ఇంతలోనే పరీక్షను రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని అభ్యర్థులు మండిపడుతున్నారు. ఫలితాలు విడుదల చేసిన దాదాపు ఏడున్నర నెలల తర్వాత సీడీపీవో పరీక్షలు విడుదల చేయడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగని నర్సుల నిరసన.. ఆగిన కౌన్సెలింగ్!

- సీనియర్ నర్సుల బదిలీపై తేలని పంచాయితీ
- డీపీహెచ్ కార్యాలయాన్ని ముట్టడించిన నర్సులు
- సీనియార్టీ, వేకెన్సీ జాబితా పారదర్శకంగా ఇవ్వాలి
- పదోన్నతులు, ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం పట్టు
- చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ల రిటెయినింగ్‌పై కొత్త దుమారం



హైదరాబాద్ కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహిస్తున్న నర్సులు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్ బజార్: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) విభాగంలో నర్సింగ్ ఆఫీసర్ల బదిలీల రచ్చ శనివారం కూడా కొనసాగింది. కోఠిలో శుక్రవారం అర్ధరాత్రి వరకు నిరసన తెలిపిన నర్సులు.. శనివారం డీపీహెచ్ కార్యాలయాన్ని ముట్టడించారు. పారదర్శకంగా సీనియార్టీ జాబితా ప్రకటించాలని, వేకెన్సీ జాబితాను ప్రదర్శించి, ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించాలని, అప్పుడు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.లక్షలు తీసుకొని, సీనియార్టీ జాబితా నుంచి పేర్లను మాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా హెడ్ నర్సుల పదోన్నతులు చేపట్టాలని, ఆ తర్వాతే బదిలీలు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు కొందరు నర్సింగ్ ప్రతినిధులను కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వద్దకు తీసుకెళ్లారు. పదోన్నతులు చేపట్టడం కుదరదని, బదిలీలను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని, సీనియార్టీ లిస్టును మరోసారి సమీక్షించి, సాయంత్రానికి వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు మధ్యాహ్నం మూడు గంటల వరకు వేచిచూస్తున్నా డీపీహెచ్ డాక్టర్ రవీంద్రనాయక్ తన కార్యాలయానికి రాకపోవడంతో స్టాఫ్ నర్సులు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీకి చేరుకొని.. ఓఎంసీ అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన తెలిపారు. దీంతో డీపీహెచ్ అక్కడికి చేరుకున్నారు. ఉదయం నుంచి తాము ఆయన కోసం ఎదురుచూస్తే 'త్వరలో కమ్యూనికేట్ చేస్తాం' అంటూ ఒక్క ముక్క మాట్లాడి వెళ్లిపోయారని నర్సులు మండిపడ్డారు. దీంతో సీనియర్, జూనియర్ నర్సింగ్ ఆఫీసర్ల బదిలీ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మళ్లీ కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహిస్తారో తెలపాలని తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం డీపీహెచ్‌కు వినతిపత్రం అందించారు. జోన్ల వారీగా సీనియార్టీ లిస్టును, లాంగ్ స్టాండింగ్ జాబితాను, 40 శాతం తప్పనిసరి బదిలీల జాబితాను విడుదల చేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ కోరారు. సీనియర్లకు పదోన్నతులు కల్పించాలని అన్నారు. ఏ క్యాటగిరీలో ఎవరెవరిని బదిలీ చేస్తున్నారో జాబితాలో స్పష్టంగా పేర్కొనాలని డిమాండ్ చేశారు.

ఇతర విభాగాల్లోనూ 'అక్రమ' బదిలీలు

నర్సింగ్ ఆఫీసర్ల బదిలీలు రచ్చకెక్కడంతో డీపీహెచ్ పరిధిలోని డిప్యూటీ డైరెక్టర్(అడ్మిన్), ఫార్మసీ, ల్యాబ్, ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ (మేల్, ఫీమేల్) తదితర క్యాడర్ల కౌన్సెలింగ్ కూడా అక్రమంగా జరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉన్నదని, అర్హత లేకున్నా స్పౌజ్, ఇతర కారణాలతో చాలా మందిని రిటెయిన్ చేశారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇందుకు డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) బదిలీలను ఉదాహరణగా చూపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 మంది ఉండగా, హైదరాబాద్‌లోనే 11 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఐదుగురు లాంగ్ స్టాండింగ్ అధికారులు ఉండగా.. నలుగురిని స్పౌజ్ కోటా కింద రిటెయిన్ చేశారు. అయితే ఇందులో ఇద్దరికి మాత్రమే అర్హత ఉన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఆరోగ్యశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పలువురు యూనియన్ల నేతలు మధ్యవర్తుల అవతారం ఎత్తి రూ.లక్షలు వసూలు చేసి, కీలక అధికారులకు ముట్టజెప్పారని, అందుకే ఇలా అక్రమ బదిలీలు జరిగాయని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

హెడ్ నర్సుల జాబితాలోనూ తప్పుల తడక

డీపీహెచ్ పరిధిలో హెడ్ నర్సుల కౌన్సెలింగ్ శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జరగాల్సి ఉండగా.. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైంది. ఇందులోనూ సీనియార్టీ లిస్టు తప్పుల తడకగా ఉన్నదంటూ హెడ్ నర్సులు మండిపడ్డారు. శుక్రవారం నాటి ఘటనల నేపథ్యంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ముందు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ నేతృత్వంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు, సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్‌ఐలు కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్, శ్వేత బందో బస్తులో పాల్గొన్నారు.

'అమె'కు రిటెయినింగ్‌పై రగడ

చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ల బదిలీలో శనివారం కొత్త రగడ మొదలైంది. యూనియన్ల పేరుతో దశాబ్దాలుగా హైదరాబాద్‌లో పాతుకుపోయిన ఓ నర్సింగ్ ఆఫీసర్‌ను రిటెయిన్ చేయడంపై ఇతర సిబ్బంది మండిపడుతున్నారు. ఆమెకు సంబంధం లేని ఉద్యోగ సంఘం నుంచి ఆఫీస్ బేరర్ లెటర్ తీసుకొచ్చిందని ఆరోపిస్తున్నారు.

రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్

- జీఏడీ కార్యదర్శిగా మహేశ్‌దత్ ఎక్కా నియామకం
- పలువురు ఐఏఎస్‌లకు బదిలీలు



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కేంద్ర సర్వీసుల నుంచి తిరిగి వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి వికాస్‌రాజ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయనకు రవాణా, హౌసింగ్, జీఏడీ (కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం, స్టాఫ్ గవర్నెన్స్)బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ముగ్గురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలలుగా వెయిటింగ్‌లో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి మహేశ్‌దత్ ఎక్కాకు జీఏడీ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడేనాటికి ఎంసీఆర్‌హెచ్ఆర్డీ డీజీగా ఉన్న ఆయనను ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో భూగర్భ, గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. అనంతరం మేలో జరిపిన బదిలీల్లో జీఏడీకి అటాచ్ చేసింది. హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా నియమించింది. వీరితోపాటు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ శరత్‌కు ఆ శాఖ కమిషనర్‌గా, సోస్టర్స్ డైరెక్టర్‌గా ఉన్న కొర్ర లక్ష్మికి గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీగా, ఆర్‌అండ్ బీ శాఖ సంయుక్త కార్యదర్శిగా ఉన్న ఎస్ హరీశ్‌కు విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి 4 నెలల్లోగా ఎన్నికలు

సహకార శాఖకు కోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు 4 నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సొసైటీ ఎన్నికలను నిర్వహించడం లేదంటూ టీ గోపాలరావు తదితరులు వేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. ప్రస్తుత కమిటీ సభ్యుల జోక్యం లేకుండా, ముగ్గురు సభ్యుల కమిటీ నివేదికతో ప్రమేయం లేకుండా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సహకార సంఘ అధికారిని ఆదేశించారు.

రెచ్చిపోయిన ఇసుకాసురులు



ఇసుక మాఫియా దాడిలో గాయపడిన కర్నె మహేందర్

- అర్ధరాత్రివేళ అక్రమంగా తరలింపు
- అడ్డుకున్న బీఆర్ఎస్ నేత తల పగులగొట్టిన మాఫియా
- భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో ఘటన

భీమ్‌గల్, జూలై 20: ఇసుకాసురులు రెచ్చిపోయారు. అర్ధరాత్రి వేళ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులపై దాడికి దిగారు. తమనే అడ్డుతారా? అంటూ రాళ్లు, కర్రలతో తల పగులగొట్టారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దారుణం చోటుచేసుకున్నది. బెజ్జోరా శివారులోని కప్పలవాగు నుంచి కొన్నాళ్లుగా అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అధికార పార్టీ కనుసన్నల్లో ఈ తతంగం సాగుతున్నది. దీనిపై గతంలోనే కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేసినా పెద్దగా స్పందన లేదు. శుక్రవారం అర్ధరాత్రి ముచ్కూర్ నుంచి భీమ్‌గల్ వైపు వస్తున్న బీఆర్ఎస్ యూత్ నేతలు కర్నె మహేందర్, అనిల్, నరేశ్‌కు ఇసుక ట్రాక్టర్లు ఎదురవడంతో.. వీరు వాటిని అడ్డుకోగా, ముచ్కూర్ భాస్కర్, శ్రీరాం రవి, రాజుతోపాటు పలువురు అక్కడికి చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ ఇసుకను ఎక్కడికి తరలిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించగా.. 'అడ్డుకోవడానికి మీరెవరు?' అని అడగడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. వెంటనే బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు సమాచారమిచ్చారు. భాస్కర్ అనే వ్యక్తి పెద్ద కర్ర తీసుకుని దాడికి యత్నించగా, కర్నె మహేందర్ ప్రతిఘటించారు. ఈ క్రమంలో కిందపడిపోయిన భాస్కర్ పక్కనే ఉన్న రాయితో దాడి చేయడంతో మహేందర్ తలకు తీవ్రగాయమైంది. సహచరులు హుటాహుటిన భీమ్‌గల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించి, చికిత్స చేయించారు. బాధితుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరిబాబు తెలిపారు.



గద్వాలలో కోర్టుల ప్రారంభం

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కేటీదొడ్డి క్యాంపులో ఏర్పాటు చేసిన అదనపు సీనియర్ సివిల్, అసిస్టెంట్ సెషన్స్ న్యాయస్థాన కార్యాలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే కుసుమ, కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ న్యాయమూర్తి గంట కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి పూజిత, అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి కంభపురం కవిత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘురాంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు. - గద్వాల

ఉద్యోగుల బదిలీల గడువు 31కి పొడిగింపు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ప్రభుత్వం మరో 10 రోజులు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 20లోగా బదిలీలను ముగించాలని ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ, వివిధ కారణాలతో ఆయా శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో ఆయా శాఖల విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు బదిలీలను పూర్తిచేయాలని ఆదేశించారు.

25న క్యాబినెట్ సమావేశం

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు శనివారం సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 9 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశం జరుగనున్నది. ఈ సందర్భంగా రాష్ట్ర బడ్జెట్‌ను క్యాబినెట్ ఆమోదించనున్నది.

తార్నాక 'ఆర్టీసీ'లో సీటీస్కాన్ సేవలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): తార్నాకలోని ఆర్టీసీ దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, ఎమర్జెన్సీ పర్యవేక్షణతో పాటు పిడియాట్రిక్ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. తొలుత దవాఖాన ప్రాంగణంలో మంత్రి మొక్కను నాటారు. కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగిస్తాం: టీఎస్‌హెచ్‌ఏ

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, ఆరోగ్య భద్రత కార్డులపై నగదు రహిత సేవలను కొనసాగిస్తామని తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(టీఎస్‌హెచ్ఏ) తెలిపింది. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో శనివారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని గతంలో హెచ్చరించిన నేపథ్యంలో.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వారితో చర్చలు జరిపారు. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా చెల్లించాల్సిన బకాయిలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి త్వరలోనే విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. నెలవారీగా చెల్లింపులు జరిగేలా చూస్తామని చెప్పారు. దీంతో టీఎస్‌హెచ్ఏ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నది.

ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు

- కార్మిక శాఖ పోస్టులపై టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : కార్మిక శాఖలో పోస్టుల భర్తీ కోసం ఆ శాఖతోపాటు టీజీపీఎస్సీ చేపట్టే నియామకాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు అమలుచేసే అంశాన్ని పరిశీలించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. థర్డ్ జెండర్ క్యాటగిరీకి రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర సబార్డినేట్ నిబంధనలను సవాలు చేస్తూ టీ విడుకొండలు అనే ట్రాన్స్‌జెండర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రాజేశ్వరరావు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. టీజీపీఎస్సీ, కార్మికశాఖ నియామకాల్లో థర్డ్ జెండర్లకు రిజర్వేషన్ కల్పించకపోవడాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. దీంతో ఉద్యోగ నోటిఫికేషన్లలో కుల రిజర్వేషన్లతో సంబంధంలేకుండా ట్రాన్స్‌జెండర్ రిజర్వేషన్ కింద పిటిషనర్ అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకునే అంశంపై కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది.

మాజీ ఎమ్మెల్యే కారు ఢీకొని మహిళ మృతి

మడికొండ, జూలై 20 : మాజీ ఎమ్మెల్యే కారు ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన హనుమకొండ జిల్లా మడికొండలో శనివారం రాత్రి జరిగింది. మడికొండ సీఐ ప్రతాప్ కథనం ప్రకారం.. మడికొండకు చెందిన కనుకుంట్ల స్వప్న(40)ఐఓసీఎల్ గార్డెన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా హనుమకొండ వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో స్వప్న అక్కడికక్కడే మృతి చెందింది. కాగా వాహనాన్ని రాజయ్య డ్రైవర్ నడుపుతున్నారు. సీఐ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించారు.

కమ్మవారి నైపుణ్యాలను ప్రోత్సహిస్తాం

- కమ్మవారు అమ్మలా ఆకలి చూస్తారు
- రాజకీయాల్లో బ్రాండ్ క్రియేటర్ ఎన్టీఆర్
- పన్ను కట్టే వారికి నిరసన తెలిపే హక్కు
- కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సభలో రేవంత్



హైటెక్స్‌లో కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ మహాసభలో రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కమ్మవారిలో నైపుణ్యాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కమ్మవారంటేనే అమ్మలాంటి వారని, అమ్మ వలె ఆకలి చూస్తారని అన్నారు. నేలను నమ్ముకొని కష్టపడి పని చేసేవారు కమ్మవారని కొనియాడారు. హైటెక్స్‌లో శనివారం నిర్వహించిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ మహాసభలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కమ్మవారు వ్యవసాయం చేసి పదిమందికి అన్నం పెడుతున్నారని, సారవంతమైన భూములున్నచోట కమ్మవారు ఉంటారని వ్యాఖ్యానించారు. కమ్మ సామాజికవర్గంతో తనకు ప్రత్యేకమైన సంబంధం ఉన్నదని అన్నారు. తాను ఎక్కడున్నా.. వాళ్లు ఎంతగానో అభిమానిస్తారని చెప్పారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన ఎన్టీఆర్.. రాజకీయాల్లో బ్రాండ్ క్రియేట్ చేశారని, ఎంతో మందికి రాజకీయ జీవితాన్ని ఇచ్చారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరిపై వివక్ష ఉండదని, అది తమ ప్రభుత్వ విధానం కాదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ఒక హక్కు అని, పన్నులు కట్టే ప్రాంతంలో ప్రజలకు నిరసన తెలిపే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. వివాదంలో ఉన్న ఐటీఐ రాల కమ్మ సంఘం భూ సమస్యను పరిష్కరిస్తామని, భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చడంలో భాగస్వామ్యం కావాలని కమ్మ వారికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర కమ్మ నాయకులు పాల్గొన్నారు.

50 వేల కోట్లు.. 71 వేల కోట్లు.. 1.5 లక్షల కోట్లు!

మూసీ సుందరీకరణపై మూడు నెలల్లో పెరిగిన అంచనాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ): మూసీ ప్రక్షాళన అంచనా వ్యయం కేవలం మూడు నెలల్లోనే రూ.50వేల కోట్ల నుంచి రూ. లక్షన్నర కోట్లకు పెరిగింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏప్రిల్ 21న కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ తరఫున ప్రచారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి రూ.50వేల కోట్లతో మూసీని ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 14న ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నివారి టీవరక్‌లో రూ.71వేల కోట్లతో మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. శనివారం గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేండ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టి మూసీకి ఊపిరిపోస్తామని అన్నారు. అంటే కేవలం మూడు నెలల్లోనే రూ.50వేల కోట్ల నుంచి రూ.లక్షన్నర కోట్లకు వ్యయం పెరిగినట్టు అర్థమవుతున్నది.



అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్

- ఇకపై ప్రతి మార్చిలోగా అన్ని శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలు తెప్పించుకుంటాం
- జూన్ 2లోగా నోటిఫికేషన్.. డిసెంబర్ 9లోగా నియామకాల ప్రక్రియను పూర్తి చేస్తాం
- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లోనే జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెడుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇక నుంచి ప్రతిఏటా మార్చిలోగా అన్ని శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలు తెప్పించుకుంటామని తెలిపారు. జూన్ 2వ తేదీలోగా ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్ 9వ తేదీలోగా నియామకాల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం సింగరేణి సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్సార్)లో భాగంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష పాసైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల్లో అర్హులకు లక్ష రూపాయల ఆర్థికసహాయం అందించే 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం' ప్రారంభోత్సవంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగాల కోసమే తెలంగాణ పోరాటం జరిగిందని, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన చెప్పారు. సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో విజయం సాధించినవారికి మెయిన్స్ కోచింగ్ స్టడీ మెటీరియల్, హాస్టల్ ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిఏటా రాష్ట్రం నుంచి సివిల్స్‌కు 50 వేల మంది దరఖాస్తు చేసుకుంటున్నారని, వీరిలో సుమారు 250-300 మంది మెయిన్స్‌కు అర్హత సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2023లో రాష్ట్రం నుంచి సివిల్స్‌కు ఎంపికైన 35 మందిని, ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన ఆరుగురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఎంపీలు రామసహాయం రఘురామిరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, వివేక్ వెంకటస్వామి, పాయం వెంకటేశ్వర్లు, కే ప్రేమ్‌సాగర్‌రావు, మక్కన్ సింగ్‌రాజ్ ఠాకూర్, మట్టా రాగమయి, వేతన సవరణ కమిషన్ చైర్మన్ జనక్‌ప్రసాద్, ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సీఎంవో సెక్రటరీ మాణిక్‌రాజ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట సమావేశంలో స్టేజీ పైనే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఇన్‌సెట్‌లో పుష్ప

శ్రీధర్‌బాబుకు 'కరెంటు బిల్లు' షాక్

- 200 యూనిట్ల బిల్లు మాఫీ అయ్యిందా అని అడిగిన మంత్రి
- కాలేదని ముక్తకంఠంతో మహిళల వెల్లడి.. ఉలిక్కిపడ్డ అమాత్యుడు
- జవాబుదారీతనం పదని అధికారుల తీరుపై శ్రీధర్‌బాబు ఆగ్రహం

బడంగ్‌పేట, జూలై 20: ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు 'కరెంటు బిల్లు' షాక్ తగిలింది. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. సమావేశంలో మాట్లాడుతూ 200 యూనిట్ల వరకు కరెంటు బిల్లు మాఫీ అయ్యిందా? అని మహిళలను అడిగారు. ఎక్కడ సార్.. కాలేదు అని ఒక్కసారిగా ముక్తకంఠంతో మహిళలు సమాధానమిచ్చారు. దీంతో ఉలిక్కిపడ్డ మంత్రి.. అధికారులను వివరణ కోరుతూ.. జవాబుదారీతనం లేకపోవటంపై మండిపడ్డారు.

మహిళలతో మంత్రి శ్రీధర్‌బాబు సంభాషణ ఇలా..

- మంత్రి: మీకు 200 యూనిట్ల కరెంటు బిల్లు మాఫీ అయ్యిందా?
  మహిళలు: ఎక్కడైంది సారు? కాలేదు.
- మంత్రి: ఎందుకు కాలేదు?
  మహిళలు: ఏమో సారు తెల్వదు.
- మంత్రి: నీ పేరు ఏంటమ్మా?
  మహిళ: పుష్ప సారు. నెల కిందట దరఖాస్తు ఇచ్చిన. మున్సిపల్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా ఎవరూ సమాధానం చెప్తలేరు.
- మంత్రి: కమిషనర్ ఎక్కడ? పుష్పకు ఎందుకు కరెంటు బిల్లు మాఫీ చేయటం లేదు?
  కమిషనర్: ఏమో సర్
- మంత్రి: ఆమె దరఖాస్తు ఎక్కడ ఉన్నది? ఇప్పటి వరకు ఎన్ని వచ్చాయి? వాటిని పరిశీలిస్తున్నారా?
  కమిషనర్: దరఖాస్తులు పరిశీలిస్తాను సర్

అధికారులకు మంత్రి చీవాట్లు

అధికారుల తీరుపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేజీపైనే వారిని చీవాట్లు పెట్టారు. అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవో సూరజ్‌కుమార్, తహసీల్దార్ మాధవిరెడ్డి, ఏసీపీ కాశిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవికుమార్ పనితీరుపై మండిపడ్డారు. విద్యుత్తు అధికారులనూ వదల్లేదు.

కరెంటు పోకుండా కాపలా..

మంత్రి సమావేశానికి విద్యుత్తు అంతరాయం లేకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. దాదాపు 20 మంది కాపలా కాశారు. దీనిపై కొందరు పోలీసుల కన్నా తామే కాపలా కాయాల్సి వస్తుందని వాపోయారు.

ప్రతి ఇంటికి ఉచిత కరెంట్ ఇస్తున్నం

- 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నం.. 6 గ్యారెంటీలు అమలు చేస్తున్నం
- స్వచ్ఛందంగానే కాంగ్రెస్‌లోకి వలసలు: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రతి ఇంటికి 200 యూనిట్ల దాకా ఉచిత కరెంటు ఇస్తున్నారని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నారని, ఆరు గ్యారెంటీలను అద్భుతంగా అమలు చేస్తున్నారని, రాష్ట్రంలో అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం సచివాలయం మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ సర్కార్ పాలన చూసే ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు స్వార్థంతో వివిధ పత్రికలు ఇచ్చి రాజకీయం చేస్తున్నారని, కాంగ్రెస్‌లోకి వచ్చే బీఆర్ఎస్ నాయకులంతా స్వచ్ఛందంగానే వస్తున్నారని తెలిపారు. వారి నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకునేందుకు పార్టీ మారుతున్నారని చెప్పారు.



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఉద్యోగాలపై మేధావుల పాప్యులిజం

పాప్యులిజం అనే మాటను సాధారణంగా రాజకీయ నాయకులతో ముడిపెట్టి మాట్లాడుతుంటాము. అటువంటిది మేధావులతో ముడిపెట్టడం ఆశ్చర్యంగా తోచవచ్చు. కానీ వారు ఉద్యోగ, ఉపాధి విషయాలపై వ్యవహరిస్తున్న తీరును చూసినప్పుడు ఇంతకన్న సరైన పదం మరొకటి కనిపించటం లేదు. ఇప్పుడు ఉద్యోగ, ఉపాధులపై మేధావులది పాప్యులిస్టు ధోరణిగా మారుతున్నది. అట్లా ఎందుకో విచారిద్దాము. ఉద్యోగార్థులైన యువతీ యువకులది జీవన ఆరాటం. అది వారికి తక్షణ సమస్య అయినందున ఉద్యోగ-ఉపాధి రంగంపై సమగ్ర దృష్టి తీసుకోవాలని, థియరెటికల్‌గా ఆలోచించాలని, సమస్యకు మౌలిక పరిష్కారాలను అన్వేషించాలని వారికి బోధనలు చేయలేము. అటువంటి అవగాహనలు మేధావులు అయినవారికి మాత్రం తప్పక ఉండాలి. అట్లా ఉన్నప్పుడు కొన్ని జరుగుతాయి. వారు నిరుద్యోగులకు తప్పు అవగాహనలు కల్పించరు. రెచ్చగొట్టరు. వారి పట్ల సానుభూతి చూపుతూనే నిరుద్యోగ సమస్యపై అవసరమైన సమాచారాలను వారి ముందుంచుతారు. అందులో తక్షణ దృష్టితో పాటు సమగ్రమైన దీర్ఘకాలిక దృష్టి కూడా ఉంటుంది. అటువంటి వారే నిరుద్యోగుల బాగును నిజంగా కోరే నిజాయతీ గల మేధావులవుతారు. కాని మన మేధావులు ఈ విషయంలో పాప్యులిస్టులుగా మారుతున్నారు.



టంకశాల అశోక్

ఇతర దేశాలలో పరిస్థితి ఏ విధంగా ఉందో గాని, దురదృష్టవశాత్తు మన దేశంలో ఇటువంటి మేధావులు తగ్గిపోతున్నారు. గతంలో దాదాపు అందరూ అటువిధంగా ఉండేవారు. ఆ రోజుల్లో ఉండటానికి, ఇప్పుడు తగ్గుతుండటానికి కారణాలు ఏమై ఉంటాయి? వారు లోగడ మేధావులుగా ఉంటూనే ఏవో రాజకీయ విశ్వాసాలు వారు కలిగి ఉండేవారు. ఆ మేరకు తమ అభిప్రాయాలను, రాజకీయ సానుభూతులను మేధోరంగానికి పరిమితమై వ్యక్తపరిచేవారు. సాధారణంగా వామపక్ష మేధావులు మాత్రం ఆ పార్టీల క్షేత్రస్థాయి కార్యక్రమాలతో మమేకమవుతుండేవారు. ఆ కాలంలో రాజకీయ పాప్యులిజం కూడా పరిమితంగా ఉండేది. ఈ పరిస్థితి ముఖ్యంగా గత 40 ఏండ్లుగా మారుతూ వస్తున్నది. మధ్యేమార్గ రాజకీయాలకు, మితవాద రాజకీయాలకు చెందిన మేధావులు, నిర్దిష్టంగా ఒక రాజకీయం లేకున్నా ఉదారవాదులు, ప్రజాస్వామికవాదులు అయిన మేధావులు అనేకులు తమ మేధో కార్యకలాపాల పరిధిని దాటి, క్షేత్రస్థాయి విషయాలతో సంబంధం పెట్టుకోవటం, అందుకు స్పందించటం మొదలైంది.

నిజానికి మేధావులు క్షేత్రస్థాయికి కదలిరావటం ఆహ్వానించదగినదే. కాని ఆ క్రమంలో అవాంఛనీయమైనవి కొన్ని కన్పించసాగాయి. స్వప్రయోజనాలు, స్వీయ ప్రచారాభిలాషలు, పార్టీలతో అనుకూలమైన సంబంధాలు, ఒకవేళ పార్టీలతో ప్రత్యక్ష సంబంధాలు లేకపోయినా ఈ మొత్తం వలయంలో చిక్కుకుని సమయానుకూలంగా వ్యవహరించటం. మేధావులకు తప్పనిసరి అయిన నిష్పాక్షికతను, స్వార్థరాహిత్యాన్ని వదులివేయటం వంటివి. ఇవి జరిగినప్పుడు సహజంగానే, పైన చెప్పుకున్న తరహా గత కాలపు మేధావి లక్షణాలకు వారు దూరమవుతారు. ఇదొక స్పష్టమైన పరిణామం. ఇటువంటి స్థితి నుంచే ఈ కొత్త దశలో వారి పాప్యులిస్టు మేధావితనం ముందుకొచ్చింది.

> **మొదట ప్రస్తావించిన ఉద్యోగ, ఉపాధి అంశాన్నే తీసుకుని ఈ విషయం చర్చిద్దాము. ఉదాహరణకు తెలంగాణలో 30 లక్షల మంది నిరుద్యోగులున్నారన్నది కొందరి అంచనా. అది నిజమైనా కాకపోయినా వారు భారీ సంఖ్యలో ఉన్నారనేది మాట వాస్తవం. ఎక్కడైనా, ఎవరికైనా విద్యావంతులకు జీవనోపాధి లభించేది మూడు విధాలుగా. ఒకటి ప్రభుత్వరంగం, రెండు ప్రైవేటురంగం, మూడు స్వయం ఉపాధి రంగం.**

వీటిలో మొదటిది ఎప్పుడైనా పరిమితమే. రెండవది యథాతథంగా అపారమైనది. కానీ టెక్నాలజీ ఆధునీకరణ వల్ల అవకాశాలు వేగంగా తగ్గుతున్నాయి. స్వయం ఉపాధి రంగం కూడా అపారమైనదే అయినా దానిపై సైతం టెక్నాలజీ ఆధునీకరణలు ప్రభావం చూపుతున్నాయి. తిరిగి మొదటి అంశానికి వస్తే, మన దేశంలో 30 ఏండ్ల నుంచి వచ్చిన ఆర్థిక సంస్కరణలు, పరిపాలనా సంస్కరణల వల్ల ప్రత్యక్ష ఉద్యోగాలు



తగ్గటం, ఖాళీలను భర్తీ చేయకపోవటం, కాంట్రాక్టు ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగుల పద్ధతి పెరిగిపోతున్నది. ప్రభుత్వరంగ సంస్థల మూసివేతలు, ప్రైవేటీకరణలతో సమస్య మరింత తీవ్రమవుతున్నది. నిరుద్యోగ సమస్యను ఎప్పటికప్పుడు పెంచుతున్న ఈ పోకడలు లేకుంటే ఏదీ నిలిచిపోయే అవకాశం కనుచూపు మేరలో లేదు. అందువల్ల యువకులు ప్రాణాలపై సైతం ఆశలు వదులుకొని యుద్ధ క్షేత్రాలైన ఇజ్రాయెల్, ఉక్రెయిన్‌లకు తరలిపోతున్నారు.

ఈ యాదార్థ పరిస్థితులు మేధావులకు తెలియవని ఎంతమాత్రం భావించలేం. అటువంటప్పుడు వారు చేయవలసినవి మూడున్నాయి. ఒకటి, నిరుద్యోగులకు పూర్తి సానుభూతి తెలుపుతూ వారి ఆందోళనలకు మద్దతు ప్రకటించటం. అది తక్షణ కర్తవ్యం. రెండు, పైన చెప్పుకొన్న నిరుద్యోగ పరిస్థితి కారణాలను వారికి వివరించటం. అది దీర్ఘకాలిక అవసరం. మూడు, అసలు ఈ సమస్య లోలోతుల్లో ఉన్నది మౌలికమైన విషయం గనుక, కేవలం కారణాల వివరణతో పరిష్కారం లభించదు గనుక, వ్యవస్థలో మార్పుల వల్ల గాని ఆ మౌలిక పరిష్కారం జరుగదు గనుక, వారికి అటువంటి అవగాహనను కల్పించి ఆ దిశగా కదిలించటం. కానీ ఈ మేధావులు అటువంటి పనులేవీ ఎంత మాత్రం చేయటం లేదు. కొన్ని సులభ సూత్రాలను మాత్రం ప్రకటించి నిరుద్యోగులను వంచించే అన్యాయం కూడా చేస్తుంటున్నారు. ఉదాహరణకు వారిలో కొందరు ఉద్యోగ హక్కును ప్రభుత్వాలు చట్టంగానే చేయాలని, అట్లా చేసినట్లయితే నిరుద్యోగులు తమ హక్కు అమలు కోసం కోర్టుకు వెళ్లే వీలుంటుందని అంటున్నారు. ఇది వినేందుకు గొప్పగా తోస్తుంది గాని ఆచరణలో సాధ్యమా? అటువంటి చట్టాలు మన దేశంలో గాని, ఇతర ప్రజాస్వామిక దేశాల్లో గాని ఎక్కడైనా ఉన్నాయా? ఏటా కొన్ని లక్షల మంది డిగ్రీలు చేసి విద్యాసంస్థల నుంచి బయటకు వస్తున్నారు. అన్ని లక్షల మందికి ఏటా ఒక చట్టపరమైన హక్కుగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం జరిగే పనేనా? అందుకే వీరిని పాప్యులిస్టు మేధావులనటం.


ఈ మేధావులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే సమస్య పరిష్కారానికి కొన్ని పనులు చేయవచ్చు. పూర్తి పరిష్కారం కాకున్నా వీలైనంత మేర. యువకులలో, వారి కుటుంబాలలో, సమాజంలో ఈ సమస్య మౌలిక కారణాలపై, అందుకు మౌలిక పరిష్కారాలపై చైతన్యం తీసుకురావటం. తమతో ఏకీభావం గల సంస్థలను వెంట తీసుకోవటం. ఇక కార్యాచరణకు సంబంధించి, ఆర్థిక సంస్కరణల వల్ల, పరిపాలనా సంస్కరణల వల్ల ఎక్కడెక్కడైతే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో తగ్గుతూ వస్తున్నాయో ఆ చర్యలు నిలువరింపజేయటం. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను బలంగా ఆపటం. ప్రైవేటురంగానికి ఈ దేశపు నేల, నీరు, సహజ వనరులు, ఆర్థిక వనరులు, ప్రభుత్వ రాయితీలు, వ్యాపార సౌలభ్యాలు లభించాలంటే అందుకు తగినన్ని ఉపాధి అవకాశాలను, ఉద్యోగాలను ఇవ్వటమన్న గ్యారంటీతో పెంచి తీరాలన్న చట్టాలు చేసి అమలు జరిగేట్లు చూడటం. మూతబడ్డ తప్పు వ్యవసాయరంగంలో, గ్రామీణ వృత్తుల ఆధునీకరణ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోతుండటాన్ని అరికట్టి గణనీయంగా పెంచటం. విద్యావంతులకు విస్తృతంగా సాంకేతిక శిక్షణల కల్పన. ఈ విధమైన చర్యల వల్ల గాని ఇంత పెద్ద దేశంలో ఉద్యోగ, ఉపాధి సమస్యలు ఒక మేరకైనా, క్రమక్రమంగానైనా అదుపులోకి రావు.

> **ఉద్యోగ, ఉపాధి సమస్యలు చివరికి సంపన్న దేశాల్లోనూ ఒక మేర ఉన్నాయి. ఇతర వ్యవస్థల గురించి చెప్పనక్కరలేదు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌ను కల్లోలంగా కుదిపివేస్తున్నది అదే. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలన్న మోదీ ప్రభుత్వం విఫలం కావటానికి కారణం ఆయన కాదు, ఆయన పాటిస్తున్న వ్యవస్థ. అమెరికా అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, తన ప్రణాళిక అంటూ గత మంగళవారం ప్రకటించిన 20 సూత్రాలలో, ఔట్‌సోర్సింగ్‌ను అరికడతామంటూ ఇచ్చిన హామీకి కారణం అక్కడి నిరుద్యోగ సమస్య. ఈ సమస్య ప్రస్తుత యూరోపియన్ ఎన్నికల సరళిని ప్రభావితం చేస్తున్నది. ప్రపంచమంతటా పరిస్థితి సరేసరి.**

అందువల్ల మేధావులు నిరుద్యోగుల పట్ల కపటత్వాన్ని మానివేయాలి. తమకు నచ్చని పార్టీలపై వారిని రెచ్చగొట్టడం, నచ్చినవారు గెలవగానే మౌనం వహించటం, ఉద్యోగ హక్కు చట్టాలంటూ అసాధ్యమైన పాప్యులిస్టు మాటలతో మభ్యపెట్టడం వంటివి వారికి తగవు. అందువల్ల తమకేదైనా ప్రయోజనాలు నెరవేరుతాయేమో గాని, యువతీ యువకులకు లభించేది శూన్యం. ■

ఏ ప్రభుత్వమైనా సరే పేదల అభ్యున్నతి కోసం, వారు గౌరవంగా జీవించటానికి, వారి జీవన ప్రమాణాలను పెంచటానికి కృషి చేస్తుంది. అందుకనుగుణంగా పథకాలను రూపొందిస్తుంది. ప్రాధాన్య క్రమంలో అమలు చేస్తుంది. కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నది. పథకాల పేరిట ప్రజలను ఆకర్షించి, ఓట్లు దండుకున్నది. ఇప్పుడు ఉన్నవాళ్లకే పథకాలను వర్తింపజేస్తూ.. పేదలు, సమాజంలో వివక్షను ఎదుర్కొంటున్న, నిస్సహాయులైన వృద్ధులు, దివ్యాంగులను విస్మరిస్తున్నది.

దివ్యాంగులకు మొండిచెయ్యి



దుర్గం వెంకన్న
62816 24720

సమాజంలో దివ్యాంగులు, వృద్ధులు నిత్యం వివక్ష ఎదుర్కొంటున్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నది. కానీ, కాంగ్రెస్ సర్కార్ ఆ బాధ్యతను విస్మరిస్తున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగులకు, వృద్ధులకు ఇచ్చిన పింఛన్ పెంపు హామీని నెరవేర్చలేదు. అధికారంలోకి రాగానే ఫ్రీ బస్సు హామీని అమలు చేసిన రేవంత్ సర్కార్.. ఇప్పుడు తాజాగా రైతు రుణమాఫీపై దృష్టిసారించింది. మానవీయ కోణంలో వాటి కంటే ముందే అమలు చేయాల్సిన పింఛన్ పెంపును మాత్రం ఇప్పటికీ పట్టించుకోవటం లేదు.

తాము అధికారంలోకి వస్తే వెంటనే సాధారణ పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అంతేకాదు, దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని వాగ్దానం చేసి ఓట్లు వేయించుకొని ఇప్పుడు మాట తప్పింది.

ఇటీవల ప్రతి గ్రామంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, అవి మహిళలకు కేటాయిస్తామని, అందుకోసం వారికి 2.50 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఇలాంటి స్వయం ఉపాధి



పథకాలను కూడా సకలాంగులకే కేటాయిస్తే, దివ్యాంగులు బతికేదెట్లా?

> **కేసీఆర్ సర్కార్‌పై దుష్ప్రచారం చేసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను మాయమాటలతో మోసం చేసి ఓట్లు వేయించుకున్న రేవంత్ ఇప్పుడు వారిని పట్టించుకోవటం లేదు. నూతన పింఛన్ల కోసం తీసుకున్న దరఖాస్తులూ అటకెక్కాయి.**

2014లో కొత్తగా ఏర్పడిన తెలంగాణలో అప్పటి సీఎం కేసీఆర్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అయినా అధికారంలోకి వచ్చిన ఒక్క నెలలోనే వృద్ధులకు రూ.వెయ్యి, దివ్యాంగులకు రూ.1500 పింఛన్‌ను అందజేసిన మహనీయుడు కేసీఆర్. రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే, ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధులకు రూ.2,016, దివ్యాంగులకు రూ.3016 పింఛన్‌ను అందించారు. దివ్యాంగుల ఆవేదనను గ్రహించి, మానవీయ కోణంలో ఆలోచించి పింఛన్‌ను రూ.4016కు పెంచిన ఆత్మబంధువు కేసీఆర్.

పింఛన్ల మీదే ఆధారపడి జీవిస్తున్న నిస్సహాయులైన వృద్ధులు, దివ్యాంగుల పొట్టకొట్టి, వారి నోటి కాడి బువ్వను రుణమాఫీ పేరిట భూములు ఉన్నోళ్లకు రేవంత్ పంచుతున్నారు. దివ్యాంగులు, వృద్ధులు అడగలేరు, ప్రశ్నించలేరనే ఉద్దేశంతోనే రేవంత్ సర్కార్ ఈ విధంగా వ్యవహరిస్తున్నది. నిస్సహాయులైన వృద్ధులు, దివ్యాంగులు రోడ్డెక్కి నిరసనలు తెలిపే పరిస్థితి రావటం రేవంత్ సర్కార్‌కు సిగ్గుచేటు. ■



పార్లమెంట్‌లో అంబేద్కర్ గళం!

2024-25 కేంద్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో పార్లమెంట్‌లో జరగబోయే చర్చల పట్ల దళిత, బహుజన, మైనారిటీ ప్రజలు ఆసక్తిగా ఉన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా ప్రపంచ దేశాల ఆర్థిక సూచీలో ఇంకా 14వ స్థానంలో ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. మన దేశంలో ఇంకా అస్పృశ్యత, కుల వివక్ష, అత్యాచారాలు, అణచివేత, నిరక్షరాస్యత కొనసాగడానికి ప్రధాన కారణం దేశాన్ని 75 ఏండ్లు పాలించిన వివిధ పాలకవర్గాల ఆర్థిక, సామాజిక దోపిడీ విధానాలే అన్నది సుస్పష్టం.



డాక్టర్ కత్తి పద్మారావు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అస్పృశ్యత నివారణ చట్టం అమలుపై కాని, ఆర్టికల్ 17లోని కుల నిర్మూలన భావాలకు సంబంధించిన అంశాల పట్ల గాని విపక్ష నాయకులైన రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, చిదంబరం తదితరులు పార్లమెంట్‌లో చర్చ లేవనెత్తకపోవటం విచారం. ఏ రాజ్యాంగాన్ని అయితే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు పార్లమెంట్‌లో తన చేతితో ఎత్తి చూపిస్తున్నారో.. ఆ రాజ్యాంగంలో ఉన్న ప్రధాన అంశం అస్పృశ్యత లేని భారతదేశాన్ని సృష్టించడమే. అలా సృష్టించాలంటే దళితులకు భూమి పంపిణీ, విద్యాభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన, ఉద్యోగ కల్పన, ఉన్నత విద్యావకాశాలు కల్పించడం ప్రధానమైనవి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఈ అంశాలను ఆ రోజుల్లోనే వాదించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. మతసామరస్య వాదం వల్ల అస్పృశ్యత పోతుందా? బౌద్ధ సాంస్కృతిక విప్లవం వల్ల పోతుందా? అనే అంశాన్ని అధికారపక్షం, విపక్షం అర్థం చేసుకోవాలి. దళితులకు భూ పంపిణీ ద్వారానే దేశ సంపద పెరుగుతుందని అంబేద్కర్ చెప్పిన ఆర్థిక సామ్యవాదాన్ని రెండు పక్షాలు అర్థం చేసుకోలేకపోతున్నాయి. నిజానికి అంబేద్కర్ కృషి వల్ల అస్పృశ్యతను ఒక నేరంగా రాజ్యాంగం పరిగణిస్తున్నప్పటికీ.. ఇంకా దేశంలోని లక్షలాది గ్రామాల్లో అస్పృశ్యత వెంటాడుతూనే ఉన్నది. దీనికి స్పష్టమైన కారణాలను పార్లమెంటు చర్చల ద్వారా సాధించలేకపోతున్నారు. అంబేద్కర్ రాజ్యాంగ చర్చల సందర్భంగా సోషలిస్టు సిద్ధాంతాల నుంచి రాజ్యాంగం రూపొందిందని, కానీ దీనిలో నుంచి సోషలిజాన్ని సాధించాలని పేర్కొన్నారు. కానీ, ఆచరణలో ధనస్వామిక శక్తుల అభివృద్ధికే గత ప్రభుత్వాలు పాటుపడ్డాయి. ఈ విధమైన అసమ సమాజ సృష్టి కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాయలేదు. అంబేద్కర్ 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' అనే గ్రంథాన్ని రాజ్యాంగ రచనకు ముందే ప్రచురించారు. అందులో ఆస్తిని జాతీయం చేయాలని.. అప్పుడే ప్రజలకు ఆర్థిక, సామాజిక న్యాయం జరుగుతుందని చెప్పారు.

సామాజిక అసమానతలతో నిండిన ఈ వ్యవస్థలో కుల, మత, జాతి ఆధారంగా వివక్ష చూపితే ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని రాజ్యాంగ చర్చల్లో అంబేద్కర్ నొక్కి వక్కాణించారు. మతరహిత రాజ్యాంగ పద్ధతే సెక్యులర్ విధానమని రాజ్యాంగ చర్చల్లో ఆయన వివరించారు. మతం వ్యక్తిగతమని, రాజ్యాంగం వైజ్ఞానికంగా, జ్ఞానపరంగా నడవాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ సొమ్మును మత బోధనలకు, మత కార్యకలాపాలకు ఉపయోగించరాదని రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ స్పష్టం చేస్తున్నది. సెక్యులరిజం అంటే మత ప్రమేయం లేని రాజ్యం అని అర్థం. దాన్ని ఇరుపక్షాలు ఆదరించవలసిన అవసరం ఉన్నది. వాస్తవానికి పార్లమెంటులో బడుగు వర్గాల జీవన స్థితిగతులను మెరుగుపరచడం కోసమే చర్చ జరగాలి. కానీ, మతపరమైన అంశాలకే ఎక్కువ సమయం కేటాయిస్తూ విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి గురించి, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు మూలమైన మద్యపాన నిషేధం, మత్తుపదార్థాల వంటి విషయాలపై పార్లమెంట్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్‌తో పాటు రామ్ మనోహర్ లోహియా కూడా కులాధిపత్య భారత రాజకీయ వ్యవస్థ మీద చర్చ పెట్టారు. భారత రాజకీయాల్లో కులం నిర్వహిస్తున్న పాత్రను తక్కువ అంచనా వేయరాదనే అంశాన్ని లోహియా నొక్కిచెప్పారు. దళితుల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి విశ్వవిద్యాలయాల్లో ఎక్కువ నిధులు ఇచ్చి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాలని అంబేద్కర్ చెప్పారు. అందుకు ఆయన మొదటి ప్రణాళికలోనే నిధులను కేటాయించారు. 111 మంది ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఉన్న భారత పార్లమెంటులో దళిత, బహుజనుల ఆర్థిక, సామాజికాభివృద్ధి గురించి వారు ఎక్కువ మాట్లాడకపోవటం ఆశ్చర్యకరం.

అంబేద్కర్ ఎన్నో కష్టాలకోర్చి, పోరాటాలు చేసి రాజకీయ రిజర్వేషన్లు సాధించారు. అయితే ఆ హక్కులు నెరవేర్చే క్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంపీలు పోరాడుతున్నారా? అనేదే ప్రశ్న. వివిధ పార్టీల్లో ఉన్నప్పటికీ 1989లో ఏపీ దళిత మహాసభ ఆధ్వర్యంలో 1989 ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్‌ను సాధించారు. ఇప్పుడు మళ్లీ అదే చైతన్యం దళిత ఎంపీల్లో రావాలి. అట్రాసిటీ యాక్ట్‌ను దేశంలో బలంగా అమలు జరిపించాలని వారు వాదించగలగాలి.

> **బీసీ అంటే వెనుకబడిన కులం అని కాదు, వెనుకబడిన తరగతి అని అర్థం. వారు కులాలు కావచ్చు, బౌద్ధులు కావచ్చు, క్రైస్తవులు, ముస్లింలు కావచ్చు. స్వాతంత్య్రం నాటికి వీరి మధ్య ఐక్యత లేదు. వీరికి జనగణన లేదు. మన రాజ్యాంగ నిర్మాత వీరి కోసమే రాజ్యాంగంలో 340 ఆర్టికల్‌ను పొందుపరిచారు.**

ఆ తర్వాత ఈ ఆర్టికల్‌ను అమలు చేయడానికి, బీసీల జనాభా లెక్కలు తేల్చడానికి మొదట



కాకా కాలేల్కర్ కమిషన్, 1992 నుంచి మండల్ కమిషన్ అమలవుతూ ఉంది. అయితే ఇప్పటికీ చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ లేదు. అంబేద్కర్ బీసీల కోసమే మొదటి ప్రాధాన్యమిచ్చి 340 ఆర్టికల్, ఆ తర్వాతే ఎస్సీ, ఎస్టీల కోసం 341, 342 ఆర్టికల్‌లను రాజ్యాంగంలో పొందుపరిచారు. బీసీల అభ్యున్నతి కోసం వారి ఆర్థిక, సామాజిక అంశాల మీద, సామాజిక న్యాయం కోసం 340 ఆర్టికల్‌ను తీసుకువస్తే, బీసీలు మత ఛాందసవాదులకు, దైవానికి తలవంచి, అగ్రకులాలకు బానిసలై బీసీల విముక్తి ప్రదాత అయిన అంబేద్కర్‌ను మరిచిపోయి మానసిక బానిసత్వంలో బతుకుతున్నారు.

బీసీ సమాజం ఒక గొప్ప సమాజం. వారికి సామాజిక న్యాయం జరగడం కోసం పార్లమెంటులో బహు సంఖ్యాకులుగా ఉన్న బీసీ ఎంపీలు పోరాడవలసిన చారిత్రక అవసరం ఎంతో ఉన్నది. దేశంలో పేద ప్రజలకు ఉచితంగా ధనం ఇవ్వడం కంటే వారిలో ఉన్న వ్యవసాయ కూలీలకు భూమి, యువకులకు గ్రామీణ పరిశ్రమలు, విద్యావంతులకు ఉద్యోగ కల్పన పెంచాల్సిన అవసరం ఉన్నది. కాంగ్రెస్ మేధావులుగా పేరొందిన చిదంబరం వంటి వారు రాహుల్‌గాంధీతో సహా వామపక్షాలు కూడా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి వాటిపైనే మాట్లాడుతున్నారు గాని, అణగారిపోతున్న దళితులకు ఇటు గ్రామంలోనూ పని లేదు, అటు పట్టణంలోనూ నిల్వ నీడలేదనే విషయాన్ని మరిచిపోతున్నారు. ఇంతటి దుర్భర పరిస్థితుల్లో ఉన్నవారి సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లే అంబేద్కర్, ఫూలే తాత్విక దృష్టి వీరికి కనిపించటం లేదు. రాబోయే బడ్జెట్‌లో దళితులు, మహిళలు, బీసీలకు ఉపాధి రంగాల్లో విస్తృతం చేయడం కోసం ప్రతి గ్రామంలో పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు పెట్టాలి. వాటిలో తయారయ్యే వస్తువులను ఇతర దేశాలకు మార్కెట్ చేసే విధానాలను రూపొందించాలి. అంబేద్కర్ ఆర్థిక ప్రణాళిక మార్గంలో దేశ సంపదను అభివృద్ధి చేసుకోవటం కోసం స్వయం ప్రతిపత్తి, స్వయం జీవన సంస్కృతిని పెంచే మార్గంలో బడ్జెట్ రూపకల్పన కోసం పార్టీలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు పోరాడాల్సిన చారిత్రక సందర్భం ఇది.

ఈ సందర్భంగా అంబేద్కర్ 1937 డిసెంబర్ 31న కాన్ఫరెన్స్ ఆఫ్ ద డిప్రెస్డ్ క్లాసెస్‌లో అంబేద్కర్ మాట్లాడుతూ దళిత బహుజనులకు, స్త్రీలకు ఆత్మగౌరవం, స్వయం సహాయక శక్తి ఉద్యమ స్ఫూర్తి రావాలని అన్నారు. తమ ముందు మూడు సమస్యలున్నట్లు చెప్పారు. మొదటిది.. హిందూ సమాజంలో అణగారిన వర్గాలు ఏ కాలక్కైనా సమాన ప్రతిపత్తి పొందుతాయా, లేదా? రెండోది.. వారు జాతీయ సంపత్తిలో సరైన వాటా పొందగలరా, లేదా? మూడోది.. ఆత్మగౌరవ, స్వయం-సహాయక ఉద్యమాల గతి ఏమిటి?

మొదటి అంశానికి సంబంధించి, కుల వ్యవస్థ ఉన్నంతకాలం అది సాధ్యం కాదన్నారు. రెండో అంశానికి సంబంధించి, పెట్టుబడిదారుల నేతృత్వంలోని కాంగ్రెస్ అణగారిన వర్గాల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నంత వరకు ప్రస్తుత ప్రభుత్వం అణగారిన వర్గాల అభ్యున్నతికి ఏదో చేస్తుందని నమ్మలేమని చెప్పారు. దోపిడీకి ఎగబడిన పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఒక యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఆర్థిక స్వాతంత్య్రం సాధించుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని అణగారిన వర్గాలవారికి ఉద్బోధించారు. ఇక మూడో అంశానికి సంబంధించి ఒక విషయం జ్ఞాపకం పెట్టుకోవాలని ప్రజలకు సూచించారు. ఉద్యమం వల్ల లాభాలే తప్ప పోగొట్టుకోవడానికి ఏమీ లేదని, వారు చావు భయం పోగొట్టుకోవాలని సందేశం ఇచ్చారు. ఆయన ఆశయాల మార్గంలో పార్లమెంట్‌లోని దళిత, బహుజన, మైనారిటీ, లౌకికవాద ఎంపీలు పోరాడాల్సిన అవసరం ఉన్నది. ■

> **దేశంలో రవాణా వ్యవస్థ పెరుగుతున్నది. ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతున్నది. కానీ, పేద ప్రజలకు రైలులో బోగీలు తగ్గిపోతున్నాయి. అసలు రైళ్ల సంఖ్యే తగ్గిపోతున్నది. అదే సమయంలో విమానాలు పెరుగుతున్నాయి. పేద ప్రజలు ప్రయాణం చేయలేని స్థితిలో ఉన్నారు. దళిత బహుజన ఎంపీలు రైలు మార్గాల విస్తృతి గురించి ఉభయ సభల్లో బలంగా వాదించాలి.**



పోటెత్తిన వరదకు నిండుకుండలా మారిన మేడిగడ్డ బ్యారేజీ

కాంగ్రెస్ కుట్రలు కాళేశ్వరంలో సమాధి

- మేడిగడ్డ సగర్వంగా నిలబడింది
- బురద రాజకీయాలు భూస్థాపితం
- మానవ నిర్మిత అద్భుతం కాళేశ్వరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సృష్టించిన కుట్రలు కొట్టుకు పోయాయని, బురద రాజకీయాలు భూస్థాపితమయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్య బట్టారు. 'ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిలో కాంగ్రెస్ పార్టీ కొట్టుకు పోయి.. కాళేశ్వరం ప్రాజెక్టు సగర్వంగా నిలబడింది' అంటూ కాంగ్రెస్ కుట్రలను ఎక్స్ వేదికగా ఖండించారు. మానవ నిర్మిత అద్భుతంగా కేసీఆర్ సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని, అందుకు కేసీఆర్‌కు ఆయన సెల్యూట్ చేశారు. 'పోటెత్తిన వరదకు దుష్టశక్తుల పన్నాగాలే పటాపంచలయ్యాయి కానీ, కేసీఆర్ సమున్నత సంకల్పం జై కొడుతున్నది.. జల హారతి పడుతున్నది.. లక్షల క్యూసెక్కుల గంగా ప్రవాహంలో లక్షకోట్ల వృథా చేశారనే విమర్శలే గల్లంతయ్యాయి కానీ, మేడిగడ్డ బరాజ్ మాత్రం మొక్కవోని దీక్షతో నిలబడింది. కొండంత బలాన్ని చాటి చెబుతున్నది.. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా..దగాబ్దాలుగా దగాపడ్డ ఈ తెలంగాణ నేలకు ఇప్పటికీ ఎప్పటికీ మేడిగడ్డే మన రైతుల కష్టాలు తీర్చే 'మేటిగడ్డ' అని అభివర్ణించారు. కాళేశ్వరమే కరువును పారదోలే కల్పతరువు అని, బురద రాజకీయాలను భూస్థాపితం చేసిన మానవ నిర్మిత అద్భుతానికి, కేసీఆర్‌కు తెలంగాణ సమాజం పక్షాన సెల్యూట్ అంటూ కేటీఆర్ పేర్కొన్నారు.

ఆర్ నారాయణమూర్తికి కేటీఆర్ పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న నటుడు, దర్శకుడు ఆర్ నారాయణమూర్తిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

లోకం పోకడ



మీకు ఓ అయిదు జతల బట్టలు తీసుకుందాం, పదండి!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	31.8°c	24.4°c
మెదక్	29.7°c	22.2°c
నిజామాబాద్	29.5°c	23.7°c
రంగారెడ్డి	29.5°c	21.6°c
ఖమ్మం	28.0°c	25.0°c
నల్లగొండ	27.5°c	21.4°c
కరీంనగర్	27.0°c	24.0°c
వరంగల్	27.0°c	23.0°c
మహబూబ్‌నగర్	25.1°c	22.0°c
హైదరాబాద్	24.4°c	22.2°c

15 జిల్లాలకు హై అలర్ట్ జారీ

హైదరాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భద్రాద్రి జిల్లాలోని పెదవాగు పొంగిపొర్లుతుండటంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని మంత్రి తుమ్మలకు సూచించారు.

పెదవాగుపై అంతులేని నిర్లక్ష్యం

- 16,500 ఎకరాల ఆయకట్టుకు 14 వేల ఎకరాలు ఏపీ పరిధిలోనే..
- తెలంగాణ ఏర్పాటు తరువాత కేఆర్ఎంబీ పరిధిలోకి ఈ ప్రాజెక్టు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి వద్ద పెదవాగు

ఖమ్మం, జూలై 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల అంతులేని నిర్లక్ష్యం కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు అపారనష్టం వాటిల్లింది. దశాబ్దాల చరిత్ర కలిగిన పెదవాగు ప్రాజెక్టు పరిధిలో 16,500 ఎకరాల ఆయకట్టు ఉండగా సుమారు 14 వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్నది. తెలంగాణ ఏర్పాటు తరువాత ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ పరిధిలోని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగించారు. ఆయకట్టు దామాషా ప్రకారం ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ వంటి వ్యయంలో 80 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 20 శాతం తెలంగాణ ప్రభుత్వం భరించాలని నిర్ణయించారు. ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ తెలంగాణ పరిధిలో ఉండటంతో వీటి పర్యవేక్షణ తెలంగాణ జలవనరుల శాఖ అధికారులు చూస్తున్నారు. అసలు విషయానికొస్తే.. ఆంధ్రప్రదేశ్ ఎగువ ప్రాంతంలో కొద్దిరోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండటంతో నీరు ప్రాజెక్టులోకి చేరి ఆనకట్టకు మూడుచోట్ల గండిపడింది. అధికారులు సరైన అంచనా వేసి ముందే నీటి విడుదల చేసి ఉంటే ప్రమాదం తప్పేది. కానీ అలా జరుగకపోవడంతో వేలాది ఎకరాల పంట నీట మునిగింది. పొలాల నిండా ఇసుకమేట వేసింది. దాన్ని తొలగించడానికి ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చు అవుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. 20 శాతం వాటా కలిగినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేయగా ప్రాజెక్టు ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం పెదవాగుకు గండిపడటంతో దాదాపు 12 వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అందులో 400 ఎకరాల వరి, 350 పత్తి, 50 ఎకరాలకుపైగా ఆయిల్‌పామ్ పంట దెబ్బతినగా మరో 300 ఎకరాల్లో ఇసుక మేట వేసినట్టు తెలుస్తున్నది. పాతర్లపాడు, బచ్చువారిగూడెం, నారాయణపురం, వడ్డిరంగాపురం, కమ్మంపాడు తదితర ప్రాంతాల్లో అపారనష్టం సంభవించింది. పలుచోట్ల ఏపుగా పెరిగిన ఆయిల్‌పామ్ చెట్లు సైతం నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే పెదవాగుకు గండి

- సకాలంలో గేట్లు తెరిస్తే ప్రమాదం తప్పేది
- నష్టపోయిన రైతన్నను ఆదుకోవాలి
- ఘటనపై విచారణ జరపాలి: హరీశ్‌రావు



భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లివద్ద పెదవాగు ప్రాజెక్టు గేట్ల పక్కన పడిన గండి

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలో పెదవాగు ప్రాజెక్టు గండిపడి, కట్టకొట్టుకుపోయిన ఘటనపై మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్లే పెదవాగు ప్రాజెక్టుకు గండి పడిందని మండిపడ్డారు. రైతులు హెచ్చరించినప్పుడే జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయి గేట్లు తెరిచి ఉంటే రూ.వంద కోట్ల నష్టం జరిగేది కాదని అన్నారు. కట్టమీద నుంచి నాలుగైదు గంటల పాటు నీళ్లు పొంగిపొర్లుతుంటే గేట్లు ఎత్తకుండా అధికారులు ఎందుకు అలస్యం చేశారని ప్రశ్నించారు. మూడు గేట్లుంటే, రెండు గేట్లే ఎత్తడంలో అంతర్యం ఏమిటి? అని అన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు బద్దలై గుమ్మడవల్లి గ్రామాన్ని ముంచేసి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించి వందల మంది గిరిజన బిడ్డల ప్రాణాలు ఫణంగా పెట్టారని తెలిపారు. పెదవాగు ప్రాజెక్టు తెలంగాణ భూ భాగంలోనే ఉన్నదని, పర్యవేక్షణ చేస్తున్నది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ అధికారులేనని వెల్లడించారు. ప్రాజెక్టుకు గండి పడటం వల్ల గుమ్మడివల్లి, రంగాపురం, కోయరంగాపురం, బచ్చువారిగూడెం, నారాయణపురం గ్రామాల్లో తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.



ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండీ ఏం లాభం?

పెదవాగు ప్రాజెక్టు ఘటన ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని హరీశ్‌రావు విమర్శించారు. రక్షించాలని అధికారులకు ఫోన్ చేసినా కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఏపీ నుంచి హెలికాప్టర్లు వచ్చిన కాలంలో రాకుంటే ఆరోజు వరదలో చిక్కుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దవాగు ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ తీరు దారుణమని మండిపడ్డారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండు రోజులైనా మంత్రులకు తీరిక దొరకలేదా? అని ప్రశ్నించారు. ముగ్గురు మంత్రులుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒరగబెట్టింది ఏమిటి? అని నిలదీశారు.

రైతులను ఆదుకోవాలి

ఇసుకమేట వేసిన ప్రతి ఎకరాకు రూ.25 వేలు, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటలకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. పశువులు కోల్పోయిన రైతులకు ప్రకృతి వైపరీత్యనిధి నుంచి వెంటనే సహాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. ఘటనపై కారణాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



మంచిర్యాల జిల్లా కోటపల్లిలో నీటిలో కొట్టుకుపోతున్న బైక్‌ను బయటకు తీసుకొస్తున్న గ్రామస్తులు



ములుగు జిల్లా కొండాయి గ్రామంలో పిట్స్ వచ్చిన వృద్ధురాలు పోచమ్మను దొడ్లవాగు దాటిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

ముంచెత్తుతున్న ముసురు

- ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు
- వరద పోటెత్తి మత్తళ్లు పోస్తున్న చెరువులు
- కళ కళలాడుతున్న భారీ జలాశయాలు
- రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తమైన అధికారులు

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 20 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా రెండురోజులుగా రాష్ట్రాన్ని ముసురు వాన ముంచెత్తుతున్నది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న మోస్తరు నుంచి భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తి చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరి వరద ఉధృతి పెరిగింది. జగిత్యాల జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిందని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముసురుకు జనజీవనం స్తంభించింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో ఇండ్లు నేలమట్టమయ్యాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ గ్రామంలోని ఇద్దరు గర్భిణులు పులిశె అనూష, దబ్బగట్ల శైలజను బోటు ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. కొండాయిలో పిట్స్‌కు గురైన వృద్ధురాలిని ఎన్డీఆర్ఎఫ్ బృందం బోటులో దొడ్లవాగు ఒడ్డుకు చేర్చి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల జోరు వాన కురిసింది.



చిత్తడిగా మారిన లింగనవాయి పాఠశాల ఆవరణలో ఆందోళనచేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బురద ఇలా.. వెళ్లేదెలా?

- చిత్తడిగా లింగనవాయి పాఠశాల
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

అలంపూర్, జూలై 20: మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాఠశాల ఆవరణ చిత్తడి చిత్తడిగా మారింది. పాఠశాలలోకి విద్యార్థులు ఎలా వెళ్లాలని వారి తల్లిదండ్రులు శనివారం ఆందోళనకు దిగారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలతో జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం లింగనవాయి ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. మైదానం మొత్తం వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు బురదలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వారి తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని నిరసన తెలిపారు. బడి ఆవరణలో మట్టిపోసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. పంటలు నీట మునిగాయి. ఇండ్లు కూలిపోగా, రోడ్లు కోతకు గురయ్యాయి. ఆసిఫాబాద్ మండలంలోని గుండి, తుంపెల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతలమానేపల్లి మండలంలోని దిందా గ్రామం రెండు రోజులుగా జలదిగ్బంధంలో ఉంది. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని ఎర్రవాగు ఉప్పొంగడంతో లంబాడితండా, ఖర్జీ, కోనంపేట గ్రామాల ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతున్నది. ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తున్నది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో వాన కురిసింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీతక్క

గోదావరి వరదల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. శనివారం సచివాలయం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా జిల్లాల కలెక్టర్లతోపాటు సొంత జిల్లా ములుగు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వరద పరిస్థితులపై సమీక్షించారు.

ఆటంకం కలగొద్దు: మంత్రి పొంగులేటి

భారీ వర్షాల వల్ల జనజీవనానికి ఆటంకాలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతుండటంపై గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను సూచించారు. విద్యుత్తు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ తదితర విభాగాలతో రెవెన్యూ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని, రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.



మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వడ్డనపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ

- జూరాలకు భారీగా వరద
- ఎస్సారెస్పీకి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మేడిగడ్డ వద్ద 4లక్షల క్యూసెక్కులు..



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ నుంచి దిగువకు వెళ్తున్న వరద

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉరకలేస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టును దాటుకుని బిరబిరామంటూ జూరాలకు పరుగులు తీస్తున్నది. జూరాల ప్రాజెక్టు 17 స్పిల్‌వే గేట్లను అధికారులు తెరిచారు. శనివారం సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో 90,800 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1,04,416 క్యూసెక్కులుగా నమోదైనట్టు అధికారులు తెలిపారు. జూరాల పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలకుగాను 7.645 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర డ్యాం 68 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో 1,02,744 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 1,527 క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 29 వేల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. విద్యుదుత్పత్తి ద్వారా దిగువన నాగార్జునసాగర్‌కు నీరు విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీకి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గోదావరి బేసిన్‌లోని నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది.శనివారం రాత్రి తొమ్మిది గంటలకు 15 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80 టీఎంసీలు) కాగా, శనివారం రాత్రి వరకు 1066.80 అడుగులు (18.443 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉన్నది. కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 15,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 3 గేట్లు ఎత్తి దిగువకు 11,022 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 690.400 (5.345 టీఎంసీలు) అడుగుల మేర నీరు ఉన్నది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సమీపంలోని అడ ప్రాజెక్టుకు 1778 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1941 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



జూరాల ప్రాజెక్టు నుంచి పరుగులు పెడుతున్న వరద

మేడిగడ్డకు 3,73,500 క్యూసెక్కులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్‌కు శనివారం ఇన్‌ఫ్లో 3,73,500 క్యూసెక్కులు ఉండగా, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతేమొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ రివర్ బెడ్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా, ప్రస్తుతం వరద ప్రవాహం 93.10 మీటర్ల ఎత్తులో పారుతున్నది. అన్నారం బరాజ్‌కు మానేరుతోపాటు చిన్న, చిన్న కాల్వల ద్వారా 16,500 క్యూసెక్కులు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. వచ్చిన నీటిని మొత్తం 66 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు.

పెరుగుతున్న గోదావరి..

ఎగువన కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 35.50 అడుగులకు చేరింది. మహారాష్ట్ర, ఆదిలాబాద్ జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగుతున్నది. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం 80 మీటర్లకు చేరింది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి శనివారం సాయంత్రం 12.210 మీటర్ల ఉధృతితో ప్రవహిస్తున్నది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క బరాజ్‌కు శనివారం ఎగువ నుంచి 4,58,340 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్టు అధికారులు తెలిపారు. మొత్తం 59 గేట్లు ఎత్తి నీటిని దిగువకు పంపిస్తున్నారు.

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తం

- గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తం
- ఈ సీజన్‌లో ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరాన్ని వినియోగిస్తం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- బరాజ్‌ల పునరుద్ధరణపై ఎన్డీఎస్ఏ చైర్మన్‌తో ఢిల్లీలో భేటీ



హైదరాబాద్, జూలై20 (నమస్తే తెలంగాణ): తుమ్మిడిహెట్టి వద్ద కొత్త ప్రాజెక్టు కడతామని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మేడిగడ్డ మినహా ఎల్లంపల్లి నుంచి ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు కాంపోనెంట్లు అన్నింటినీ ఈ సీజన్‌లో వినియోగిస్తామని తెలిపారు. ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) సిఫారసుల మేరకే మేడిగడ్డను పునరుద్ధరిస్తామని వివరించారు. రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఢిల్లీ వెళ్లి ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్‌తో భేటీ అయ్యారు. ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదిక మేరకు చేపట్టిన పనులు వివరించారు. సాంకేతిక పరీక్షలన్నీ పూర్తి చేయాలని, అప్పటివరకు బరాజ్‌లలో నీటిని నిల్వ చేయవద్దని ఎన్డీఎస్ఏ అధికారులు వెల్లడించినట్టు తెలిసింది. సోమవారం మరోసారి ఇంజినీర్ల స్థాయిలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తాం

ఎన్డీఎస్ఏతో భేటీ తర్వాత స్థానిక మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏతో సుదీర్ఘంగా చర్చించామని వెల్లడించారు. ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నింటినీ వినియోగించుకుంటామని వెల్లడించారు. తుమ్మిడిహెట్టి వద్ద కొత్త ప్రాజెక్టును పూర్తిచేసి గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తామని చెప్పారు. పెద్దవాగు అంతర్రాష్ట్ర ప్రాజెక్ట్‌ని, దాని ఆయకట్టంతా ఏపీలోనే ఉన్నదని, ఆ ప్రాజెక్టుకు గండి పడితే తమను బాధ్యులని చేయడం సరికాదని చెప్పారు. సమావేశంలో నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు ఈఎన్సీలు అనిల్‌కుమార్, నాగేందర్‌రావు, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

మేడిగడ్డపై వాస్తవాలు గ్రహించండి

- రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి సూచన
- కుట్రలు పటాపంచలయ్యాయని స్పష్టీకరణ

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాన్ని పదేపదే నిజం చేయాలనుకొని అడ్డంగా బుక్కయ్యిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణకు ప్రాణాధారమైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రలు నిర్వీర్యమయ్యాయని శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. భారీ ఎత్తున వరదను తట్టుకుని మేడిగడ్డ బ్యారేజీ ధీమా నిలబడిందని, గతంలో బరాజ్‌కు వెళ్లి నానా యాగీ చేసిన రాహుల్ గాంధీని ఇప్పుడు తీసుకెళ్లి చూపించాలని ఆయన కాంగ్రెస్‌కు సూచించారు. ఒక్క రాహుల్‌గాంధీయే కాదు, సమస్త కాంగ్రెస్ నేతలు మేడిగడ్డను సందర్శించి తరించాలని ఎద్దేవాచేశారు. 'మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోయింది.. పడిపోయింది.. పనికిరాకుండాపోయింది' అని నానా యాగీ చేసిన వాళ్లు ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టును చూసి రావాలని చెప్పారు. రూ.80వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని నాడు వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ ఇప్పుడు బరాజ్‌ను పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు. మేడిగడ్డ ఉన్నదా? కొట్టుకుపోయిందా? కూలిపోయిందా? అని హేళన చేసిన అదే కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇదేం పద్ధతి.. ఇదేం మాఫీ?

రుణమాఫీ తీరుపై రైతుల ఆగ్రహం
పేర్లు లేకపోవడంతో ఆందోళన.. కలెక్టరేట్లకు అన్నదాత పరుగులు

న్యూస్ నెట్‌వర్క్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ గందరగోళంగా మారింది. రూ.లక్షలోపు పంట రుణాలన్నీ మాఫీ చేశామంటూ ప్రభుత్వం గురువారం విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు రానూకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. కొన్ని సహకార సంఘాల్లో సగం మందికి, మరికొన్ని చోట్ల 25% మందికి, మరికొన్ని చోట్ల అసలు ఏ ఒక్కరికీ రుణమాఫీ కాకపోవడంతో అసలు ఏం జరుగుతున్నదో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది. అన్ని అర్హతలు ఉండీ రుణమాఫీకి నోచుకోని రైతులు వ్యవసాయ పనులన్నీ మానుకొని, వ్యవసాయ అధికారులు, బ్యాంకుల వద్దకు, చివరకు కలెక్టరేట్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడ కూడా సరైన సమాధానం లభించకపోవడంతో 'కొందరికి మాఫీ చేసి, కొందరికి మాఫీ చేయకపోవడం.. ఇదేం పద్ధతి?' అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఇలా ఎప్పుడూ బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకోవాల్సిన అవసరం రాలేదని నెత్తీనోరూ బాదుకుంటున్నారు.


మహబూబాబాద్‌లోని ఓ బ్యాంకులో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతులు

ఉమ్మడి ఆదిలాబాద్‌లో 35 శాతం మందికే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగం మందికి కూడా రూ.లక్ష లోపు రుణమాఫీ కాలేదు. జిల్లాలో డీసీసీబీల నుంచి నేరుగా 1,646 మంది, పీఏసీఎస్‌ల నుంచి 33,914 మంది మొత్తంగా 35,560 మంది రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్నారు. డిసెంబర్ 09, 2023 నాటికి వడ్డీతో కలిపి ఈ రైతులు తీసుకున్న లోన్ మొత్తం రూ.183.21 కోట్లు ఉండగా, తొలి విడత లక్ష వరకు చేసిన రుణమాఫీలో రూ.63.25 కోట్లు మాఫీ అయ్యాయి. అంటే రైతులు తీసుకున్న మొత్తం రుణంలో 34.52 శాతమే మాఫీ అయ్యింది. ఉమ్మడి జిల్లాలో 12,477 మంది రుణాలే మాఫీ అయ్యాయి. అంటే 35% మందికే మాఫీ అయింది. మిగిలిన వారికి ఎందుకు రాలేదు అనే విషయంలో అధికారులకే స్పష్టతలేదు. తలమడుగు మండలంలో గల మహారాష్ట్ర బ్యాంకులో 2,300 మంది బ్యాంకు రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.లక్షలోపు బాకీ ఉన్న రైతులు 382 మంది ఉండగా, 36 మందికి రుణమాఫీ అయింది. మిగతా 346 మందికి అసలు బాకీ కంటే తక్కువ డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో రైతులు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు.

రూ.70 వేలు రుణమే ఉన్నా మాఫీ కాలె

కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన ఎర్ర అంజమ్మకు తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకులో రూ.70 వేలు క్రాప్ లోన్ ఉన్నది. కానీ, రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన జాబితాలో ఆమె పేరు లేదు. ఎందుకు రాలేదని అధికారులను అడిగితే తమకేమీ తెలియదనే సమాధానం వచ్చింది. దీంతో ఆమె ఆందోళనకు గురవుతున్నది. తాను తీసుకున్న రుణం మాఫీ అవుతుందా? లేదా? అనే మీమాంసలో పడింది. ఇదే అంజమ్మ కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంక్‌లో తీసుకున్న రూ.50 వేల రుణాన్ని గత ప్రభుత్వం వడ్డీతో సహా బ్యాంకుకు చెల్లించింది. గత ప్రభుత్వంలో తాము ఎక్కడికీ వెళ్లకున్నా, ఎవరినీ కలవకున్నా, ఎలాంటి పైరవీ లేకుండా తనకు రుణమాఫీ జరిగిందని అంజమ్మ చెప్తున్నారు. ఇప్పుడు వచ్చిన లిస్ట్‌లో తన పేరు లేదని, ఇంకోక లిస్ట్ ఉన్నదని అధికారులు చెప్తున్నారని, అందులోనైనా వస్తుందా? లేదా? అనే విషయంలో స్పష్టత లేదని అంటున్నారు.

ఖమ్మం డీసీసీబీలో 25% మందికే మాఫీ

వందేండ్ల చరిత్ర కలిగిన ఖమ్మం డీసీసీబీ రైతులు తొలిసారిగా భారీ నిరాశకు గురయ్యారు. నాలుగు జిల్లాల రైతాంగానికి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న ఖమ్మం డీసీసీబీకి ప్రభుత్వం రుణమాఫీ నిధుల్లో భారీ కోత విధించింది. డీసీసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రసహకార బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు 1,69,864 మంది ఉన్నారు. పంట రుణమాఫీకి సంబంధించి రూ.908.27 కోట్లు రావాల్సి ఉన్నది. ఖమ్మం జిల్లాలో 1,16,291 మందికి గాను రూ.647.76 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 47,003 మందికి రూ.235.23 కోట్లు, ములుగు జిల్లాలో 1,375 మంది రైతులకు రూ.6.50 కోట్లు, మహబూబాబాద్ జిల్లాకు సంబంధించి 5,195 మంది రైతులకు రూ.18.33 కోట్లు అవసరం ఉంటుంది. రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు 1,43,327 మంది కాగా, వారికి రూ.526 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నది. అయితే 37,625 మంది రైతులకు రూ.121.63 కోట్లను మాత్రమే విడుదల చేశారు. దీంతో 25% మంది రైతులకే రుణమాఫీ వర్తించినట్టయింది.

జగిత్యాలలో 40% లోపే

జగిత్యాల జిల్లాలో రూ.లక్ష లోపు పంట రుణాలు ఉన్నవారి సంఖ్య దాదాపు లక్ష మంది ఉండగా, వీరిలో 39 వేల మందికే రుణమాఫీ జరిగింది. దీంతో జిల్లా రైతుల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తమవుతున్నది. బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులను రైతులు పెద్ద సంఖ్యలో కలిసి విన్నవిస్తున్నారు. అయితే, మూడు దఫాల్లో రుణమాఫీ ఉంటుందని, మలి దఫాలో వచ్చే అవకాశం ఉన్నదని రైతులకు అధికారులు నచ్చజెప్తున్నారు. మల్యాల మండలం మల్యాల, తక్కళ్లపల్లి సింగిల్ విండో కార్యాలయాల పరిధిలో రుణం తీసుకున్న రైతుల్లో సగం మందికి రుణం మాఫీ కాలేదు. కొందరు రైతుల పేరిట వచ్చిన రుణమాఫీ మొత్తం చూసి సింగిల్ విండో సిబ్బంది, బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. రూ.లక్షల్లో రుణం ఉంటే వేలల్లో రుణమాఫీ జరిగినట్టు రైతుల పేరిట ప్రకటించడం విస్మయానికి గురి చేస్తున్నది.

పెద్దూరు సింగిల్‌విండోలో ఒక్కరికీ మాఫీ కాలె

రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరు సింగిల్ విండో పరిధిలోని సహకార బ్యాంకులో 589 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. ఇందులో 339 మంది రైతులను రుణమాఫీకి అర్హులుగా గుర్తించారు. వీరిలో 279 మంది లక్ష లోపు లోన్ తీసుకున్నవారు ఉన్నారు. తొలి జాబితాలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. దీంతో వీరందరూ సింగిల్‌విండో, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పెద్దూరు సింగిల్‌విండో సిరిసిల్లలోని ఎస్‌బీఐ బ్యాంకుకు అనుసంధానంగా ఉన్నది. ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌ను వివరణ కోరగా, తమ పని తాము చేశామని, ప్రభుత్వమే స్పెసిఫిక్ ఖాతాలో జమ చేయాల్సి ఉన్నదని చెప్పారు. నాబార్డు అధికారిని వివరణ కోరగా ఇంకా తమకు స్పష్టత రాలేదని చెప్పారు.

నల్లగొండ సహకార రంగంలో 46% మందికే

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని డీసీసీబీ ఆధ్వర్యంలో రైతులకు పెద్దమొత్తంలో పంట రుణాలు ఇచ్చారు. రూ.లక్ష వరకు రుణం పొందిన వారిలో 72 వేల మందిని అర్హులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. వారికి రూ.316 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉన్నది. తొలి జాబితా ప్రకారం అర్హులైన వారిలో 46% మందికే రుణమాఫీ వర్తిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. డీసీసీబీ అధికారుల లెక్కల ప్రకారం 33,913 మందికే రూ.143.11 కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. మిగతా 54% మంది పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. గుండాల పీఏసీఎస్‌లో రూ.లక్ష రుణం ఉన్న రైతుల సంఖ్య 1,559 కాగా, మాఫీ అయ్యింది మాత్రం 850 మందికే. వలిగొండ మండలం అర్రూర్ పీఏసీఎస్‌లో 472 మందికి గాను 297 మందికి మాఫీ వర్తించింది. రామన్నపేట పీఏసీఎస్‌లో 615 మందికిగాను 168 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మోత్కూర్‌లో 778 మందికిగాను 238 మందికి మాత్రమే వచ్చింది. ఆత్మకూర్(ఎం)లో 566 మందికిగాను 239 మందికే మాఫీ వర్తించింది. తుర్కపల్లి పీఏసీఎస్‌లో 822 మందికి గాను 495 మందికే మాఫీ వర్తించింది.

ఉమ్మడి వరంగల్‌లో సగం మందికి కూడా కాలె

ఉమ్మడి వరంగల్ డీసీసీబీ పరిధిలో రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్నవారు 71వేల మంది ఉన్నారు. వీరిలో రూ.లక్ష రుణం తీసుకున్న రైతులు 54,400 మంది కాగా, రుణమాఫీ కింద రూ.249 కోట్లు నిధులు చెల్లించాల్సి ఉన్నది. కానీ, తొలి జాబితాలో సగం మందికి కూడా రుణాలు మాఫీ కాలేదు. రూ.లక్ష రుణమాఫీ కింద కేవలం 23,841 మందికి రూ.106.71 కోట్లు చెల్లించినట్టు బ్యాంకు అధికారులు తెలిపారు. ఇంకా 30,559 మంది రైతులకు రూ.లక్ష లోపు రుణాలు మాఫీ కావాల్సి ఉన్నది. హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం పెంచికలపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రూ.లక్ష రుణమాఫీకి అర్హులైన రైతులు 549 మంది ఉండగా, ప్రభుత్వం 348 మంది రైతులకే రుణమాఫీ చేసింది.

వికారాబాద్‌లో ఫిర్యాదుల వెల్లువ

వికారాబాద్‌లో రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. పంట రుణాలు మాఫీ అయినట్టు మెసేజ్‌లు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రైతులు జిల్లాలోని వ్యవసాయ కార్యాలయాలు, ఏఈవోలు, మండల వ్యవసాయాధికారి కార్యాలయాలను సంప్రదిస్తున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూంకు ఒక్క రోజులోనే 700 పోన్ కాల్స్ వచ్చినట్టు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతోనే తమ రుణాలు మాఫీ కాలేదని సర్కారు తీరుపై రైతులు మండిపడుతున్నారు. డీసీసీబీ, పీఏసీఎస్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల్లో కేవలం సగం మందికి కూడా రుణాలు మాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

రుణం రూ.2.25 లక్షలు.. మాఫీ 3,014

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన నల్ల నర్సింహారెడ్డి 2022 ఆగస్టు 11న మల్యాల సింగిల్ విండో బ్యాంకులో రూ.1.49 లక్షలు రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి వడ్డీ చెల్లిస్తూ వస్తున్నారు. నిరుడు ఆగస్టులో కేసీఆర్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయగా, నర్సింహారెడ్డికి సంబంధించిన అప్పులో రూ.73,500 మాఫీ అయింది. దీంతో మరో రూ.75,500 అప్పు మిగిలిపోయింది. అయితే నర్సింహారెడ్డి నిరుడు సెప్టెంబర్ 18న మళ్లీ రూ.1.49 లక్షలు లోన్ తీసుకున్నారు. గతంలో తీసుకున్న రుణంతో కలిపి రూ.2.25 లక్షలు రుణం కలిగి ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఆగస్టులో ఆయనకు రుణమాఫీ కావాల్సి ఉన్నది. అయితే ఊహించని విధంగా రూ.లక్షలోపు రుణం ఉన్న వారి తొలి జాబితాలోనే నర్సింహారెడ్డి పేరు రావడంతో సింగిల్ విండో ఉద్యోగులతోపాటు నర్సింహారెడ్డి ఆశ్చర్యపోయారు. నర్సింహారెడ్డి పేరిట రూ.3,014 బాకీ ఉన్నదని, దానిని మాఫీ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో నిశ్చేష్టుడయ్యాడు. రూ.2.25 లక్షల అప్పు ఉంటే, రూ.3 వేలు మాఫీ కావడం ఏమిటి? అసలు తొలి విడతలో తన పేరు ఎందుకు వచ్చిందని మల్యాల సింగిల్ విండో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

రుణమాఫీ అయోమయంగా ఉంది



నేను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దవంగరలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రుణమాఫీ పొందిన. ఆ తర్వాత మళ్లీ రూ.లక్ష రుణం తీసుకున్న. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పుడు రెండు లక్షల రుణమాఫీ చేస్తామంటున్నది. కానీ, నేను తీసుకున్న రూ.లక్ష కూడా నాకు మాఫీ కాలేదు. మాఫీ గురించి నాకు ఎలాంటి మెసేజ్ రాలేదు. దీనిపై ఎవరిని అడగాలో తెలియడం లేదు. అంతా అయోమయంగా ఉన్నది. రుణమాఫీ గురించి అధికారులు స్పష్టత ఇవ్వాలి.

- చేతరాబోయిన రాజు, యువరైతు, కొరిపల్లి, పెద్దవంగర మండలం, మహబూబాబాద్ జిల్లా



రుణమాఫీ కాలే.. రైతుబంధు రాలే

సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పిండు. నాకు బ్యాంకులో ఉన్నది రూ.82వేల అప్పే. అయినా లోన్ ఎందుకు మాఫీ కాలేదో తెల్వటం లేదు. రుణమాఫీ కాలేదని తెలుసుకుంటున్నప్పటికే కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నయి. రుణమాఫీ కాకపోతే నేను ఎప్పటికీ లోన్ డబ్బులు కట్టలేను. ఉన్న రెండు ఎకరాల పొలంలో వడ్లేసిన. వర్షాలు లేక పత్తి మొక్కలు లేవనేలేదు. సాగుకు రూ.40వేలకు పైనే ఖర్చు పెట్టిన. కేసీఆర్ సర్కార్ మంచిగుండే. పంట వేయకముందే రైతుబంధు డబ్బులు వేసి కిసాన్‌పెట్టేటిది. ఆ డబ్బులతో పంట సాగుచేసుకునేటోళ్లం. ఇప్పుడు రైతుబంధు డబ్బులు రాలేదు, పంటకు ఇబ్బందుల్లో కష్టాలు రావట్లేదు. రేవంత్‌రెడ్డి సర్కారులో నాలాంటి రైతుల పరిస్థితి ఆగమే ఉంది.

- బేగరి మల్లయ్య, రైతు, కొల్లాపూర్, సంగారెడ్డి జిల్లా



గరీబులకు కాక ఇంకెవరికి చేస్తరు?

నాకు 3 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2018లో ఆసిఫాబాద్ ఎస్‌బీఐ బ్యాంకులో రూ.45 వేల పంట రుణం తీసుకున్న. వడ్డీకట్టి రెన్యువల్ చేసుకుంటున్న. సర్కారు రుణమాఫీ లిస్టులో నా పేరు రాలే. శనివారం బ్యాంకుకు వెళ్లి సార్లను అడిగితే రుణమాఫీ కాలేదన్నరు. నాకు రేషన్ కార్డు కూడా ఉంది. అయినా ఎందుకు కాలేదో తెల్వడం లేదు. ఈ కాంగ్రెసోళ్లు మాలాంటి గరీబులకు కాక ఇంకెవరికి చేస్తరో మరి.

- రాచ్చ కొసెన్నా, గుండి, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా

40 లక్షల మందికి రుణమాఫీ కట్?

- రుణమాఫీలో కాంగ్రెస్ సర్కారు మాయాజాలం
- రైతుల సంఖ్య, నిధులపై ప్రభుత్వ దాగుడుమూతలు
- చెప్పేది 70 లక్షలు.. ఇస్తున్నది 32 లక్షల మందికే

హైదరాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ): రుణమాఫీ అర్హుల సంఖ్యలో సర్కారు భారీ కోత పెట్టింది. ఇప్పుడు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న ఒక అధికారి వద్ద ఉన్న డాక్యుమెంట్ ప్రకారం.. ప్రభుత్వం రుణమాఫీ చేయబోయే రైతుల సంఖ్య 32.50 లక్షలు మాత్రమే! ఇందుకు అవసరమయ్యే నిధులు రూ.27 వేల కోట్లు మాత్రమేనని తెలిసింది. దీంతో రుణమాఫీపై ప్రభుత్వం చెప్పిన లెక్కలు పూర్తిగా అవాస్తవమని తేలిపోయింది.

40 లక్షల మందికి కోత!

అధికారుల జాబితా ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీకి 32.50 లక్షల మంది అర్హులని తేల్చగా, 24.4 లక్షల కుటుంబాలకు మాత్రమే వర్తించనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా ఎలాంటి కోతలు విధించకుండా, పాసుపుస్తకాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటే, 70 లక్షల రుణఖాతా కలిగిన రైతులకు ఎంతోకొంత రుణం మాఫీ కావాలి. కానీ, సుమారు 32.5 లక్షల నుంచి 37.5 లక్షల మంది కి కోత పెడుతున్నారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ లెక్కన ప్రభుత్వం 45% మందికి మాత్రమే రుణమాఫీ చేస్తుండగా, 55% మందికి మొండిచెయ్యి చూపిస్తున్నది.



మార్పు ఇదేనా..?

నాకు 1.21 ఎకరాల భూమి ఉన్నది. బ్యాంకులో నా పేరు మీద రూ.65 వేలు పంట రుణం తీసుకున్నా. ఈ రోజు వరకు నాకు మెసేజ్ రాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే నీ పేరు లిస్టులో లేదన్నారు. ఏఓ దగ్గరకు వెళ్లి అడిగితే ఆధార్ కార్డు నంబర్‌లో తప్పు ఉందని చెప్పారు. ఆన్‌లైన్‌లో చూసి మీ లోన్ మాఫీ అండర్ ప్రాసెస్ అని ఉన్నట్టు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు పోయిన సర్కారు ఇప్పటికే రూ.లక్ష వరకు అందరికీ మాఫీ అయిందని చెబుతున్నది. మరి నాలాంటి వారికి ఎందుకు మాఫీ కాలేదు? కాంగ్రెస్ మార్పు అంటే ఇదేనా?

- మామిడిపెల్లి మౌనిక, తొర్రూరు, పాలకుర్తి నియోజకవర్గం, జనగామ జిల్లా

31 వేల కోట్లు కాదు... 27 వేల కోట్లే!

అధికారులు రూ.31 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం చెప్తున్నది. కానీ, డాక్యుమెంట్ ప్రకారం రూ.28 వేల కోట్లతో రుణమాఫీ పూర్తి చేయనున్నట్టు తెలిసింది. రుణమాఫీని నాలుగు స్లాబ్‌లుగా విభజించి తొలి మూడు స్లాబ్‌లకు రూ.6 వేల కోట్ల చొప్పున కేటాయించి, చివరి స్లాబ్‌లో రూ.9 వేల కోట్లు కేటాయించారు. ఈ లెక్కన నాలుగు స్లాబ్‌లను కలిపి ఇస్తున్నది రూ.27 వేల కోట్లే. ప్రతి స్లాబ్‌లో ఆర్థిక, ఆ ప్రకారం వాటి పరిష్కారానికి సంబంధించిన రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నట్టు పెట్టారు. కానీ, ఈ పరిస్థితి రాదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జాబితాలో ఉన్న రైతులకు సమస్యన్నారు. ఒకసారి జాబితాలో లేని రైతులకు రుణమాఫీ కావడం దాదాపు అసాధ్యమన్నారు. అలాంటప్పుడు అదనంగా కేటాయించిన నిధులు పేరుకే తప్ప వాటి వాడేది లేదని చెప్తున్నారు. దీని ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీపై ప్రభుత్వం చెప్తున్నట్టుగా రూ.31 వేల కోట్లకు కాకుండా రూ.27 వేల కోట్లతోనే సరిపెట్టే అవకాశం ఉన్నది.

లక్ష వరకు 35 లక్షలు.. 2 లక్షల వరకు 32 లక్షల మంది రైతులు

రుణమాఫీ అర్హుల సంఖ్యలో తేడా కనిపిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో రూ.లక్ష వరకు రుణమాఫీ చేసింది. అప్పుడు 35.31 లక్షల మందికి రుణ మాఫీ అయింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నప్పటికీ, అర్హుల సంఖ్య 32.5 లక్షలుగానే ఉండటం అనుమానాలకు తావిస్తున్నది. మంత్రి తుమ్మల చెప్పిన లెక్క ప్రకారం 44 లక్షల మంది రైతులు ఉన్నారనుకుంటే, బీఆర్‌ఎస్‌తో పోల్చితే 8.69 లక్షల మంది రైతులు మాత్రమే అదనంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తే 35.31 లక్షల మందికి లబ్ధి చేకూరగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తే 32.5 లక్షల మందికే లబ్ధి చేకూరుతుండటం అనుమానాలకు తావిస్తున్నది.

రేషన్‌కార్డు లేనివారికి, ప్రభుత్వ ఉద్యోగులకు మొండిచెయ్యి

ఎలాంటి కోతలు లేకుండా పాసుపుస్తకం ఆధారంగా రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం తెరవెనుక అడ్డగోలుగా కోతలు పెడుతున్నది. రేషన్‌కార్డు లేని వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ చేయడం లేదు. గురువారం రూ.లక్ష వరకు రుణం మాఫీ చేయగా రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలకు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు రుణమాఫీ కాలేదు. ఈ కుటుంబాల రైతులు ఏఈవోల వద్దకు వెళ్లి ఆరా తీయగా వాళ్ల ఆధార్ నంబర్‌లో పరిశీలిస్తే.. రేషన్‌కార్డు లేదని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారంటూ చూపిస్తున్నది. ఇవి చూస్తే ప్రభుత్వం ఇలాంటి కోతలు లేకపోతే అర్హుల సంఖ్యా పెరగాల్సి ఉంటుంది.


రైతు భరోసా నిధులు రుణమాఫీకి మళ్లింపు



మాజీ మంత్రి కొప్పుల

జగిత్యాల, జూలై 20 : కాంగ్రెస్ సర్కార్ యాసంగి, వానాకాలంలో చెల్లించాల్సిన రైతు భరోసా సొమ్ము ఎగ్గొట్టి.. రుణమాఫీకి మళ్లించిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. రుణమాఫీలోనూ కోతలు పెట్టి రైతులను మోసం చేసిందని, పంట నష్టపరిహారం ఇవ్వకుండా అన్నదాతలను గోస పెడుతున్నదని విమర్శించారు. శనివారం ఆయన జగిత్యాలలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేసినట్టు పత్రికా ప్రకటనలకే కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. యాసంగి, వానాకాలంలో రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఈ సొమ్ము రూ.20 వేల కోట్లకుపైనే ఉంటుందని, దానిని ఎగ్గొట్టి కొంత రుణమాఫీకి మళ్లించిందని చెప్పారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మరిపెడ, జూలై 20 : కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా మరిపెడ మండలంలోని పెద్దిసెడులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం లో రెండు దఫాలుగా రూ.31వేల కోట్ల రుణమాఫీ జరిగితే, కాంగ్రెస్ ప్రభుత్వం 6నెలల్లో రూ.6వేల కోట్లు మాఫీచేసి సంబురాలు చేయడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. జీవో నం.46 ప్రకారం ఉద్యోగ ప్రకటనలు వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ఇచ్చిన ఉద్యోగాల ప్రకటనలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ లెక్కలపై తలో మాట... మారుతున్న లెక్కలు

రుణమాఫీకి అర్హులయ్యే రైతుల సంఖ్య, కుటుంబాల సంఖ్యపై స్పష్టత లేకుండా పోయింది. దీనిపై ప్రభుత్వం అధికారులు వివరాలు వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. దీనికితోడు రైతుల సంఖ్య, కుటుంబాల సంఖ్యపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తలో మాట మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 70 లక్షల రుణ ఖాతాలు ఉన్నాయని చెప్తుండగా, మంత్రి తుమ్మల మాత్రం 60 లక్షల రుణ ఖాతాలున్నాయని ఒకసారి, 44 లక్షల రుణ ఖాతాలు మాత్రమే ఉన్నాయని మరోసారి చెప్పడం గమనార్హం. కుటుంబాల సంఖ్యను తొలుత 39 లక్షలని చెప్పిన మంత్రి తుమ్మల తాజాగా 25 లక్షలు మాత్రమేనని చెప్తున్నారు. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కోవిధంగా ఒక్కో లెక్క వెల్లడిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు. రోజులుగడిచే రుణమాఫీ అర్హులయ్యే రైతుల సంఖ్య, కుటుంబాల సంఖ్య తగ్గుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బ్యాంకుల్లో పొరపాట్లు.. ఆధార్‌లో తప్పులు

3 లక్షల ఖాతాలకు రుణమాఫీ అసాధ్యం

- తప్పులు సరిచేశాక అర్హులకు మాఫీ.. క్లియర్ టైటిల్ ఖాతాలెన్నో ఇంకా తెలియదు
- ఆగస్టులో రుణమాఫీ చేయకపోతే ఒరిగేందేం.. రైతుబంధుకుడబ్బు లు మూటకట్టలేదు
- విధి విధానాలు ఖరారు అయ్యాకే రైతుభరోసా.. మీడియాతో మంత్రి తుమ్మల


హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ ఖాతాల్లో బ్యాంకుల తప్పులు చేశాయని, ఇప్పటివరకు ఆరు కోఆపరేటివ్ బ్యాంకుల్లో రెండువేల ఖాతా తప్పులు ఖాతాలను గుర్తించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దాదాపు 3 లక్షల రుణ ఖాతాలకు సంబంధించిన రైతుల ఆధార్‌కార్డుల్లో పొరపాట్లు ఉన్నాయని, వారికి రుణమాఫీ చేయడం సాధ్యం కాదని చెప్పారు. వీరంతా ఆధార్‌కార్డుల్లో మార్పులు చేసుకుని, దానిని స్థానిక అధికారులకు సమర్పిస్తే అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఆ తర్వాత అర్హులైనవారికి రుణమాఫీ అవుతుందని స్పష్టంచేశారు. శనివారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. రుణమాఫీలో కోసం నిర్వహించిన కసరత్తు తేదీ కంటే ముందు రుణాలు తీసుకున్న ఖాతాలను కూడా కొన్ని బ్యాంకులు జాబితాలో చేర్చిన విషయాన్ని గుర్తించినట్టు తెలిపారు. ఈ విధంగా ఒకే బ్యాంకులో ఒకేసారి 500 తప్పుడు ఖాతాలను జాబితాలో చేర్చారని వెల్లడించారు. ఇలాంటి వాటిపై ఆడిట్‌తోపాటు విచారణ కూడా జరుగుతున్నదని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఇలాంటి పొరపాట్లు చేసిన బ్యాంకు అధికారులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. రైతు రుణఖాతాలు 44 లక్షలుగా ఉన్నట్టు గుర్తించామని, వాస్తవంగా ఇప్పటికే 39 లక్షల ఖాతాలున్నాయని పేర్కొన్నారు. ఆధార్‌లో తప్పులు, పేర్లలో తప్పులు, రేషన్‌కార్డు, ఇలా రకరకాల కారణాలతో తప్పులు ఉన్నవని ఎన్ని గుర్తించాల్సి ఉన్నదని, పూర్తిసమాచారానికి అందాల్సి ఉన్నదని, సమయం పట్టే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే ఆగస్టులోపే 44 లక్షల ఖాతాదారులకు మొత్తం రుణమాఫీ చేస్తామని, ఒకవేళ రుణమాఫీ జరుగకపోతే ఏదో ఒరిగేదేమీ ఉండదని సవాల్ చేశారు.

డబ్బులు మూటకట్టి పెట్టలేదు..

రుణమాఫీలో సమస్యల పరిష్కారానికి స్థానికంగా వ్యవసాయాధికారిని సంప్రదించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఇవికాక ట్యాక్స్ చెల్లించేవారు రుణమాఫీ పరిధిలోకి రారని స్పష్టంచేశారు. రైతుభరోసాకోసం డబ్బు లు మూటకట్టిపెట్టలేదని వ్యంగ్యంగా మాట్లాడారు. విధి విధానాలు ఖరారు తర్వాత రైతు భరోసా అమలుచేస్తామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఇంకా నా బ్యాంకుల్లో అధికారులు ఉన్నారని, ఈ పథకం అమలు చేయకపోతే నిలదీయాలని సవాల్ చేశారు. ప్రభుత్వ ఆదాయం ప్రకారం రుణమాఫీ జరుగుతుందని తేల్చిచెప్పారు.

కాంగ్రెస్ ప్రతి స్కీమ్‌లో ఓ స్కామ్

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి




హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి స్కీమ్‌లో ఏదో ఒక స్కామ్ ఉన్నదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజాపాలన కాదని, ప్రజావ్యతిరేక పాలన అని విమర్శించారు. రుణమాఫీ పేరుతో ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసిందని మండిపడ్డారు.



మూడు రోజులుగా ఎదురుచూస్తున్నం..

నేను పెద్దూరు సొసైటీ ద్వారా రూ.90 వేలు రుణం తీసుకున్న. రుణమాఫీ కింద లక్ష మాఫీ చేస్తమన్నరు. 18న ఖాతాలో జమైతదని చెప్పిన్రు. 18న ఖాతా చెక్ చేసుకుంటే రుణమాఫీ పైసలు పడలేదు. బ్యాంక్ అధికారులను అడిగిన మధ్యలో పెండింగ్ అంటున్నారు. మూడు రోజులుగా ఇట్లనే ఎదురుచూస్తున్న. అధికారులు అర్హుల జాబితాలో పేరు నమోదుచేయించుకోవాలె.

- భూక్య తిరుపతినాయక్, రైతు, పెద్దూరు, రాజన్న సిరిసిల్ల



60% మందికి మాఫీ కాలేదు

గీసుకొండ రైతు సహకార సంఘంలో గతేడాది రూ.80 వేల రుణం తీసుకున్న. మాఫీ అవుతుందని ఆశించిన లిస్టులో నా పేరు రాలేదు. వ్యవసాయ శాఖ, సొసైటీ అధికారులను అడిగితే మాకు తెలియదని, లిస్టులో ఉన్న వాళ్లకే మాఫీ అవుతుందని చెప్తున్నారు. గవర్నమెంట్ నుంచి ఎలాంటి సమాచారం లేదంటున్నారు. లక్ష లోపు రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. వందకు 60 మందికి మాఫీ కాలేదు.

- చల్లగాని కుమారస్వామి, వరంగల్ జిల్లా

రేపటి నుంచి పార్లమెంట్

నేడు అఖిలపక్ష భేటీ • 23న కేంద్ర బడ్జెట్



న్యూఢిల్లీ, జూలై 20: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 12 వరకు జరుగనున్న ఈ సమావేశాల్లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న 2024-25 ఆర్థిక సంవత్సర పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతారు. ముందు రోజు సోమవారం నాడు ఆమె ఆర్థిక సర్వేను పార్లమెంట్ ముందుకు తీసుకొస్తారు. 90 ఏండ్ల నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో భారతీయ వాయుయాన్ విధేయక్-2024 బిల్లుతో సహా మొత్తం ఆరు బిల్లులను ప్రవేశపెట్టాలనే యోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తున్నది. పార్లమెంట్ సమావేశాల్లో నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత తదితర అంశాలపై ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. పార్లమెంట్ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం జరుగనున్నది.

వందేమాతరం, జై హింద్ నినాదాలు చేయొద్దు!

పార్లమెంట్ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో 'హ్యాండ్‌బుక్ ఆఫ్ మెంబర్స్ ఆఫ్ రాజ్యసభ'లోని పలు సారాంశాలను ప్రస్తావిస్తూ రాజ్యసభ సెక్రటేరియట్ తాజాగా ఒక బులెటిన్ విడుదల చేసింది. సభాపతి రూలింగ్స్‌ను సభలో కానీ, సభ బయట కానీ ఎంపీలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా విమర్శించకూడదని పేర్కొన్నది. అదేవిధంగా వందే మాతరం, జై హింద్ సహా ఏ ఇతర నినాదాలు చేయకూడదని గుర్తుచేసింది. సభలో ప్లకార్డులు ప్రదర్శించకూడదని స్పష్టం చేసింది.

యూపీఎస్సీ చైర్మన్ సోనీ రాజీనామా!

- పూజా ఖేద్కర్ వ్యవహారం నేపథ్యంలో ప్రాధాన్యం
- వ్యక్తిగత కారణాలతోనేనని అధికారిక వర్గాల వెల్లడి
- 15 రోజుల క్రితమే రిజైన్.. పొందని ఆమోదం



న్యూఢిల్లీ, జూలై 20: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) చైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేసినట్టు సమాచారం. వ్యక్తిగత కారణాలతోనే ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు అధికార వర్గాలు శనివారం వెల్లడించాయి. యూపీఎస్సీ చైర్మన్‌గా గత ఏడాది మేలో బాధ్యతలు చేపట్టిన మనోజ్ సోనీ.. పదవీ కాలం 2029 మే వరకు ఉండగానే రాజీనామా చేయడం గమనార్హం. ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ వ్యవహారం తర్వాత యూపీఎస్సీని వివాదాలు, పలు ఆరోపణలు చుట్టుముట్టిన నేపథ్యంలో మనోజ్ సోనీ రాజీనామా అంశం ప్రాధాన్యం సంతరించుకొన్నది. అయితే తన రాజీనామాకు ఖేద్కర్ వివాదానికి ఎలాంటి సంబంధం లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆయన రాజీనామా ఇంకా ఆమోదం పొందలేదని తెలిపాయి.

తీవ్ర వివాదమైన పూజా ఖేద్కర్ వ్యవహారం

ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర వివాదం రేపింది. నకిలీ పత్రాలు, పేర్ల మార్పుతో మోసం చేసి ఆమె పరిమితికి మించి సివిల్స్ పరీక్ష రాసినట్టు తేలడంతో ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు యూపీఎస్సీ శుక్రవారం వెల్లడించింది.

రాజ్యాంగ సంస్థలను దెబ్బతీస్తున్న బీజేపీ

యూపీఎస్సీ చైర్మన్ రాజీనామాపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందించింది. యూపీఎస్సీని పలు కుంభకోణాలు కుదిపేశాయని, ఇది జాతీయస్థాయి ఆందోళనకర అంశమని తెలిపింది. దేశంలోని రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠ, సమగ్రత, స్వతంత్రతను దెబ్బతీయడం ద్వారా ఆయా సంస్థలను బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ తన చేతుల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.

కర్ణాటకలో సినిమా టికెట్లపై సెస్!

- ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లపైనా..
- ప్రజలపై మరో బాదుడుకు సిద్ధమైన కాంగ్రెస్ సర్కారు
- ఇటీవలే పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున వడ్డింపు
- పాల ధరలూ భారీగా పెంపు
- ఆర్టీసీ చార్జీలు 20 శాతం పెంచేందుకు ప్రతిపాదనలు



బెంగళూరు, జూలై 20: కర్ణాటక ప్రజలపై కాంగ్రెస్ సర్కారు మరో గుదిబండ వేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పాలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ప్రభుత్వం ఇప్పుడు సినిమా టికెట్లపైనా భారం మోపాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో టికెట్లపై సెస్ విధించాలని నిర్ణయం తీసుకుంది. ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లపై కూడా సెస్ వసూలు చేయనుంది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కర్ణాటక సినీ అండ్ కల్చరల్ యాక్టివిస్ట్స్(వెల్ఫేర్) బిల్ - 2024లో ఈ సెస్ గురించి పొందుపరిచింది. అన్ని సినిమా టికెట్లు, ఓటీటీ సబ్‌స్క్రిప్షన్లపై 2 శాతం వరకు సెస్ విధించనున్నట్టు తెలుస్తున్నది. ప్రతి మూడేండ్లకు ఒకసారి ఈ సెస్‌ను సమీక్షించి అవసరమైతే మార్పులు చేయనుంది. సెస్ ద్వారా వసూలైన నిధులను సినీరంగంలో పని చేస్తున్న ఆర్టిస్టులు, సిబ్బంది సంక్షేమం కోసం వినియోగిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇందుకోసం సినిమాటోగ్రఫీ మంత్రి నేతృత్వంలో ఓ బోర్డును ఏర్పాటు చేస్తామని అంటున్నది. అయితే, ప్రతిపక్ష బీజేపీ మాత్రం.. కాంగ్రెస్ కుంభకోణాలు, తెలివితక్కువగా ప్రవేశపెట్టిన గ్యారెంటీలతో ఖాళీ అయిన ఖజానాను నింపుకునేందుకే ఈ సెస్ విధిస్తున్నదని ఆరోపిస్తున్నది.

పాలు.. పెట్రోల్.. ఇప్పుడు సినిమా టికెట్లు

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ఐదు గ్యారెంటీల పేరిట కర్ణాటక కాంగ్రెస్ ప్రజలకు హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే లోక్‌సభ ఎన్నికలు ముందుకురావడంతో ఈ గ్యారెంటీలను వేగంగా అమలు చేసింది. దీంతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని బీజేపీ, జేడీఎస్ ఆరోపిస్తున్నాయి. అందుకే, వరుసగా అన్ని ధరలను పెంచుతున్నదని పేర్కొంటున్నాయి. ఈ నెల ఆరంభంలో కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పాల ధరపై లీటరుకు రూ.2 పెంచింది. ఈ ఏడాదిలో పాల ధరను పెంచడం ఇది రెండోసారి. గత నెల పెట్రోల్, డీజిల్ ధరలపై సేల్స్ ట్యాక్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచింది. దీంతో లీటరు పెట్రోల్‌పై రూ.3, లీటరు డీజిల్‌పై రూ.3.02 ధర పెరిగింది. ఇక, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల కేఎస్‌ఆర్టీసీకి రూ.295 కోట్ల నష్టం వచ్చిందని, కాబట్టి బస్సు చార్జీలను 15 - 20 శాతం పెంచాలని ప్రభుత్వానికి కేఎస్‌ఆర్టీసీ ప్రతిపాదనలు పెట్టింది. ఇలా లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి కర్ణాటక ప్రజలపై ప్రభుత్వం వరుసగా ధరల భారాన్ని మోపుతున్నది.

85 లక్షల డివైజ్‌లపై ప్రభావం

- ఐటీ అంతరాయంపై మైక్రోసాఫ్ట్
- సాఫీగా విమానయాన సేవలు



వాషింగ్టన్, జూలై 20: మైక్రోసాఫ్ట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యపై ఆ సంస్థ కీలక ప్రకటన చేసింది. సైబర్ సెక్యూరిటీ సంస్థ అయిన క్రౌడ్‌స్ట్రైక్ చేసిన ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వల్ల ఈ సమస్య ఉత్పన్నమైందని, దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా 85 లక్షల విండోస్ డివైజ్‌లపై పడినట్టు ప్రస్తుతం అంచనా వేస్తున్నట్టు శనివారం తన బ్లాగ్‌లో వెల్లడించింది. మొత్తం విండోస్ డివైజ్‌లలో ఇది ఒక శాతం కంటే తక్కువేనని పేర్కొన్నది. మైక్రోసాఫ్ట్ అజూర్‌లో సమస్యను పరిష్కరించేందుకు క్రౌడ్‌స్ట్రైక్ సాయం చేసినట్టు వెల్లడించింది. ఇందుకోసం అమెజాన్ వెబ్ సర్వీసెస్, గూగుల్ క్లౌడ్‌తో కూడా కలిసి పని చేసినట్టు తెలిపింది.

యథావిధిగా విమానయాన సేవలు

మైక్రోసాఫ్ట్‌లో ఎర్రర్‌తో శుక్రవారం తీవ్ర అంతరాయాలు ఎదుర్కొన్న విమానయాన సేవలు కుదుటపడ్డాయి. శనివారం తెల్లవారు జామున 3 గంటల నుంచి దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో ఎయిర్‌లైన్స్ వ్యవస్థలన్నీ సాధారణంగా పని చేస్తున్నాయని, విమాన కార్యకలాపాలన్నీ సాఫీగా సాగుతున్నాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ప్రయాణ సర్దుబాట్లు, టికెట్ చార్జీల రీఫండ్‌లు సరిగ్గా జరిగేలా విమానయాన శాఖ పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. కాగా, శనివారం కూడా ఇండిగో సంస్థ దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన 18 విమానాలు రద్దయినట్టు అధికారులు తెలిపారు.

వంద శాతం చార్జీలు వాపస్

న్యూఢిల్లీ నుంచి శాన్ ఫ్రాన్సిస్కోకు సాంకేతిక సమస్య వల్ల 30 గంటలు ఆలస్యంగా వెళ్లిన ఏఐ-183 విమాన ప్రయాణికులకు 'ఎయిర్ ఇండియా' క్షమాపణలు చెప్పింది. ప్రయాణికులకు వారి చార్జీలను పూర్తిగా వాపసు ఇస్తామని, అదనంగా తర్వాత ప్రయాణించేందుకు వోచర్లు ఇస్తామని ప్రకటించింది. ఈ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తి రష్యాలోని క్రాస్నోయార్స్క్ ఎయిర్‌పోర్టుకు దారి మళ్లించారు. దీంతో ఈ విమానం అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు 30 గంటలు ఆలస్యంగా చేరుకుంది.

టెకీల పని గంటలు పెంపు!

- కర్ణాటక కాంగ్రెస్ సర్కారు యోచన
- ముసాయిదా బిల్లు సిద్ధం
- వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

బెంగళూరు: కర్ణాటకలో ఐటీ రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల పని గంటల్ని 14కు పెంచే దిశగా కాంగ్రెస్ సర్కార్ కీలక బిల్లును సిద్ధం చేసింది. కర్ణాటక షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సవరణ) బిల్లు-2024ను తీసుకురాబోతున్నట్టు ప్రకటించింది. ముసాయిదా బిల్లును రాష్ట్ర సర్కార్ సిద్ధం చేయటం ఐటీ రంగంలో కలకలం రేపింది. ఈ ప్రతిపాదనపై ఐటీ ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ప్రభుత్వ చర్య అత్యంత అమానవీయమైనదిగా ఐటీ ఉద్యోగుల యూనియన్లు నిరసనకు దిగుతున్నాయి. రాష్ట్ర ఐటీ, ఐటీ అనుబంధ ఉద్యోగ సంఘం (కేఐటీయూ) ప్రతినిధులు కర్ణాటక కార్మిక మంత్రి సంతోష్‌ను కలుసుకొని తమ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం ఓవర్‌టైమ్‌తో కలుపుకొని గరిష్ఠంగా రోజులో 10 పనిగంటలు మాత్రమే పని చేయించేందుకు అనుమతి ఉంది. ప్రైవేట్ ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పిస్తూ సిద్ధరామయ్య సర్కార్ తీసుకొచ్చిన బిల్లుపై ఐటీ రంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ బిల్లుపై ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ ఐటీ ఉద్యోగుల్ని టార్గెట్ చేస్తూ.. మరో బిల్లును తీసుకురావటం చర్చనీయాంశమైంది.

కర్ణాటకలో 'బాయ్‌కాట్ ఫోన్‌పే' ట్రెండింగ్

కర్ణాటకలో స్థానిక కోటా బిల్లుకు వ్యతిరేకంగా విమర్శలు చేసిన డిజిటల్ పేమెంట్ దిగ్గజ సంస్థ 'ఫోన్‌పే' సీఈవో సమీర్ నిగమ్‌పై కన్నడిగులు మండిపడుతున్నారు. ఈ వ్యాఖ్యలకు నిరసనగా ఫోన్‌పేను బహిష్కరించాలని, ఆ యాప్‌ను ఫోన్ల నుంచి అన్‌ఇన్‌స్టాల్ చేయాలంటూ కన్నడ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా పిలుపునిస్తున్నారు. #Boycott PhonePe, # Uninstall PhonePe అనే హ్యాష్‌ట్యాగ్‌లను ఎక్స్‌లో ట్రెండింగ్ చేస్తున్నారు. ప్రైవేటు రంగ ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్ల తప్పనిసరి బిల్లు సరికాదని నిగమ్ అభిప్రాయపడ్డారు.



సేంద్రియ వ్యవసాయ నిపుణులు

కమలా పూజారి కన్నుమూత

భువనేశ్వర్: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ సేంద్రీయ రైతు కమలా పూజారి శనివారం ఒడిశాలో కన్నుమూశారు. 74 ఏండ్ల పూజారి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కమలా పూజారి మృతికి ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరపనున్నట్టు చెప్పారు. వ్యవసాయ రంగానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కొనియాడారు.

అవివేకం.. రాజ్యాంగ విరుద్ధం!

కర్ణాటక లోకల్ కోటా బిల్లును తప్పుబట్టిన కాంగ్రెస్ ఎంపీ

తిరువనంతపురం: కర్ణాటకలోని సొంత పార్టీ ప్రభుత్వంపై కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ, సీడబ్ల్యూసీ సభ్యుడు శశిథరూర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రైవేటు రంగ సంస్థల ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్లు తప్పనిసరి చేస్తూ తీసుకొచ్చిన బిల్లును సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, అవివేకమైన ఆలోచన అని అభిప్రాయపడ్డారు. శశిథరూర్ శుక్రవారం మాట్లాడుతూ 'ఇది తెలివైన నిర్ణయం కాదు. ఇలాంటి చట్టాన్ని దేశంలోని ప్రతి రాష్ట్రం తీసుకొస్తే, అది రాజ్యాంగ విరుద్ధం అవుతుంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడు దేశంలోని ఏ ప్రాంతంలోనైనా జీవించవచ్చు, పని చేసుకోవచ్చు, ప్రయాణం చేయొచ్చు' అని పేర్కొన్నారు.



తలపాగా, కళ్లజోడు ధరించాడని

దళిత యువకుడిపై దాడి

గుజరాత్‌లో ఘటన

అహ్మదాబాద్: బీజేపీ పాలిత గుజరాత్‌లో దళితులపై దాడులు ఆగడం లేదు. సంప్రదాయ తలపాగా ధరించి కళ్లజోడు పెట్టుకుని దిగిన ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేశాడన్న ఆగ్రహంతో ఒక దళిత యువకుడిని కొందరు అగ్రవర్ణాల వ్యక్తులు చావబాదారు. సబర్‌కాంత జిల్లా హిమ్మత్‌నగర్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆటో రిక్షా నడుపుకుని జీవించే అజయ్ పర్మార్ (24) అనే దళిత యువకుడిని నలుగురు వ్యక్తులు తీవ్రంగా కొట్టారు. 'దర్బార్ సామాజిక వర్గం వారే అలాంటి తలపాగా, కళ్లజోడు ధరించాలి. వాటిని పెట్టుకోవడమే కాక ఫొటో తీసి అప్‌లోడ్ చేయడానికి నీకెంత ధైర్యం' అంటూ తనను దితకబాదారని బాధితుడు వాపోయాడు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేశామని, అయితే నిందితులు పరారీలో ఉన్నారని హిమ్మత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ తెలిపారు.

వీధి వ్యాపారులకు రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు

ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐకి నడ్డా ఆదేశం

న్యూఢిల్లీ: వీధుల్లో తినుబండారాలను విక్రయించేవారి వద్ద సంవత్సరానికి ఒకసారి వసూలు చేస్తున్న రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100ను రద్దు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐని ఆదేశించారు. దేశవ్యాప్తంగా స్ట్రీట్ ఫుడ్ హబ్స్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ కోసం నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం సంవత్సరానికి రూ.12 లక్షల వరకు టర్నోవరు కలిగిన చిన్నతరహా ఆహార పదార్థాల వ్యాపారుల వద్ద ఏడాదికి రూ.100 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజును ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ వసూలు చేస్తున్నది. ఈ వ్యాపారులకు సర్టిఫికెట్లను, 'స్ట్రీట్ సేఫ్' ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లను ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అందిస్తున్నది.

తాను మరణించినా.. బిడ్డకు జన్మ

మృతురాలి గర్భం నుంచి జన్మించిన శిశువు

గాజా, జూలై 20: ఓ శిశువు తల్లిగర్భంలోనే మృత్యువును జయించాడు. యుద్ధం మిగిల్చిన విషాదంలో చిరంజీవిలా జన్మించాడు. ఇజ్రాయెల్ - గాజా యుద్ధంలో జరిగిన అద్భుతం ఇది. సెంట్రల్ గాజాలోని నుసీరత్ శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ క్షిపణులతో దాడికి పాల్పడింది. ఈ దాడిలో 24 మంది మరణించగా వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నారు. ఈ కుటుంబంలోనే ఒలా అద్నాన్ హర్బ్ అల్ కుర్ద్ అనే గర్భిణి ఈ దాడిలో తీవ్రంగా గాయపడింది. ఆమెను అల్ అవ్దా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. అయితే, ఆమె గర్భంలోని శిశువు గుండెచప్పుడు అల్ట్రాసౌండ్ ద్వారా వైద్యులు గుర్తించారు. దీంతో వైద్యులు వెంటనే అత్యవసర సిజేరియన్ జరిపి మగబిడ్డను బయటకు తీశారు. శిశువు ఆరోగ్యం కూడా మొదట బాగోలేకపోయినా క్రమంగా కోలుకున్నాడు. ఇజ్రాయెల్ దాడిలో శిశువు తండ్రి కూడా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు.

సెంటర్ల వారీగా నీట్ ఫలితాలు

సుప్రీంకోర్టు ఆదేశాలతో విడుదల చేసిన ఎన్టీఏ

హర్యానా కేంద్రంలో పూర్తి భిన్నమైన ఫలితాలు



న్యూఢిల్లీ, జూలై 20: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలవారీగా నీట్-యూజీ ఫలితాలను శనివారం జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ) విడుదల చేసింది. మే 5న ఈ పరీక్ష జరుగగా జూన్ 4న ఫలితాలు వెలువడ్డాయి. అయితే, ఫలితాల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం వివాదంగా మారింది. నీట్‌లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ విచారిస్తున్నది. అయితే, అక్రమాల నేపథ్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని, మళ్లీ నిర్వహించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిని కలిపి విచారిస్తున్న ధర్మాసనం.. నీట్ ఫలితాలను పరీక్ష కేంద్రాలు, నగరాలవారీగా విడుదల చేయాలని ఎన్టీఏను గురువారం ఆదేశించింది.

ఆ కేంద్రంలో ఫలితాలు తారుమారు

మొదట విడుదల చేసిన నీట్-యూజీ ఫలితాల్లో హర్యానాలోని బహదూర్‌గఢ్‌లో ఉన్న హర్‌దయాల్ పబ్లిక్ స్కూల్‌లో పరీక్ష రాసిన విద్యార్థుల్లో ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం తీవ్ర వివాదమైంది. మరో ఇద్దరికి 719, 718 మార్కులు వచ్చాయి. గతంలో దేశమంతా కలిపి ఒకరిద్దరికి మాత్రమే ఇలా పూర్తి మార్కులు వచ్చేవి. ఈసారి ఒకే కేంద్రంలో ఆరుగురికి 100 శాతం మార్కులు రావడం పట్ల అనుమానాలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులు పరీక్ష సమయాన్ని నష్టపోయినందుకు గ్రేస్ మార్కులు కలపడం వల్ల ఇలా అసాధారణ ఫలితాలు వచ్చినట్టు ఎన్టీఏ చెప్పింది. తర్వాత గ్రేస్‌మార్కులు రద్దు చేసింది. ఇప్పుడు పరీక్ష కేంద్రాలవారీగా వెల్లడించిన ఫలితాలు ఈ కేంద్రంలో మొదట ప్రకటించిన ఫలితాలకు పూర్తి భిన్నంగా వచ్చాయి. ఈ కేంద్రంలో 494 మంది పరీక్ష రాయగా అత్యధికంగా ఒక విద్యార్థికి 682 మార్కులు మాత్రమే వచ్చాయి. మరో 13 మంది విద్యార్థులకు 600కు పైగా మార్కులు వచ్చాయి.

సికార్ జిల్లాలో సంచలన ఫలితాలు

రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో ఈసారి భారీ సంఖ్యలో విద్యార్థులు రికార్డు స్థాయి మార్కులు సాధించారు. జిల్లాలో 6,038 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 149 మంది 700కు పైగా మార్కులు సాధించారు. 2,037 మంది 650కి పైగా మార్కులు, మొత్తంగా 4,297 మంది విద్యార్థులు 600కి పైగా మార్కులు తెచ్చుకున్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సెంటర్‌లో 1,968 మంది పరీక్ష రాయగా ఏకంగా 112 మంది 700కు పైగా మార్కులు సాధించారు.

నీట్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

నీట్-యూజీ అక్రమాల కేసులో శనివారం సీబీఐ మరో ముగ్గురిని అరెస్టు చేసింది. వీరిలో ఒకరైన శశికాంత్ పాశ్వాన్ ఎన్ఐటీ జంషెడ్‌పూర్‌లో బీటెక్(ఎలక్ట్రికల్) పూర్తి చేశాడు. పేపర్ లీక్ కేసులో కీలక నిందితుడైన పంకజ్ కుమార్, రాకీతో ఇతడికి సంబంధాలు ఉన్నట్టు సీబీఐ గుర్తించింది. రాజస్థాన్‌లోని భరత్‌పూర్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న కుమార్ మంగళం బిష్ణోయ్, దీపేందర్ శర్మను కూడా సీబీఐ అరెస్టు చేసింది. వీరిద్దరు పంకజ్ కుమార్ దొంగలించిన ప్రశ్నాపత్రానికి సమాధానాలు రాసినట్టు సీబీఐ పేర్కొన్నది. ఈ ముగ్గురి అరెస్టుతో సీబీఐ ఇప్పటివరకు అరెస్టు చేసిన వారి సంఖ్య 21కి చేరుకుంది.

విదేశాంగ కార్యదర్శిని

నియమించిన కేరళ

- విజయన్ సర్కారు అసాధారణ నిర్ణయం
- ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ బీజేపీ ధ్వజం
- కేరళను ప్రత్యేక దేశంగా ఏర్పాటుచేయాలని సీఎం ప్రయత్నిస్తున్నారా? అని నిలదీత



కొచి, జూలై 20: కేరళ ప్రభుత్వం తీసుకున్న అసాధారణ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఐఏఎస్ అధికారిణి కే వాసుకిని విదేశాంగ కార్యదర్శిగా నియమిస్తూ ఈ నెల 15న పినరయి విజయన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె కార్మిక, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్నారు. విదేశీ సహకారానికి సంబంధించిన అంశాలు సైతం చూసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇందుకు గాను కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ, ఎంబసీలతో సమన్వయం కోసం న్యూఢిల్లీలోని కేరళ హౌజ్ రెసిడెంట్ కమిషనర్ సహకరిస్తారని ఆదేశాల్లో పేర్కొన్నది. కాగా, ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయమై బీజేపీ కేరళ అధ్యక్షుడు కే సురేంద్రన్ స్పందిస్తూ.. 'ఈ నిర్ణయం రాజ్యాంగంలోని కేంద్ర అధికారాల జాబితాను ఉల్లంఘించడమే. ఇది తీవ్రమైన అతిక్రమణ. విదేశీ వ్యవహారాలపై ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదు. ఈ రాజ్యాంగ విరుద్ధ చర్య ప్రమాదకర ఉదాహరణగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. కేరళను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు.

కేరళలో మళ్లీ నిపా కలకలం!

కేరళలో మళ్లీ నిపా వైరస్ కలకలం రేపింది. కోజికోడ్‌లో 15 ఏండ్ల బాలుడికి వైరస్ సోకింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలుడు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని చెప్పారు. బాలుడితో సన్నిహితంగా ఉన్నవారిని ఇప్పటికే క్వారంటైన్‌లో ఉంచామని, వారి శాంపిళ్లను పరీక్షలకు పంపినట్టు తెలిపారు.



డైనోసార్ అస్థిపంజరం రూ.373 కోట్లు!

వాషింగ్టన్: దాదాపు 15 కోట్ల సంవత్సరాలనాటి డైనోసార్ అస్థిపంజరానికి రూ.373.41 కోట్ల ధర పలికింది. సోత్‌బైలో జరిగిన వేలంలో దీనిని హెడ్జ్ ఫండ్ సిటాడెల్ వ్యవస్థాపకుడు, సీఈవో కెన్ గ్రిఫిన్ సొంతం చేసుకున్నారు. దీంతో వేలం రికార్డులన్నీ బద్దలయ్యాయి. దీనిని 2022 మే నెలలో కొలరాడోలో వెలికి తీశారు. దీనికి 'అపెక్స్' అని పేరు పెట్టారు. ఇప్పటి వరకు దొరికిన డైనోసార్లలో ఇదే అతి పెద్దదని సోత్‌బై తెలిపింది. దీని ఎత్తు 11 అడుగులని, పొడవు 27 అడుగులని వివరించింది. దీనికి 319 ఎముకలు ఉంటాయని అంచనా వేశారు, ప్రస్తుతం 254 ఎముకలు భద్రంగా ఉన్నాయని తెలిపింది.



కెనడా, గ్రీన్‌ల్యాండ్ మధ్య చిన్న ఖండం

న్యూఢిల్లీ, జూలై 20: ఇంతవరకు ప్రపంచానికి ఇప్పటివరకు తెలియని ఓ చిన్న ఖండం ఒకటి కెనడా, గ్రీన్‌ల్యాండ్ మధ్య ఉందని తాజా అధ్యయనంలో తేలింది. 'డేవిస్ జల సంధి' కింద ఈ 'సూక్ష్మ ఖండం' ఉందని పరిశోధకులు గుర్తించారు. ఉప్సాలా యూనివర్సిటీ (స్వీడన్), డెర్బీ యూనివర్సిటీ (యూకే)కి చెందిన భూగర్భ శాస్త్రవేత్తలు మొదటిసారి కనుగొన్నారు. సైంటిస్టుల బృందం ఇక్కడి టెక్టోనిక్ ప్లేట్ కదలికలపై అధ్యయనం చేస్తుండగా, ఈ ప్రాంతంలో 402 కిలోమీటర్ల పొడవుతో కూడిన చిన్నపాటి ఖండం ఉందన్న సంగతి బయటపడింది. ఈ ఖండం దాదాపు 6 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడిందని సైంటిస్టులు వెల్లడిస్తున్నారు.

నీటిలో తగ్గిపోతున్న ఆక్సిజన్!

- పెరుగుతున్న జల ఉష్ణోగ్రతలే కారణం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిశోధకులు
- 'ప్లానెటరీ బౌండరీస్'లో చేర్చాలని సూచన



న్యూయార్క్, జూలై 20: భూమిపై సముద్ర, మంచినీటి వనరుల్లో ఆక్సిజన్ తగ్గిపోతున్నదని అమెరికాకు చెందిన పరిశోధకులు గుర్తించారు. ఇది భూమిపై ఉన్న ప్రాణులకు భారీ ముప్పుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటివనరుల్లో ఆక్సిజన్ స్థాయిలపై న్యూయార్క్‌లోని రెన్సీలియర్ పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ కెవిన్ రోస్ నేతృత్వంలో ఒక అధ్యయనం జరిగింది. ఈ వివరాలు 'నేచర్ ఎకాలజీ ఎవల్యూషన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. దీని ప్రకారం.. భూమిపై జీవించే ప్రాణులకు గాలిలోని ఆక్సిజన్ ఎంత ముఖ్యమో, సముద్రంలో, మంచినీటి వనరుల్లో జీవించే జలచరాలకు సైతం నీటిలోని ఆక్సిజన్ అంతే అవసరం. పెరుగుతున్న గ్రీన్‌హౌజ్ వాయువు ఉద్గారాల కారణంగా నీటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వేడి నీరు ఎక్కువగా ఆక్సిజన్‌ను సరిగ్గా ఒడిసిపట్టలేదని పరిశోధకులు తెలిపారు. నీటిలో మురుగు, పారిశ్రామిక వ్యర్థాలు కలవడం, వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం కూడా ఈ పరిస్థితికి కారణమవుతున్నట్టు చెప్పారు. కోట్లాది మంది ప్రజలు తమ ఆహారం, ఆదాయం కోసం జలవనరాలపై ఆధారపడుతున్నారని, నీటిలో ఆక్సిజన్ తగ్గిపోవడం వల్ల మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

'ప్లానెటరీ బౌండరీస్'లో చేర్చాలి

నీటిలో ఆక్సిజన్ తగ్గిపోవడంపై కూడా ఒక పరిమితి విధించాలని ప్రతిపాదించారు. ఇప్పటివరకు వాతావరణ మార్పు, ఓజోన్ క్షీణత, ప్రపంచ మంచినీటి వినియోగం, జీవ వైవిధ్యానికి జరుగుతున్న నష్టం వంటి తొమ్మిది అంశాలపై అంతర్జాతీయ శాస్త్రవేత్తలు కొన్ని పరిమితులు ప్రతిపాదించారు. వీటినే 'ప్లానెటరీ బౌండరీస్' అంటారు. ఈ ప్లానెటరీ బౌండరీస్‌లో ఉన్న పరిమితులు మీరకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు నీటిలో ఆక్సిజన్ తగ్గిపోవడాన్ని కూడా 'ప్లానెటరీ బౌండరీస్'లో పదో పరిమితిగా చేర్చాలని పరిశోధకులు సూచించారు.

ప్రభుత్వ సలహాదారుగా కేకే బాధ్యతలు

హైదరాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ అఫైర్స్ సలహాదారుగా మాజీ ఎంపీ కే కేశవరావు శనివారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలె యాదయ్య, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'క్రిప్టో' మోసగాడి అరెస్టు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, తమిళనాడు, రాజస్థాన్‌లో క్రిప్టో ట్రేడింగ్ పేరుతో అమాయకులను మోసం చేస్తున్న సైబర్ నేరస్థుడిని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులు అరెస్టు చేసినట్టు ఎడీజీ శిఖా గోయెల్ వెల్లడించారు. అతని నుంచి సుమారు రూ.లక్షా 58 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన బాధితుడు సాయిక్రిష్ణగౌడ్ ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన సీఎస్‌బీ సిబ్బంది నిందితుడు అరుణ్ చౌదరిని రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో శుక్రవారం అరెస్టు చేశారు. అక్కడ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొచ్చినట్టు శిఖాగోయెల్ చెప్పారు. నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీ కోసం కరీంనగర్ న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఇతనికి గత ఏప్రిల్‌లో సాయిక్రిష్ణగౌడ్ రూ.లక్షా 58 వేల నగదు ట్రాన్స్‌ఫర్ చేశాడని తెలిపారు.

త్వరలో 10 మినరల్ బ్లాక్‌ల వేలం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): వివిధ రాష్ట్రాల్లోని కొత్త క్రిటికల్, స్ట్రాటజిక్ గనులను త్వరలో వేలం వేయనున్నట్టు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 10 మినరల్ బ్లాక్‌లను ఎంపిక చేసినట్టు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్‌షో'లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 373 మినరల్ బ్లాక్స్ వేలం పూర్తయిందని, మరో 24 క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ బ్లాక్‌లను వేలం వేయాలని నిర్ణయించినట్టు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని వివరించారు.

నాడు



నిండుగా సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా వెళ్తున్న నీరు

• సింగూరు ఆయకట్టు రైతన్నను కరుణించరా?

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టు నుంచి వానాకాలం సాగుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నీటిని విడుదల చేయలేదు. దీంతో కాలువలు ఎండిపోయి గడ్డితో నిండిపోయాయి. నిరుడు ఇదే సమయానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసి ఆయకట్టు కింద పంటల సాగుకు అవకాశం కల్పించింది. సింగూరు ప్రాజెక్టు నిల్వసామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 13.565 టీఎంసీల నీరు ఉన్నది. ప్రాజెక్టు కింద 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సి ఉన్నది. పుల్కల్, చౌటకూరు, అందోలు మండలాల్లోని రైతులు కాలువలు, చెరువుల కింద సాగు కోసం నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. వర్షాభావం కారణంగా చెరువుల్లో నీళ్లులేవు. వర్షాలు లేకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు సింగూరు నుంచి కాలువల ద్వారా సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్టులో కేవలం 13 టీఎంసీల జలాలు ఉన్నందున తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాలువల ద్వారా సాగునీరు ఇచ్చే విషయంలో నీటిపారుదలశాఖ అధికారులు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.

-సంగారెడ్డి ఫొటోగ్రాఫర్

నేడు



నేడు సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని వదలకపోవడంతో బోసిపోయిన కాలువ

పనిభారంతో ఆర్టీసీ సిబ్బందికి అనారోగ్యం

- డ్రైవర్లకు కౌన్సెలింగ్‌లు, కండక్టర్లకు టార్గెట్లు
- యూనియన్లు లేక ఇష్టానుసారంగా డ్యూటీలు
- మహాలక్ష్మి పథకంతో డ్రైవర్లు, కండక్టర్లపై ఒత్తిడి



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో ఉద్యోగులు తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. ఒకవైపు పనిఒత్తిడి, డబుల్ డ్యూటీలు.. మరోవైపు అనారోగ్య సమస్యలు, అధికారుల వేధింపులతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణికుల సామర్థ్యం 50 మంది వరకు ఉండగా.. గతంలో ఆవరేజ్‌గా 10 నుంచి 20 మంది వరకు ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 80 నుంచి 100 మంది వరకు ప్రయాణం చేస్తున్నారు. ఏ బస్సు చూసినా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నది. అంతమందికి టికెట్లు ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు, బస్సుల్లో కాళ్లు పెట్టే చోటు లేక వృద్ధులు, చిన్న పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు కేఎంపీఎల్ తీసుకురాకపోతే పైఅధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కేఎంపీఎల్ ఎందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు. కండక్టర్లకు టికెట్ల టార్గెట్ నిర్దేశిస్తున్నట్టు ఆర్టీసీలో చర్చ జరుగుతున్నది. టార్గెట్ రాకపోతే తాము ఏం చేయగలం అంటూ వారు వాపోతున్నారు.

ఇష్టారాజ్యంగా డ్యూటీలు

డ్రైవర్లు, కండక్టర్లకు గతంలో 8 గంటల డ్యూటీ ఉండేది. కానీ ఇప్పుడు పని గంటలు నిబంధన లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లిన డ్రైవర్లు, కండక్టర్లు డే డ్యూటీ చేస్తారు. కానీ ఉదయం వెళ్లిన వారు ట్రాఫిక్ ఇబ్బందులతో తిరిగి వచ్చే సరికి రాత్రి అవుతుంది. నిజామాబాద్-హైదరాబాద్ మధ్య అప్ అండ్ డౌన్ 360 కిలోమీటర్లు, నిజామాబాద్-వరంగల్ మధ్య అప్ అండ్ డౌన్ 480 కిలోమీటర్లు, హైదరాబాద్-ఖమ్మం అప్ అండ్ డౌన్ 400 కిలోమీటర్లు. దీంతో వారికి టార్గెట్ ఒత్తిడి కూడా ఉంటుంది. దీంతో కార్మికులకు పని భారం పెరుగుతున్నది. డ్రైవర్లు, కండక్టర్లు నిత్యం 10 నుంచి 12 గంటల పాటు పనిచేస్తున్నారు. దీంతో నిద్ర కరువై అనారోగ్యం బారిన పడుతున్నారు. నిద్రలేమి వల్ల కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

డబుల్ డ్యూటీ చేస్తేనే సెలవులు

ఆర్టీసీ ఉద్యోగులు సెలవులు తీసుకోవాలంటే కూడా ఇబ్బందులు తప్పటం లేదు. కండక్టర్, డ్రైవర్లకు డే డ్యూటీ, నైట్ డ్యూటీ, స్పెషల్ డ్యూటీ ఉంటుంది. రోజంతా పనిచేస్తే మరుసటి రోజు స్పెషల్ ఆఫ్ ఇస్తున్నారు. అలాగే అనారోగ్యం పాలైన సిబ్బంది సంబంధిత డాక్టర్ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటున్నది. ఇతర సెలవులు కావాలంటే అనుమతి తప్పకుండా తీసుకోవాల్సిందే.

కవి జయరాజ్‌కు అస్వస్థత

హైదరాబాద్, జూలై 20: ప్రముఖ కవి, గాయకుడు, గేయ రచయిత జయరాజ్ శనివారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆయనను హుటాహుటిన వరంగల్లులోని నిమ్స్‌కు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్‌గా గుర్తించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆయనకు న్యూరో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని, నాలుగు రోజుల తర్వాత డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపినట్టు ఆయన కుటుంబ సభ్యులు చెప్పారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కాదని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. శనివారం ఆయన ఆమరావతిలో విలేకరులతో మాట్లాడుతూ, ఏపీలోని వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ గ్రాంటు విషయంలో నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతున్నారు. గత జగన్ ప్రభుత్వం కేంద్ర నిధులను దారి మళ్లించిందని, మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో కేంద్ర పథకాలు నిలిచిపోయాయని చెప్పారు.

ఘనంగా 'గీతం' పట్టభద్రుల దినోత్సవం

- 1,325 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం
- 23 మంది విద్యార్థులకు బంగారు పతకాలు

పటాన్‌చెరు, జూలై 20 : గీతం డీమ్డ్ యూనివర్సిటీలో పట్టభద్రుల దినోత్సవం ఘనంగా జరిగింది. శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 15వ పట్టభద్రుల దినోత్సవాన్ని (స్నాతకోత్సవం) వైభవంగా నిర్వహించారు. గీతం ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొఫెసర్ వై గౌతమరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నుంచి 2023-24 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ కోర్సులు పూర్తిచేసిన 1,490 మంది పట్టాలు పొందగా..గీతం హైదరాబాద్ నుంచి ప్రత్యక్షంగా 1,325 మంది, పరోక్షంగా 69 మంది పట్టభద్రులకు డిగ్రీలను, 23 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలు అందజేశారు. పీహెచ్‌డీలో 24 మంది పట్టభద్రులయ్యారు. ఈసీఈ విభాగంతో పాటు బీటెక్ టాపర్‌గా నిలిచిన కే శ్రీ గీతం అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలు అందుకోగా, బీబీఏ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంబీఏ విద్యార్థి శివకుమార్ శివాంజలి, యాక్సిస్ బెస్ట్ ఆల్‌రౌండర్ బీటెక్ విద్యార్థిని వర్ష మైథిలి నిమ్మగడ్డలు బంగారు పతకాలను అందుకున్నారు.

గీతం ప్రాంగణంలో సందడి

విద్యార్థులు పట్టాలు అందుకుంటున్న సందర్భంగా గీతం ప్రాంగణం సందడిగా మారింది. ఉల్లాసభరితమైన, ఉత్సవర వాతావరణంలో బార్క్లేస్ బ్యాంక్ సీఈవో రామ్‌గోపాల్ చేతుల మీదుగా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు తీసుకున్నారు. అనంతరం పట్టాలతో విద్యార్థి బృందాలు చేసిన సందడి అందరినీ ఆకట్టుకున్నది. ప్రయోజకులైన తమ పిల్లలు పట్టాలు పొందటంతో తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. విద్యార్థులతో కుటుంబసభ్యులు ఫొటోలు దిగి సందడిచేశారు. తల్లిదండ్రుల ముఖాల్లో సంతోషం కనిపించింది. బంగారు పతకాలు సాధించిన పట్టభద్రుల విజయాలను గీతం ప్రత్యేకంగా తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



బంగారు పతకం సాధించిన గీతం విద్యార్థినితో బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్‌గోపాల్, గీతం ఉపకులపతి ప్రొఫెసర్ గౌతమరావు తదితరులు

బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుచేయడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఏ ఒక్క హామీని అమలుచేయలేదని విమర్శించారు. బీసీ సబ్‌ప్లాన్ అమలు చేసి వారికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వారం రోజుల్లో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. బీసీ విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేయాలని, రూ.50 కోట్లతో ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవన్ నిర్మించాలని డిమాండ్ చేశారు.

వాణిజ్యం



అబ్దుల్ కలామ్ టెక్నికల్ వర్సిటీ ప్రతినిధులతో టీ హబ్ ప్రతినిధులు

టీ హబ్‌తో అబ్దుల్ కలామ్ వర్సిటీ జట్టు!

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకుగాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం ముందుకొచ్చింది. రెండు రోజులపాటు టీ హబ్ కార్యకలాపాలను పరిశీలించిన ప్రతినిధుల బృందం శనివారం..ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు టీ హబ్‌తో కలిసి పని చేసేందుకు అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరాలను అనుగుణంగా రూపొందించడంలో టీ హబ్ దూసుకుపోతున్నదని, తమ యూనివర్సిటీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేలా త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్టు ప్రతినిధులు తెలిపారు. ప్రైవేట్ రంగంలోని కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు కూడా తమతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని టీ హబ్ ప్రతినిధి వెల్లడించారు. స్టార్టప్‌లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు టీ హబ్ ద్వారా లభిస్తున్నాయని..అలాగే దేశ, విదేశాలకు చెందిన పలు సంస్థలు సంప్రదిస్తున్నందంతో పాటు కలిసి పనిచేసేందుకు వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకుంటున్నాయని తెలిపారు.

పీఎస్‌యూలకు ముప్పుతప్పినట్టేనా?

ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గనున్న ఎన్డీఏ సర్కారు

రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ సంస్థలకు కొత్త ఆశలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్న నరేంద్ర మోదీ సర్కార్ ఈసారికి కాస్త వెనుకడుగు వేసే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయిలో మెజార్టీ రాక పోవడం, మరోవైపు ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పీఎస్‌యూల ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణ అత్యంత దూకుడుగా వ్యవహరించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా 35 పీఎస్‌యూలు ప్రైవేటుపరం అయ్యాయి. మారిన రాజకీయ సమీకరణలతో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతో సంకీర్ణ సర్కారు తమ ప్రాధాన్యతలను మార్చుకున్నట్టు తెలుస్తున్నది. ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలు ప్రైవేటీకరణను ఒప్పుకునే అవకాశాలు లేకపోవడంతో మోదీ సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్టు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రైవేటీకరణ మొగ్గనూపాకుండా..కొన్ని సంస్థలను పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించిన ఆదేశాల పలువురు కేంద్ర మంత్రుల వ్యాఖ్యలు కూడా ఇందుకు బలంచేకూరుతున్నవి. దీంట్లోభాగంగా రాష్ట్రంలో ఉన్న ఆరు ప్రభుత్వరంగ సంస్థలకు ఉపశమనం లభించే అవకాశాలున్నాయి.

రాష్ట్రంలో ప్రైవేటీకరణకు ప్రతిపాదిత సీపీఎస్‌యూలు, వాటి ఆధీనంలోని భూములు(ఎకరాల్లో)..		
1. హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్(హెచ్‌సీఎల్)	-	324.87
2. హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్	-	126.32
3. ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్(ఐడీపీఎల్)	-	551.03
4. హెచ్‌ఎంటీ వాచెస్	-	888.05
5. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ)	-	2,272.85
6. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ	-	3,020
	మొత్తం	7,183.12 ఎకరాలు

మూతపడిన 10 సంస్థలు..

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. ఒకానొక దశలో 27 సంస్థలు ఇక్కడ కార్యకలాపాలను కొనసాగించగా, ఆర్థిక ఇబ్బందులు, నిధులు కేటాయింపులు లేకపోవడంతో పది సంస్థలు మూతపడ్డాయి. దీంతో వీటి సంఖ్య 17కి పరిమితమయ్యాయి. ఈ మూతపడిన పది సంస్థల్లో ఆరింటిని పూర్తిగా వదిలించుకోవాలని కేంద్ర సర్కార్ గతంలోనే ఎత్తుగడ వేసింది. కానీ కేసీఆర్ సర్కార్ తీవ్రంగా



హెచ్‌ఎంటీ తెరుచుకునేనా..

ఒకప్పుడు దేశానికి సమయం చూపించిన హెచ్‌ఎంటీ ప్రస్తుత ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. పీఎస్‌యూలను పట్టించుకోకుండా ప్రైవేట్ రంగ సంస్థలనే ప్రోత్సహిస్తున్న కేంద్ర సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో ఎన్నో సంస్థలు మూతపడ్డాయి. వీటిలో దేశానికి సమయం చూపించిన హెచ్‌ఎంటీ కూడా ఉన్నది. ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన ఈ సంస్థ తయారు చేసిన గడియారాలకు ఎక్కువగా ఆమ్ముడయ్యాయి. ఆ తర్వాత క్రమంలో ప్రైవేట్ రంగ సంస్థలనుంచి పోటీ పెరగడం, నిధులు కేటాయింపులు తగ్గిపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసింది. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల కాలంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి రాష్ట్ర పర్యటన సందర్భంగా హెచ్‌ఎంటీ ప్లాంట్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హెచ్‌ఎంటీని పునరుద్ధరించి తమ ఉద్యోగాలు కాపాడాలని, తమకు రావాల్సిన ప్రయోజనాలను ఇప్పించాలని కోరారు. దీనికి కుమార స్వామి సానుకూలంగా స్పందించారు. హెచ్‌ఎంటీ పునరుద్ధరించడంతోపాటు ఆక్రమణకు గురవుతున్న హెచ్‌ఎంటీ భూములను కాపాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. అయితే నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఉన్న కంపెనీల భూములను విక్రయించాలనేది సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఆరు సీపీఎస్‌యూల ప్రైవేటీకరణకు ఆమోదం తెలపాలని రాష్ట్ర సర్కార్‌పైన కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది.

ఎల్ఐసీ దూకుడు

74 శాతం రిటర్నులు పంచిన సంస్థ




న్యూఢిల్లీ, జూలై 20: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ మళ్లీ తన పూర్వవైభవాన్ని సంతరించుకుంటున్నది. స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన ప్రారంభంలో భారీగా పతనమైన కంపెనీ షేరు తిరిగి నెలకు కొట్టిన బంతిలా దూసుకుపోతున్నది. గడిచిన ఏడాదికాలంలో అత్యధికంగా రిటర్నులు పంచిన షేరు ఎల్ఐసీ కావడం విశేషం. దేశీయ టాప్-10 దిగ్గజ సంస్థల్లో ఎల్ఐసీ షేరు 74 శాతం రిటర్నులు పంచింది. దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ 68 శాతం రిటర్నులు పంచగా..బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) 47.64 శాతం రిటర్నులు పంచింది. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. దేశీయ అత్యంత విలువైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం 10 శాతం మాత్రమే మార్కెట్ విలువ పెరగగా.. ఐసీఐసీఐ బ్యాంక్ 28 శాతం, టీసీఎస్ 25 శాతం, ఇన్ఫోసిస్ 22 శాతం చొప్పున బలపడ్డాయి.

గతేడాదికాలంలో సంస్థల షేర్ల పెరుగుదల రూపాయల్లో..			
కంపెనీ	19 జూలై 19 2023 నాటికి	నాటికి జూలై 2024	తేడా (శాతంలో)
ఎల్ఐసీ	620.4	1,080.1	74.10
భారతీ ఎయిర్‌టెల్	869.8	1463	68.20
ఎస్బీఐ	601.35	887.85	47.64
ఐసీఐసీఐ బ్యాంక్	973.65	1248.15	28.19
టీసీఎస్	3,471	4,330.25	24.76
ఇన్ఫోసిస్	1,474.35	1,807.7	22.61
రిలయన్స్	2,840	3,138.35	10.51
హెచ్‌యూఎల్	2,671.75	2,725	1.99
ఐటీసీ	478.85	475.05	-0.79
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,684.85	1,613.9	-4.21

'బిల్డర్లకు రాయితీలివ్వండి'

వచ్చే బడ్జెట్‌పై క్రెడాయ్

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో గృహ కొనుగోలుదారులకు, తక్కువ ధరలో ఇండ్లను నిర్మించే బిల్డర్లకు మరిన్ని పన్ను ప్రయోజనాలు కల్పించాలని రియల్ ఎస్టేట్ బాడీ క్రెడాయ్ కోరుతున్నది. రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ గాడినపడాలంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యంగా పన్ను రాయితీలు కల్పించినప్పుడే ఈ రంగ సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే అవకాశాలున్నాయని పేర్కొంది. కొత్తగా గృహాలు కొనుగోలుచేసేవారికి వడ్డీ రాయితీని పెంచాలని, అలాగే మళ్లీ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీంను ప్రవేశపెట్టాలని, అప్పుడే చౌక ధర కలిగిన గృహాలకు డిమాండ్ పెరుగుతుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉన్న డిడక్షన్‌ను రూ.5 లక్షలకు పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖకు కోరుతున్నట్టు చెప్పారు.



బడ్జెట్ (2024-25)

నిరాశపరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

క్యూ1లో రూ.16,474 కోట్ల లాభం

ముంబై, జూలై 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,474 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సమీకరించిన రూ.12,370 కోట్ల లాభంతో పోలిస్తే 33 శాతం ఎగబాకగా, జనవరి-మార్చి త్రైమాసికంతో పోలిస్తే లాభాలతో పోలిస్తే మాత్రం 6.5 శాతం తగ్గింది. బ్యాంక్ ఆదాయం మాత్రం రూ.57,816 కోట్ల నుంచి రూ.83,701 కోట్లకు ఎగబాకింది.

- నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం ఎగబాకి రూ.29,840 కోట్లకు చేరుకున్నది. వడ్డీయేతర ఆదాయం మాత్రం 41.3 శాతం తగ్గి రూ.10,670 కోట్లకు పరిమితమైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.2,602 కోట్ల నిధులను వెచ్చించింది. క్రితం ఏడాది ఇది రూ.13,511 కోట్లు కేటాయించడంతో తక్కువ.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.24 శాతం నుంచి 1.33 శాతానికి పెరిగాయి.
- కొత్తగా శాఖలను ప్రారంభించడంతో మొత్తం శాఖల సంఖ్య 8,800కు చేరుకున్నాయి.
- గత త్రైమాసికంలో కొత్తగా రూ.7,900 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.
- పన్నుల కోసం ఒకేసారి రూ.5,107 కోట్లు నిధుల వెచ్చించడంతో ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపింది.
- తాజాగా పెట్టిన ఆస్తులను విక్రయించడంతో రూ.5 వేల కోట్ల నిధులు సమకూరాయి.



అంచనాలుమించిన యూనియన్ బ్యాంక్

ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.3,679 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో లాభంతో పోలిస్తే 13.7 శాతం వృద్ధిని నమోదుచేసింది. వడ్డీల మీద వచ్చే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 6.5 శాతం పెరిగి రూ.9,412 కోట్లకు పెరుగగా.. రుణాల వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. అలాగే ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయం 15.53 శాతం ఎగబాకి రూ.4,509 కోట్లకు చేరుకున్నట్టు బ్యాంక్ ఎండీ, సీఈవో ఏ మణిమేఖలై తెలిపారు. కొత్తగా రూ.2,318 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.54 శాతానికి పరిమితమైంది. మొండి బకాయిలు పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.4,106 కోట్ల నిధులను వెచ్చించింది. ప్రభుత్వరంగ సంస్థలతోపాటు ప్రైవేట్ రంగ కంపెనీల నుంచి రుణాలకు డిమాండ్ అధికంగా ఉన్నదన్నారు. గత త్రైమాసికంలో కార్పొరేట్ రుణాలు 7 శాతం అధికమవగా, విద్యా, పసిడి రుణాలు 40 శాతం చొప్పున పెరిగాయి.

22 నుంచి అసోచామ్ సదస్సు

హైదరాబాద్, జూలై 20: ఈ నెల 22 నుంచి 23 వరకు హైదరాబాద్ వేదికగా బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు అసోచామ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఫ్యాప్సీ ప్రమాణ, తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్తంగా జరుగుతున్న ఈ సమావేశాల్లో యూఏఈ వ్యాపారవేత్తలు, పెట్టుబడుదారులు ప్రధానంగా చర్చించనున్నట్టు అసోచామ్ ఏపీ-తెలంగాణ చైర్మన్ దేవి కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి చెందిన సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి ఈ సమావేశం కీలకం కానున్నదన్నారు.

కొటక్ బ్యాంక్ ఫర్వాలేదు

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.3,520 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది కొటక్ మహీంద్రా బ్యాంక్. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,452 కోట్ల లాభంతో పోలిస్తే 2 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షాకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.13,183 కోట్ల నుంచి రూ.15,675 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.39 శాతంగా నికర ఎన్‌పీఏ 0.35 శాతానికి దిగొచ్చాయి.

హైస్కూళ్ల పనివేళల్లో మార్పు

- ఇకపై 9 నుంచి 4.15 గంటల వరకే
- జంటనగరాల్లో మాత్రం యథావిధిగా

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళల్లో స్వల్ప మార్పులు చేస్తూ విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పని చేయనున్నాయి. ఇంతకు ముందు హైస్కూళ్లు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పని చేశాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు యథావిధిగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో కూడా యథావిధిగా ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతాయి. ట్రాఫిక్ కారణాల దృష్ట్యా హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో పాఠశాలల సమయాన్ని మార్చలేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీఎస్సీకి 84% మంది హాజరు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న డీఎస్సీ ప్రశాంతంగా జరుగుతున్నట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తెలిపారు. మూడోరోజు శనివారం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలకు 84 శాతం మంది హాజరైనట్టు పేర్కొన్నారు. 3,504 మందికి 2,931 మంది హాజరయ్యారని, 573 మంది(16శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. 11,062 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది.

'విద్యుత్తు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించండి'

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు రంగంలో సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ప్రమోషన్ల కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపింది. శనివారం జేఏసీ కన్వీనర్ ఎస్ శివాజీ, కో చైర్మన్ పీ అంజయ్య ఆధ్వర్యంలో సభ్యులు టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీతో సమావేశమయ్యారు. 30 ఏండ్ల సర్వీసు చేసి సీనియారిటీ ఉండి కూడా ఓ ఉద్యోగి ప్రమోషన్ లేకుండా రిటైర్ కావడం బాధాకరమని వాపోయారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఎండీకి అందజేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు రామేశ్వర్ శెట్టి, నాజీరుద్దీన్, రవీందర్‌రావు, పీసం రాజు, రామకృష్ణారెడ్డి, కే వెంకటేశ్, రాజేశ్, లక్ష్మయ్య, అక్బర్ పాల్గొన్నారు.

'ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోండి'


ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20: అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్ మాట్లాడుతూ.. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలు మాఫియాలా వ్యవహరిస్తూ, ఒక్కో సీటును రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.

గన్ మిస్‌ఫైర్.. సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ మృతి

పటాన్‌చెరు, జూలై 20 : గన్ మిస్‌ఫైర్ అయి సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. బీడీఎల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పటాన్‌చెరు మండలం భానూర్ పరిధిలోని బీడీఎల్ పరిశ్రమ బందోబస్తు బాధ్యతలను సీఐఎస్‌ఎఫ్ నిర్వహిస్తున్నది. టౌన్‌షిప్‌లో నివసిస్తున్న పెద్దికోట వెంకటేశ్వర్లు(32) సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బీడీఎల్‌లోని హాంగర్ నంబర్-4లో వెంకటేశ్వర్లు రాత్రి డ్యూటీ చేశాడు. తెల్లవారుజామున డ్యూటీ ముగించుకుని యూనిట్ లైన్ బ్యారక్‌లో బస్సు దిగే క్రమంలో అతని వద్ద ఉన్న గన్ ప్రమాదవశాత్తు పేలడంతో బుల్లెట్ నేరుగా వెంకటేశ్వర్లు తలలో నుంచి బయటకు వెళ్లింది. వెంకటేశ్వర్లును చికిత్స కోసం టౌన్‌షిప్‌లోని దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు 2012లో సీఐఎస్‌ఎఫ్‌లో చేరాడు. ఇతను ఏడాదిన్నరగా బీడీఎల్ భానూర్ యూనిట్ రక్షణ విధులు నిర్వహిస్తున్నాడు.

నేరం చేయకున్నా నిందితుడే!

- సైబర్ నేరాల్లో ప్రమేయం లేకున్నా ఫ్రీజవుతున్న అమాయకుల బ్యాంకు ఖాతాలు
- అన్‌ఫ్రీజ్ ఎలా చేయాలో తెలియక ఇబ్బందులు
- పోలీసుల వద్దకు వెళ్లాలని బ్యాంకుల సూచనలు
- మెయిల్‌కు స్పందించని సైబర్ సెక్యూరిటీ బ్యూరోలు



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ఎవరో చేసిన తప్పు.. మరెవరికో ముప్పు తెస్తున్నది. సైబర్ నేరాల్లో ప్రమేయం లేకున్నా, నేరంలో తాము బాధితులు కాకున్నా కొందరు నిందితులుగా మారుతున్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. తమ ఖాతాలకు ఎవరో డబ్బులు పంపితే.. వారిపై ఇంతవరకు ఫిర్యాదు చేస్తే వీరి అకౌంట్లు స్తంభించిపోతున్నాయి. ఇలా చాలామంది అకౌంట్లు ఫ్రీజ్ కాగా వాటిని తిరిగి ఎలా కొనసాగించాలో తెలియక సతమతమవుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్‌యాప్స్, రమ్మీ గేమ్స్, ఫ్రీ ఫైర్, పబ్జీ వంటి ఆన్‌లైన్ గేమ్స్ నిర్వహిస్తున్న చైనా, ఇతర దేశాల సైబర్ ముఠాలు, ముగ్గులోకి లాగేందుకు ముందుగా ఎంతోకొంత ఖాతాల్లో జమచేయడం, అలా జమైనవారు ఆ డబ్బును తమ అవసరాలకు ఇతరుల ఖాతాలకు పంపుతుండడంతో సంబంధం లేనివారి అకౌంట్లను సైబర్ క్రైమ్ పోలీసులు స్తంభింపజేస్తున్నారు. బాధితులు ఖాతాల నుంచి ఎక్కువ మొత్తంలో నష్టపోవద్దనే సదుద్దేశంతో ఇలా స్తంభింపజేసినా వాటిని యాక్టివేట్/అన్‌ఫ్రీజ్/అన్‌హోల్డ్ చేయడంలో మాత్రం త్వరగా స్పందించడం లేదు. ముఖ్యంగా చిరువ్యాపారులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏం చేయాలో 'పాలు'పోక..

ఖమ్మం జిల్లా కంకోటకు చెందిన యువకుడు యంగల నాగరాజు పాల వ్యాపారం చేస్తుంటాడు. రెండు నెలల క్రితం పాల డబ్బులు ఇవ్వాల్సిన ఓ వ్యక్తి నుంచి అతని ఖాతాకు రూ.5వేలు జమయ్యాయి. సరిగ్గా జూన్ చివరి వారంలో డబ్బులన్నీ లెక్కచెప్పాల్సి ఉండగా అతని అకౌంట్ ఫ్రీజ్ అయినట్టు మెసేజ్ వచ్చింది. తీరా గ్రామీణ వికాస్ బ్యాంకుకు వెళ్తే అకౌంట్ ఎందుకు ఫ్రీజ్ అయిందో ముంబైజోన్‌లో తెలుసుకోవాలన్నారు. ఆ తర్వాత వెళ్తే.. సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లాలని సలహా ఇచ్చారు. ఏం జరిగిందో తెలియక పోలీసుల వద్దకు వెళ్తే వారు ఏదో సైబర్ నేరంలో అకౌంట్ ఫ్రీజ్ అయిందని రెండ్రోజుల తర్వాత చెప్పారు. అప్పటికే నాగరాజు బ్యాంకు వివరాలు పరిశీలించిన సైబర్ క్రైమ్ పోలీసులు, అతను ఎలాంటి సైబర్ నేరానికి పాల్పడలేదని గుర్తించి ఏ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ పోలీసులు తన బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేశారో వారిని మెయిల్, ఫోన్ ద్వారా లేదా ప్రత్యక్షంగా కలవాలని వారం తర్వాత చెప్పారు. అతని అకౌంట్ ఎక్కడో పశ్చిమ బెంగాల్‌లోని సైబర్ క్రైమ్ పోలీసులు ఫ్రీజ్ చేసినట్టు చెప్పారు. ఎందుకు అని సైబర్ క్రైమ్ పోలీసుల ద్వారా అడుగగా నాగరాజుకు రూ.5వేలు పంపిన వ్యక్తికి ఆ డబ్బులు ఓ ఆన్‌లైన్ గేమ్‌లో రావడం, ఆ డబ్బులకు పైనా లింక్ ఉండటంతో అతను డబ్బు ఎవరెవరికి పంపాడో వారి ఖాతాలన్నీ స్తంభింపజేశారు. ఎక్కడో మారుమూల గ్రామంలో పాలమ్ముకునే తాను చేసిన తప్పేంటి? అని నాగరాజు వాపోతున్నాడు.

ఇతర రాష్ట్రాలకు వెళ్లలేని పరిస్థితి..

ఇలా సంబంధం లేని కేసుల్లో ఇరుక్కుంటున్న వారిలో మధ్యతరగతి వారే అధికంగా ఉన్నట్టు సైబర్ సెక్యూరిటీ పోలీసులు చెబుతున్నారు. బాధితులు ఇలాంటి సమస్యలు వారికి చెప్తుంటే.. 'మీరు నిందితులు కాదని తెలుసు. కానీ మీ అకౌంట్ ఫ్రీజ్ చేసిన పోలీసులు మిమ్మల్ని నిందితులనే నమ్ముతున్నారు' అని చెబుతున్నారు. 'నిందితుల తరఫున మీరెలా మాట్లాడతారు?' అంటూ తమతో వాదిస్తున్నారని వాపోతున్నారు. దీంతో ఏ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ పోలీసులు అకౌంట్లను ఫ్రీజ్ చేశారో అక్కడికే వెళ్లి గోడు వెళ్లబోసుకోండని చెబుతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామంలో పాల వ్యాపారం చేసుకునే యువకుడు తాను చేయని నేరానికి మరెక్కడో ఉన్న పశ్చిమ బెంగాల్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇలాంటి బాధితుల పట్ల కేంద్ర సైబర్ సెక్యూరిటీ విభాగం సత్వరంలో నిర్ణయం తీసుకుంటేనే తాము ఏదైనా చేయగలమని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు.

పాఠశాల విద్యకు మంగళమే!

- అంగన్‌వాడీల్లోనే 3వ తరగతి వరకు నిర్వహణపై ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ కేంద్రాల్లోనే 3వ తరగతి వరకు అంటే ప్రభుత్వ పాఠశాల విద్యకు మంగళం పాడటమేనని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. నూతన విద్యావిధానం-2020ను అమలుచేస్తున్నారా? అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూళ్లుగా మార్చి కేజీ నుంచి 3వ తరగతి వరకు చదువు చెప్తామని సీఎం చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కేజీ తరగతులు లేక తల్లిదండ్రులు, 3-5 ఏండ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు కాకుండా ప్రైవేటు ప్లే స్కూళ్లకు పంపుతున్నారని తెలిపారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ గణనీయంగా తగ్గిపోతున్నదని శనివారం ఒక ప్రకటనలో వాపోయారు. ప్రాథమిక పాఠశాలల్లోనే కేజీ తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విద్యను ప్రైవేటీకరించేందుకు కేంద్రం నూతన విద్యావిధానం అమలుచేస్తున్నదని ఆరోపించారు.

'అంగన్‌వాడీ' ఆలోచనను విరమించుకోవాలి

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీలను ప్లేస్కూల్స్‌గా మార్చి 3వ తరగతి వరకు నిర్వహించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన సరి కాదని యూటీఎఫ్ పేర్కొంది. అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించనందున 1,2,3 తరగతులను ఆ కేంద్రాలకు అప్పగించడం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుందని అభిప్రాయపడింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని ఆ సంఘం అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి రవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించదగినదని పేర్కొన్నారు.

'317 జీవో' క్యాబినెట్ సబ్ కమిటీకి కన్సల్టెంట్

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): జీవో 317, జీవో 46పై క్యాబినెట్ సబ్ కమిటీకి ప్రభుత్వం కన్సల్టెంట్‌ను నియమించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టీ వెంకటేశ్వర్‌రావును కన్సల్టెంట్‌గా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతో కూడిన కమిటీకి ఆయన సలహాదారుగా వ్యవహరించనున్నారు. సబ్ కమిటీ సోమవారం భేటీ అయ్యే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు తెలిపాయి.

7 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

- రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌కు సరఫరా
- నలుగురు నిందితుల అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా నడుపుతున్న నలుగురు సభ్యుల ముఠాను మాదాపూర్ పోలీసులతో కలిసి సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద రూ.7 కోట్ల విలువ చేసే ఒక కిలో స్వచ్ఛమైన హెరాయిన్, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి గచ్చిబౌలిలోని పోలీస్ కమిషనరేట్‌లో మీడియాతో వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సంతోష్ ఆచార్య విదేశాల నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి పలు ప్రాంతాలకు సరఫరా చేస్తాడు. అతడి వద్ద నేమీచంద్ బాటీ, సర్వటింగ్ డ్రగ్స్ కొనుగోలు చేసి అజయ్‌బాటీ, హరీశ్ సిర్వితో వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తారు. ఈ క్రమంలో రెండున్నర నెలల కిందట నేమీచంద్ హైదరాబాద్‌కు వచ్చి తన బావమరిది అయిన అజయ్‌బాటీ, అతడి స్నేహితుడు హరీశ్ సిర్వితో హెరాయిన్ అమ్మకాల గురించి చర్చించాడు. వారిద్దరు ఓకే చెప్పటంతో డ్రగ్స్ కోసం రాజస్థాన్ వెళ్లాడు. తిరిగి హెరాయిన్‌ను చిన్న ప్యాకెట్లలో పౌడర్ రూపంలో ప్యాక్ చేసి సర్వటింగ్‌తో కలిసి ప్రైవేట్ బస్సులో నగరానికి చేరుకున్నాడు. అజయ్‌బాటీ, హరీశ్ సిర్విని కలిసి డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నించగా.. అప్పటికే నిఘా పెట్టిన ఎస్‌వోటీ డీసీపీ డీ శ్రీనివాస్ తన బృందంతో వీరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. అయితే, ప్రధాన డ్రగ్స్ సరఫరాదారు అయిన సంతోష్ ఆచార్య ఇప్పటికే డ్రగ్స్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నా.. తన అనుచరుల ద్వారా విక్రయాలు చేపడుతున్నాడని సీపీ మహంతి తెలిపారు. పట్టుబడిన హెరాయిన్ స్వచ్ఛమైనదని, ఇది ఒక గ్రాము రూ.7 వేలకు పైగా ఉంటుందని వెల్లడించారు. నిందితులు నగరంలో ఎవరికి విక్రయించారన్న దానిపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. సంతోష్ ఆచార్యను అదుపులోకి తీసుకుంటే మరిన్ని వివరాలు తెలుస్తాయని అన్నారు. కేసు ఛేదించిన సంపాదన్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ బృందం, మాదాపూర్ పోలీసులను సీపీ అభినందించారు. అటు.. డీజీపీ జితేందర్ కూడా పోలీస్ బృందాన్ని అభినందించారు. డ్రగ్స్‌ను అరికట్టడంలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పోలీసులకు సూచించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న అవినాశ్ మహంతి

ముంబై పోలీసులమని 3.40 లక్షలు టోకరా

ఎదులాపురం, జూలై 20 : ముంబై పోలీసులమని చెప్పి 3.40 లక్షలు టోకరా వేశారు. ఆదిలాబాద్‌లోని టీచర్స్‌కాలనీ నివాసి అయిన రిమ్స్‌లో పీజీ చదువుతున్న వైద్య విద్యార్థినికి 12న గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 'మేము ముంబై పోలీసులం.. మీ ఫోన్ ఐడీ పేరుతో పేరిట ఉన్నది. ఆ ఐడీపై నేరాల కేసులు ఉన్నాయి. వెంటనే మీ ఫోన్ ఐడీతో బ్యాంకులో ఉన్న మొత్తం డబ్బును మేము చెప్పిన నంబర్‌కు పంపించాలి' అని భయపెట్టించారు. వైద్య విద్యార్థిని వారు చెప్పిన ఖాతాకు రూ.3.40 లక్షలు బదిలీ చేసింది. అనంతరం ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని భావించి ఆదిలాబాద్ సైబర్ క్రైమ్1930 నంబర్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన సైబర్ క్రైమ్ పోలీసులు అప్పటికప్పుడు రూ.లక్ష మాత్రం ఫ్రీజ్ చేయించగలిగారు.

ఉద్యోగాల పేరిట మోసం

అనంతపూర్‌కు చెందిన ఐదుగురి అరెస్ట్

రాజన్న సిరిసిల్ల, జూలై 20 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగాల పేరిట వల వేసి.. ఒక్కొక్కరి నుంచి పదివేల దాకా వసూలు చేసి నిరుద్యోగులను మోసం చేస్తున్న ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపూర్‌కు చెందిన ఎర్రబడ్డి గోపి.. 'ట్రాన్స్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్' పేరిట కంపెనీ ఏర్పాటు చేశాడు. దానికోసం ఓ లోకల్ యాప్ కూడా తయారు చేయించాడు. అందులో పని చేయడం కోసం అనంతపూర్‌కు చెందిన కరుణ అశోక్‌కుమార్, మాదిగ బ్రహ్మంత్ర, సత్యసాయి పుట్టపర్తి జిల్లాకు చెందిన మాదిగ స్వాతి, కరుణ వరలక్ష్మిని చేర్చుకున్నాడు. హెల్త్‌కేర్, పర్సనల్ కేర్, హోమ్ కేర్, ఫ్యాషన్ వేర్, గోల్డ్ అండ్ డైమండ్‌కు సంబంధించిన వస్తువులను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి లింక్‌లు పంపించారు. ఒక్కొక్కరి వద్ద రూ.10వేల చొప్పున వసూలు చేసి కంపెనీ ఐడీ ఇచ్చారు. మరికొంత మందిని కంపెనీలో చేర్పిస్తే కమీషన్ వస్తుందని నమ్మించారు. ఇలా నిరుద్యోగులను మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీలో చేర్పుకుంటూ పెద్ద మొత్తంలో కమిషన్ పొందారు. వీరి ప్రకటనలను నమ్మిన సిరిసిల్లకు చెందిన దూస రమ్య తనకు ఉద్యోగం కావాలని మెసేజ్ చేసింది. అందుకు గోపి స్పందించి ఉద్యోగం ఇస్తామని చెప్పి దాదాపు రూ.10 వది వేలకుపైనే వసూలు చేశాడు. తీరా మోసపోయానని గ్రహించిన ఆమె ఇటీవల సిరిసిల్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసిన సైబర్ పోలీసులు విచారణ చేపట్టారు. ఏపీలోని అనంతపూర్‌లో ఆ ఐదుగురు నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసి సిరిసిల్లకు తీసుకొచ్చారు. ఈ కంపెనీపై పదికిపైగా ఫిర్యాదులున్నట్టు ఎస్పీ తెలిపారు.


రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు

- ఆర్టీసీ పనితీరుపై సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో శనివారం ఆయన ఆర్టీసీ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీలోని ఆయా విభాగాల పనితీరు, మహాలక్ష్మి పథకం అమలు, కొత్త బస్సుల కొనుగోలు, ఆర్థిక అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకాన్ని సమర్థంగా అమలుచేస్తున్న సిబ్బందిని మంత్రి అభినందించారు. శుక్రవారం నాటికి 68.60 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుని, రూ.2350 కోట్లు ఆదా చేసుకున్నారని చెప్పారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు ఇప్పుడున్న సర్వీసుల కంటే మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. 3,035 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. ఆర్టీసీ బాండ్లకు సంబంధించిన రూ.200 కోట్లను త్వరలోనే విడుదల చేస్తామని చెప్పారు. ఈ ఏడాది 38 డిపోలు లాభాల్లో ఉన్నాయని, కార్గో సేవలను విస్తరించేందుకు రిటైర్డ్ ఉద్యోగుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 'సంస్థ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో రోజూ సగటున 30 లక్షల మంది మహిళలు క్షేమంగా ప్రయాణిస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే సంస్థ బీబీయన్ డాల్ (రూ.8500 కోట్లు) టర్నోవర్ కార్పొరేషన్‌గా అవతరించబోతున్నదన్నారు. సమీక్షలో సంస్థ సీవోవో రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, వినోద్‌కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప పాల్గొన్నారు.

లంచం తీసుకుంటే ఉద్యోగం ఊడగొట్టాలి

- కఠిన చర్యల్లేకే రెచ్చిపోతున్న లంచావతారులు
- ఎక్స్ వేదికగా లంచాధికారులపై నెటిజన్ల ఫైర్
- ఏకీభవిస్తున్నానని స్పందించిన ఏసీబీ డీజీ ఆనంద్



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): లంచం అడగాలంటేనే హడల్ పుట్టాలి.. రెండు సార్లు లంచం తీసుకుంటూ పట్టుబడితే ఉద్యోగాన్నే ఊడగొట్టాలి.. దీనికోసం కఠిన చట్టాలు రావాలి.. అంటూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా స్పందించారు. ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేస్తూ పలువురు అభిప్రాయాలను పంచుకున్నారు. కఠిన చట్టాలు లేకపోవడంతోనే లంచాధికారులు రెచ్చిపోతున్నారని నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కఠిన చట్టాలుంటే మరోసారి డబ్బు తీసుకునేందుకు అధికారులు వెనుకాడతారని అభిప్రాయపడ్డారు. ఈ విషయాలను ఉదహరిస్తూ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేయగా.. ఆయన 'అందుకు పూర్తిగా అంగీకరిస్తున్నాను' అంటూ తన అభిప్రాయం వెలిబుచ్చారు. ప్రజలకే సేవ చేయాల్సిన ప్రభుత్వ అధికారులు లంచాల పేరుతో సామాన్యులను పీడిస్తే కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలు రావాల్సిన అవశ్యకత ఉందని సీవీ ఆనంద్ అభిప్రాయపడ్డారు. సుదాకర్ ఉడుముల అనే సీనియర్ జర్నలిస్టు.. సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి కాటూర్ రూపేందర్‌సింగ్ తాజా వ్యవహారాన్ని ఉదహరించారు. ఇటీవల ఆయన రూ.25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నది. ఆయన ఇలా దొరకడం ఇది మూడోసారి కావడంతో జర్నలిస్టులు సహా పలువురు కొత్త చట్టాలు రావాల్సిన అవశ్యకతను వెలిబుచ్చారు. 'ఇప్పటికే కాటూర్ రూపేందర్ సింగ్‌ను మూడోసారి ఏసీబీ సిబ్బంది పట్టుకున్నారు. అయినా అతనిపై ఎలాంటి చర్యలు లేవు. సగం వేతనంతో 6 నెలలపాటు సస్పెండ్ చేస్తారేమో. ఆ తర్వాత మళ్లీ అతను ఇలాగే లంచాల కోసం ప్రజలను వేధిస్తూనే ఉంటాడు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సీవీ ఆనంద్ స్పందిస్తూ.. 'కొన్ని చట్టాలు సున్నితమైనవి, మరికొన్ని పరిమితికి లోబడి ఉన్నాయి. ఏం చేస్తాం' అంటూ రీపోస్టు చేశారు. ఇందుకు దేవదాస్ అనే నెటిజన్ స్పందిస్తూ కఠిన చట్టాలు రావాల్సిందేనని తెలిపారు. తానూ ఏకీభవిస్తున్నట్టు సీవీ ఆనంద్ సమాధానం ఇచ్చారు. ఇకనైనా ప్రభుత్వం కఠిన చట్టాలు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు, సామాన్యులు తదితరులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో సమ్మక్క ప్రధాన పూజారి మృతి



మల్లెల ముత్తయ్య (ఫైల్)

తాడ్వాయి, జూలై 20: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క దేవత ప్రధాన పూజారి మల్లెల ముత్తయ్య (60) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పలు దవాఖానల్లో చికిత్స పొందారు. ఇటీవల ఇంటికి వచ్చిన ముత్తయ్య శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా శనివారం తెల్లవారుజామున ఇంటి వద్దనే మృతి చెందారు. ముత్తయ్యకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

ఆర్టీసీ యూనియన్లను పునరుద్ధరించాలి

- ట్రేడ్ యూనియన్ల సమావేశంలో ఆర్టీసీ కార్మిక నేతలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీజీఎస్ ఆర్టీసీలోని అన్ని కార్మిక సంఘాల ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని, ఈ మేరకు లేబర్ కమిషనర్‌కు ఈ నెల 24లోపు లేఖలు అందజేయాలని వివిధ కార్మిక సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన ట్రేడ్ యూనియన్ల సమావేశంలో ఆయా నేతలతో పాటు థామస్‌రెడ్డి (టీఎంయూ), జీఆర్ రెడ్డి (ఎస్‌డబ్ల్యూఎఫ్), ఎండీ మౌలానా (ఎన్ఎంయూ) తదితరులు మాట్లాడారు. అన్ని ట్రేడ్ యూనియన్ల నేతలు సమిష్టిగా వెళ్లి లేబర్ కమిషనర్‌పై జాయింట్ మీటింగ్ కోసం ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. ట్రేడ్ యూనియన్ల స్థానంలో ఎంప్లాయీ వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటుచేయడం రాజ్యాంగవిరుద్ధమని, కార్మిక సమస్యలను పరిష్కరించలేని బోర్డులు ఎందుకని ప్రశ్నించారు. కార్మికులపై విపరీతమైన పనిభారం పెరిగిందని, వారిపై యాజమాన్యపు వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి ఏడు నెలలైనా ఎందుకు అమలుచేయడం లేదని నిలదీశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మరో సుదీర్ఘ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అబ్బాస్ అలీ, ఉపాధ్యక్షుడు ఎస్ బాల్‌రెడ్డి, ఉపప్రధాన కార్యదర్శులు పీ అప్పారావు, జీ రాఘవులు పాల్గొన్నారు.

మహిళా కూలీకి మద్యం తాగించి లైంగికదాడి

అచ్చంపేట రూరల్, జూలై 20: మహిళా కూలీలపై ఇద్దరు వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. వారికి మద్యం తాగించి లైంగికదాడి చేశారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని సోనీ గ్రానైట్స్ అండ్ మార్బుల్స్ వ్యాపారులు, రాజస్థాన్‌కు చెందిన యువకులు గోవింద్‌సింగ్, గజానంద్‌సింగ్ అదే పట్టణంలో అద్దెకు ఉంటున్నారు. 18న తమ ఇంట్లో పని ఉందని బల్మూరు మండలంలోని రెండు వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు మహిళలను కూలికి మాట్లాడుకున్నారు. వారిని ఇంటికి తీసుకెళ్లి పనులు చేయించుకొని డబ్బులు ఇచ్చారు. ఆ తర్వాత తిరిగి పంపించకుండా దావత్ ఇస్తామని ఆశ పెట్టారు. మాయమాటలు చెప్పి హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి సమీపంలోకి తీసుకెళ్లి మద్యం తాగించారు. వారు మత్తులోకి జారుకున్నాక గోవింద్, గజానంద్ లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం వెల్దండ గేటు వద్ద ఒకరిని, పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలో మరొకరిని రాత్రి కారులోంచి దింపి పరారయ్యారు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా.. వారు పోలీసులకు తెలిపారు. ఇద్దరు మహిళలను అచ్చంపేట దవాఖానకు తరలించారు. మత్తు దిగిన తర్వాత వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దవాఖానలో బాలుడి కిడ్నాప్

- తండ్రి పక్కన నిద్రిస్తుండగా అపహరణ
- నిజామాబాద్‌లో ఘటన

వినాయక నగర్, జూలై 20: నిజామాబాద్‌లోని జీజీహెచ్‌లో తండ్రి పక్కన నిద్రిస్తున్న మూడేండ్ల బాలుడిని ఆగంతకులు తెల్లవారుజామున అపహరించుకుపోయారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాణిక్‌బండారుకు చెందిన సాయినాథ్ భార్య గర్భిణి. ప్రసవం కోసం ఆమెను ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. సాయినాథ్ తన మూడేండ్ల కుమారుడు అరుణ్‌తో కలిసి శుక్రవారం రాత్రి దవాఖాన కారిడార్‌లో నిద్రించారు. శనివారం తెల్లవారుజామున ఇద్దరు దుండగులు తండ్రి పక్కలో నిద్రిస్తున్న అరుణ్‌ని ఎత్తుకెళ్లారు. ఉదయం సాయినాథ్ లేచి చూడగా కొడుకు కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారమివ్వగా, సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా.. ఆగంతకులు బాబును భుజాన వేసుకుని వెళ్తున్నట్టు గుర్తించారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు నేతృత్వంలోని బృందం గంటల వ్యవధిలోనే కేసును ఛేదించింది. సాంకేతికత ఆధారంగా బాలుడిని మెట్‌పల్లికి తీసుకెళ్లినట్టు తేలడంతో ప్రత్యేక బృందం హుటాహుటిన అక్కడికెళ్లి బాలుడిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాబును తల్లిదండ్రులకు అప్పగించారు.

పాము కాటేసిందంటే జోకులేసుకున్నరు!

- బాధితురాలిని పట్టించుకోని డాక్టర్లు
- ఖమ్మం పెద్ద దవాఖాన వైద్యుల అలసత్వం
- ముచ్చట్లతో కాలక్షేపం
- ప్రశ్నిస్తే బాధితురాలిని తీసుకొచ్చిన వ్యక్తిపై ఆగ్రహం
- కాంగ్రెస్ పాలన గిట్లనే ఉంటదని జనాల సెటైర్లు



దవాఖానకు తీసుకొచ్చిన వ్యక్తితో వాగ్వాదానికి దిగిన డాక్టర్లు

ఖమ్మం సిటీ, జూలై 20 :

పాయుడు : 'డాక్టరమ్మా! మా అమ్మను పాము కరిచింది. కొంచెం చూడండమ్మా..!

డాక్టరు : ఓపీ రాయించుకున్నారా?

పాయుడు : లేదమ్మా

డాక్టరు : ఓపీ రాయించుకుని రా.. పో పావుగంట తర్వాత..

పాయుడు : ఓపీ రాయించుకుని వచ్చాను. ఒక్కసారి వచ్చి చూడండమ్మా..

డాక్టరు : టెస్టులు చేయించుకున్నారా?

పాయుడు : ఏ టెస్ట్ చేయించాలి? ఎవరూ చెప్పలేదమ్మా

డాక్టరు : చెప్తుంది వెయ్ వెళ్లు (విసుగ్గా)

అర్ధగంట గడిచిపోయింది. ఓపీ గదిలో కూర్చున్న ముగ్గురు డాక్టర్ల పకపకలు.. ముచ్చట్లు.. పాము కాటుకు గుర్తై, తీవ్ర భయాందోళనతో దాపురితురాలు మధ్య కొట్టుమిట్టాడుతుంటే వైద్యులు వ్యవహరించిన తీరిది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్‌రోడ్డులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన గండికోట వెంకటమ్మ శుక్రవారం ఉదయాన్నే ఓ రైతుకు చెందిన కూరగాయల చేనులో పనికి వెళ్లగా పాము కాటేసింది. రైతు ఆయన ఆటోలో హుటాహుటిన ఖమ్మంలోని జిల్లా సార్వజనీన దవాఖానకు తీసుకెళ్లాడు. ఆమెను వైద్యులు కూర్చోబెట్టుమని క్యాజువాలిటీ వార్డుకు వెళ్లాడు. ఎదురుగా ఉన్న గదిలో ముగ్గురు వైద్యురాళ్లు కూర్చుని ఏవో మాటల్లో మునిగిపోయారు. వారి దగ్గరకు వెళ్లిన రైతు.. తమ గ్రామానికి చెందిన మహిళ పాము కాటుకు గురైందని, వచ్చి చూడాలని ప్రాధేయపడ్డాడు. 'ఏం పాము కరిచింది? ఓపీ రాయించుకుని వచ్చారా?' అంటూ.. డాక్టర్లు కనీసం కుర్చీలో నుంచి లేవకుండా, బాధితురాలిని చూడకుండా.. పేషెంట్‌ను తీసుకొచ్చిన వ్యక్తిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఓపీ రాయించి వెళ్లగా ఇంకా దాదాపు పావుగంట సమయం గడిచింది. తిరిగి క్యాజువాలిటీ వద్దకు వచ్చిన వారిని టెస్ట్‌లు చేయించుకుని రావాలంటూ మరో ఆర్డర్ వేశారు. ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను తీసుకుని రక్తపరీక్షల కేంద్రానికి వెళ్లి వచ్చేసరికి మరో అర్ధగంట పట్టింది. ఇప్పుడైనా వచ్చి చూడండి మేడం అని వైద్యులను కోరగా ఎలాంటి స్పందనా లేదు. చేతుల్లోని సెల్‌ఫోన్లను చూస్తూ ముచ్చట్లలోకి దిగారు. ఒకరిమీద మరొకరు జోకులు వేసుకుంటూ పగలబడి నవ్వుకున్నారు.

> **మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నం**
>
> జిల్లా సార్వజనీన దవాఖానలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం ఓపీ విపరీతంగా పెరిగింది. అయినప్పటికీ ఎంతో జాగ్రత్తగా వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసేలా వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడం సరికాదు.
>
> - కిరణ్‌కుమార్, దవాఖాన సూపరింటెండెంట్

ప్రశ్నించిన వ్యక్తిపై ఆగ్రహం

వైద్యుల అలసత్వంపై రైతు తీవ్ర ఆసహనం వ్యక్తంచేశారు. ఇదేంటి మేడం.. మనిషి చనిపోతున్నా స్పందించరా? అని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన వైద్యులు.. అరుస్తున్నావ్ ఎందుకు? మాకు తెలియదా? ఆమెకు ఏమీ కాదులే..! అంటూ ఒక మహిళా డాక్టర్ తీరిగ్గా కుర్చీలో నుంచి లేచి పేషెంట్ దగ్గరకు వచ్చారు. నాడీ కూడా పట్టకుండానే ఇంజెక్షన్ ఇవ్వండి అంటూ పక్కనే ఉన్న నర్సుకు చెప్పి తిరిగి గదిలోకి వెళ్లిపోయింది. వైద్యుల అలసత్వంతో విసిగిపోయిన ఓ వ్యక్తి అక్కడ జరుగుతున్న తీరును ఎవరికీ తెలియకుండా వీడియో తీసి శనివారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో రాష్ట్రవ్యాప్తంగా వైరలైంది. కాంగ్రెస్ పాలనలో గిట్లనే ఉంటదని మరికొందరు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పుష్ప అంటే ఫైర్

ఓటీటీ హిట్

బహిష్కరణ

ఓటీటీ: జీ5 (స్ట్రీమింగ్ అవుతున్నది)
నటీనటులు: అంజలి, రవీంద్ర విజయ్, అనన్య నాగళ్ల, శ్రీతేజ్
దర్శకుడు: ముకేశ్ ప్రజాపతి

వైవిధ్యమైన క్యారెక్టర్లతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరోయిన్ అంజలి. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో విభిన్నమైన క్యారెక్టర్లు చేసిన ఆమె కొన్నాళ్ల నుంచి లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ బిజీగా మారింది. ఇక, ఓటీటీల హవా పెరిగిన తర్వాత సినిమా, సిరీస్‌లతో అభిమానులను అలరిస్తున్నది. మెగా పవర్‌స్టార్ రాంచరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గేమ్‌ఛేంజర్'లో ఆమె నటిస్తున్న సంగతి తెలిసిందే! తాజాగా అంజలి నటించిన వెబ్‌సిరీస్ బహిష్కరణ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చింది. దీని కథేంటంటే... గుంటూరు జిల్లా పెద్దపల్లి గ్రామం సహా చుట్టుపక్కల ఊళ్లకు పెద్దమనిషి శివయ్య (రవీంద్ర విజయ్). ఆ ఊళ్లలో జనాలకు ఆయన మాట అంటే శాసనం. డబ్బు, అధికారాన్ని అడ్డం పెట్టుకుని మహిళల జీవితాలను శివయ్య నాశనం చేస్తుంటాడు. మరోవైపు పుష్ప (అంజలి) అదే ఊళ్లో వేశ్యగా ఉంటుంది. శివయ్యకు ఆమెతో సంబంధం ఉంటుంది. అతని దగ్గర పనిచేసే దర్శి (శ్రీతేజ్) పుష్పతో ప్రేమలో పడతాడు. ఆమె కూడా అతని ప్రేమను అంగీకరిస్తుంది. దీంతో ఇద్దరూ పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. అయితే దర్శి మాత్రం లక్ష్మి (అనన్య నాగళ్ల)ను పెండ్లి చేసుకుంటాడు. పుష్పను ప్రేమించిన దర్శి మరో అమ్మాయి మెడలో తాళి ఎందుకు కట్టాల్సి వచ్చింది? అతను జైలుకు ఎందుకు వెళ్లాడు? జైలు నుంచి తిరిగి వచ్చాక ఏం చేశాడు? శివయ్యపై పుష్ప ఎలా ప్రతీకారం తీర్చుకుంది? అనేది మిగిలిన కథ.

నమస్తే తెలంగాణ
జిందగీ 11
హైదరాబాద్ | ఆదివారం 21 జూలై 2024 www.ntnews.com



సద్గురువులే శరణ్యం

నేడు గురు పూర్ణిమ

గురువు పట్ల ఆదరణ, అంకితభావం, గౌరవాన్ని తెలుపుతూ భక్తి శ్రద్ధలతో వేడుకను జరుపుకొనే రోజే 'గురు పూర్ణిమ'. గురువు అనే పదంలో, 'గు' అంటే అజ్ఞానమని, 'రు' అంటే ఆ అజ్ఞానాన్ని నాశనం చేసే వ్యక్తి అని అర్థం. ఆ విధంగా 'గురువు' అంటే అత్యంత జ్ఞాన సంపన్నులు, జీవుని హృదయంలోని అజ్ఞానాన్ని పారదోలి జ్ఞానం వైపు నడిపిస్తారని అర్థం. ఆది గురువులైన కృష్ణద్వైపాయన వ్యాస భగవానుడు ఉత్తరాషాఢ నక్షత్రంలోని ఆషాఢ శుక్ల పూర్ణిమ తిథిన ఈ లోకంలో అవతరించినందు వల్ల, ఆ తిథి 'గురు పూర్ణిమ'గా, 'వ్యాస పూర్ణిమ'గా ప్రసిద్ధి గాంచింది.



ప్రపంచవ్యాప్త హరే కృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన శ్రీల ప్రభుపాదులు గురు పూర్ణిమను గూర్చి ఇలా వివరించారు... 'ఆధ్యాత్మిక గురువుకు గౌరవం ఇచ్చే ఈ విధానం అన్ని వైదిక సంప్రదాయాల్లో ఆచరణలో ఉన్నప్పటికీ, గౌడీయ సంప్రదాయంలో మాత్రం ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక గురువు పుట్టినరోజున వారికి సవినయంగా సన్మాన, వందన, భక్తిపూర్వక ఉపచారాలతో కృతజ్ఞత లను తెలియజేస్తాం. ఆ ప్రత్యేకమైన శుభ క్షణాన్ని వ్యాసపూజగా జరుపుకొంటాం.

గురువు ప్రాముఖ్యం

జీవితంలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల ప్రాముఖ్యాన్ని రాబోయే తరాలకు వివరించడానికి గురు పూర్ణిమ ఎంతో అనువైనది. పూర్వం విద్యార్థులంతా గురువుగారి ఆశ్రమంలోనే ఉంటూ విద్యను అభ్యసించేవారు. గురువు కూడా ఉచితంగా బోధించేవారు. గురువుగారి ప్రతి మాట శిష్యులకు శిరోధార్యమై ఆజ్ఞగా స్వీకరించేవారని చరిత్రలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. గురువు ప్రసాదించిన విజ్ఞానం ఏకాలంలో శిష్యునికి నిత్య జీవన విధానాన్ని తెలపడమే గాక, దేవాది దేవుడైన శ్రీకృష్ణుని పట్ల స్వచ్ఛమైన భక్తియుత సేవాభావాన్ని పెంపొందించి జీవిత పరమావధి వైపు నడిపిస్తుంది.

ఎవరు... ఎలాంటివారిని ఆశ్రయించాలి?

తస్మాద్గురుం ప్రపద్యేత జిజ్ఞాసుః శ్రేయ ఉత్తమమ్
శాబ్దే పరే చ నిష్ణాతం బ్రహ్మణ్యుపశమాశ్రయమ్

జీవిత పరమార్థాన్ని గురించి జ్ఞానాన్ని పొందాలనే తపన ఉన్నవారు గురు శరణం పొందాలి. (శ్రీమద్భాగవతం 11.2.21). అయితే, ఇక్కడ 'మనం ఆశ్రయించదగిన ప్రామాణిక గురువును ఎలా కనుగొనగలం?' అనే ప్రశ్న తలెత్తుతుంది. దీని కోసం గురువును ఆశ్రయించే ముందే ఓ చిన్న పరీక్ష చేయడం ఎంతో ముఖ్యం. అనుమానాస్పదమైన వారిని ఎప్పుడూ ఆశ్రయించకూడదు. దీని గురించి ముండకోపనిషత్తులో (1.2.12).. తద్-విజ్ఞానార్థం స గురుం ఏవాభిగచ్ఛేత్ శ్రోత్రియం బ్రహ్మ- నిష్ఠం అని వివరించారు. ఇందులో ముఖ్య పదం 'శ్రోత్రియం', అంటే ఒక ప్రామాణిక గురు-శిష్య పరంపరకు చెందినవారు అని అర్థం. గురువు లేకుండా తాను ఆత్మసాక్షాత్కారం పొందానని ఎవరైనా వాదిస్తే, అతను నకిలీ గురువే. ఇస్కాన్ సంస్థాపక ఆచార్యులు.. పూజ్యశ్రీ ఎ.సి. భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాదులు వారు అలాంటి బ్రహ్మనిష్ఠ గల శిష్య పరంపరకు చెందినవారు. అంటే, సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుని నుంచి ఆరంభమై.. ఆ పరంపరలోని అనేక ఆధ్యాత్మిక గురువుల ద్వారా అందించబడిన విజ్ఞానం యథాతథంగా శ్రీల వ్యాసదేవ, శ్రీ చైతన్య మహాప్రభు, శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూరుల ద్వారా శ్రీల ప్రభుపాదుల వారికే మనకు సంక్రమించింది. శ్రీల ప్రభుపాదుల లాంటివారే మనకు శరణ్యం. కాబట్టి, ఈ గురు పూర్ణిమ శుభ సందర్భంగా, ప్రతి ఒక్కరమూ మన గురువులను గౌరవిద్దాం.

శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజీ
93969 56984



శుభం కార్డు మిస్సింగ్

...టూ బీ కంటిన్యూడ్

డైరెక్టర్: రెడీ.. కెమెరా.. యాక్షన్!!

హీరో: (పొట్టలో దిగిన కత్తిని పట్టుకుని)

అమ్మా.. నీకిచ్చిన మాట నిలబెట్టుకున్నా.

నీ ఒడిలో హాయిగా కన్ను మూస్తున్నా.. ఈ జన్మకిది చాలు.

తల్లి: బాబూ!!! నా ఆయువు కూడా పోసుకుని నువ్వు నూరేండ్లు బతకాలి.

హీరో: నాకంత టైమ్ లేదమ్మా.. లేదు.. లేదు..!! తల పక్కకు వాల్చేశాడు! (కట్ చేస్తే..)

చుట్టూ హీరో ఫ్యామిలీ.. హీరో కండ్లు ఇంకా తెరిచే ఉన్నాయి.. తల్లినే చూస్తూ..!!

థియేటర్ మొత్తం నిశ్శబ్దం.. సీన్ ఫ్రీజ్ అయ్యింది.. తెరపై జూమ్ అవుట్ అవుతూ..

శుభం.. The End! కార్డు!! థియేటర్ లైట్స్ ఆన్ అయ్యాయ్.

కండ్లు తుడుచుకుంటూ కొందరు.. హీరో చనిపోకుండా ఉంటే బాగుండు..

అని ఇంకొందరు.. ఇంటి ముఖం పట్టారు!!



అవును..

అయితే.. ఇప్పుడేం చేయమంటారు? మాకంత ఓపిక లేదంటారా?

యస్.. నేటి తరం డైరెక్టర్లకు కూడా ఓపిక లేకుండాపోయింది. అందుకే.. 70 ఎంఎం స్క్రీన్ నుంచి 'శుభం' కార్డు గల్లంతయ్యింది. పార్టు పార్టులుగా సినిమా పంచరిస్తున్నది. అందుకేనేమో.. తరాల అంతరాల నడుమ తెరమరుగైన 'శుభం' కార్డును తలుచుకోవాల్సి వస్తున్నది.

ఓ రెండు తరాలు వెనక్కి వెళ్తే.. తెలుస్తుంది... క్లైమాక్స్ అనగానే ఈల వేసుకుంటూ పోలీసులు వచ్చేసేవారు. 'రండి ఇన్‌స్పెక్టర్ గారూ ఈ దుర్మార్గులను జైల్లో వేయండి' అని మనను మార్చుకున్న సూర్యకాంతం అంటే 'మిస్టర్ యువార్ అండర్ అరెస్ట్' అని ఇన్‌స్పెక్టర్ అనడమూ, పండ్లు పటపట కొరుకుతూ రాజనాల జైలుకు వెళ్లిపోవడమూ జరిగిపోయేది. లేదంటే చేసిన తప్పులకు చింతిస్తూ 'నాలాంటి వాడికి ఈ సభ్య సమాజంలో ఉండే హక్కు లేదు' అంటూ నాగభూషణం నట విన్యాసం ప్రదర్శిస్తూ టీటీలు వేయించుకునేవాడు. మరోవైపు.. ఎస్వీ రామారావు 'పెద్దయ్యా, ఎంత పెద్ద బావ మనవాడు. అందరూ మన వారు అన్నది మరచిపోయాడు. అనవసరంగా జైలుపాలు చేస్తే మనమే బాధపడాలి కదా' అని ఎస్వీఆర్‌ను కన్విన్స్ చేస్తే.. రేలంగి 'నన్ను క్షమించు బావా' అనేవాడు, జామీను మీద విడిపించుకునేవారు.

ఇలా ఏది ఏమైనా చివరికి అందరూ కలిసి ఓ ఫ్యామిలీ ఫ్రేమ్‌లోకి వచ్చేవారు. ప్రేక్షకుల కడుపు నిండిపోయేది. రెండున్నర నుంచి మూడు గంటలపాటు సినిమా జీవితచక్రంలో నలిగిన ప్రేక్షకుడికి అదో సంతృప్తి. అందుకే అప్పట్లో డైరెక్టర్లు ఒక్కో తీరుగా శుభం కార్డు వేసేవారు. అంటే.. ఇప్పుడు బిగినింగ్‌లో.. ఓ రాజముద్ర వేస్తున్నారుగా.. 'ఇట్స్ ఏ రాజ మౌళి ఫిల్మ్'.. అని! అలాగన్నమాట. ఇప్పటి డైరెక్టర్లు.. కథ ముగింపు కన్నా ఎక్కువగా హీరో ఇంట్రొడక్షన్‌కే పద్ధతిగా ప్లాన్ చేస్తున్నారు. ఇక ఇంటర్వెల్ బ్యాంగ్ అయితే.. చెప్పక్కర్లేదు. మరి, క్లైమాక్స్ సంగతేంటి?.. 'శుభం' కార్డు పడే వరకూ ఆడియన్స్ కూర్చుంటున్నారా? లేచి నడుచుకుంటూ ఎగ్జిట్ డోర్ దగ్గర ఆగుతున్నారా? పార్టు 2 ఎలాగూ ఉందిగా.. దాంట్లో చూద్దాంలే అనుకుంటూ జేబులోకి చేతులు పోనిచ్చి.. అందులో ఉన్న ఫోన్ పైకి తీసి.. చాట్ చేస్తూ ఎటో వెళ్లిపోతున్నారా? 'శుభం' కార్డు చూసే ఓపిక లేక కాదు! సినిమాకు 'ది ఎండ్' ఉంటేగా!

కథ కంచికి.. టిక్కెట్ ముందుకి!!

'మీ సినిమాల సక్సెస్ వెనక రహస్యం ఏంటి' అని ఎవరైనా హీరో లేదా డైరెక్టర్‌ని అడిగితే.. ఎక్కువ శాతం 'మంచి కథ' అని చెబుతారు. ఓ కథ బాగుంది అన్నామంటే.. కచ్చితంగా దానికి మంచి ముగింపు ఉన్నట్లే. సినిమాల విషయానికి వస్తే డైరెక్టరే కెప్టెన్. సో.. ఆ క్రెడిట్ మొత్తం దర్శకుడికే దక్కుతుంది. అందుకే చాలా మంది డైరెక్టర్లు వారిదైన పద్ధతిలో కథను చివర్లో శుభం కార్డులు వేసేవాళ్లు. అదీ చూశాక- హమ్మయ్యా!! అంటూ కథ తాలూకు ఎమోషన్స్‌ని కళ్లలో నింపుకొని వెళ్లేవారు ప్రేక్షకులు. పోను.. పోనూ.. చేతిలోకి స్మార్ట్‌ఫోన్.. దానికో కెమెరా కన్ను వచ్చేసరికి కథ కంచికిపోయి.. టిక్కెట్ ముందుకొచ్చింది. కళలో తీరుతెన్నులూ.. మారేస్తూ.. బ్లాక్ అండ్ వైట్ నుంచి రంగుల్లోకి వచ్చేశాం. ఈ క్రమంలోనే.. సింపుల్ 'శుభం' కార్డు క్రియేటివ్‌గా మారింది. త్యాగాలు.. పోలీసుల్ని దాటుకుని పెళ్లి మంటపాలు, గుడి ఆవరణల్లోకి మారింది. హీరో.. హీరోయిన్ మెడలో తాళికట్టగానే.. ఫ్యామిలీ మొత్తం వాల్యూస్‌లో మనం వాడే ఎమోజీల మాదిరిగా ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ పెట్టేవాళ్లు. దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు లాంటివాళ్లు.. సీన్ ఫ్రీజ్ చేసి.. శుభం అని వేస్తే.. పెళ్లిసందడిని ప్రేక్షకులు ఇంటిదాకా తీసుకెళ్లేవారు.

ముగిస్తున్నాక కాసింత..!!

యస్.. కాలంతోపాటు డైరెక్టర్స్ రూటు మారుతూ వచ్చింది. కథలతో కల్చర్, కట్టు బొట్టు చెప్పాలని కొందరు.. కథంటే హాయిగా నవ్వుకోవడమే అని ఇంకొందరు.. కథంటే నవరసాలు పండించిన నాటకం అని మరికొందరు.. ఈ క్రమంలోనే వారి కథల తాలూకు భావాల్ని శుభం కార్డుపై రిఫ్లెక్ట్ చేశారు. కళాతపస్వి కె.విశ్వనాథ్ సినిమాల్ని తీసుకుంటే.. చివర్లో No End for Art!! అని కథలో ఫ్రేమ్‌ని ఫ్రీజ్ చేసేవారు. 'నవ్వడం ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం.. నవ్వకపోవడం ఒక రోగం..' అని ఎవరైనా అంటే.. కచ్చితంగా వాళ్లు జంధ్యాల ఫ్యాన్సే. హాస్యరసంతోనూ చక్కని కథల్ని మంచి వాల్చిన ఆయన.. చివర్లో 'నవ్వండి.. నవ్వించండి.. నవ్వు ఆరోగ్యకరం' అని శుభం కార్డుపై నవ్వుల పువ్వుల్ని పూయించారు. మరో వైపు.. ఈవీవీ.. 'టాటా' అంటూ.. కొన్ని సార్లు.. పక్కా, పదాలలో ఊరించే గద్దం గురువు రామవేంకటరావు 'సర్వేజనా సుఖినో భవంతు' అంటూ ప్రేక్షకుల్ని శుభం కార్డుతో దీవించి పంపేవారు. యాక్షన్ కింగ్ అర్జున్ లాంటోళ్లు.. 'జైహింద్' అంటూ దేశభక్తిని చాటే ప్రయత్నం చేశారు.

ఇప్పుడు 'బ్రాండ్' తోనే బాయ్

సినిమా గురించి టాక్ మొదలైందంటే చాలు.. ఇప్పుడంతా బ్రాండ్‌లు, బడ్జెట్ల గురించే డిస్కషన్. అందుకేనేమో.. డైరెక్టర్లు, హీరోలు.. వారి తాలూకు ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని అన్నీ ప్లాన్ చేస్తున్నారు. సినిమా ప్రమోషన్స్ దగ్గర్నుంచి అంతా పెర్ఫెక్ట్. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు, ప్రమోషన్స్‌తో కథను ముందే చెప్పేస్తున్నారు. రిలీజ్ అవ్వగానే రివ్యూలతో కథని అంగట్లో ఉంచుతున్నారు. ఇలా అన్ని అడ్డుబాటు దాటుకుని.. హిట్‌టాక్ తెచ్చుకుని.. రికార్డులు సృష్టించే బీజీలో పడి.. శుభం కార్డును చూపించే ఆలోచన డైరెక్టర్లు ఎప్పుడో డిలీట్ చేసుకున్నట్టున్నారు. ఇక కొందరైతే కథను ఎలా ముగించాలో తెలియకనో.. ముగిస్తే ఇంకో కథ దొరకదనే బెంగతోనో.. 'పార్ట్ 2' ఉందంటూ.. హ్యాంగ్ ఆన్ చెబుతున్నారు. హుం.. ఇంకేం చేద్దాం.. మంచి కథ ఏదైనా వస్తే.. చివరి వరకూ కూర్చుని.. శుభం కార్డు పడుతుందేమో చూద్దాం. డైరెక్టర్లూ.. కథకు మంచి శుభం కార్డు వేస్తే.. ఆ కిక్కే వేరబ్బా!!

ఆర్యన్ ప్రజాపతి

నేనలా అనలేదు బాబోయ్!

నటీనటులు ఏం మాట్లాడినా, ఏం చేసినా ప్రాధాన్యం సంతరించుకుంటాయి. అలాగే, వాళ్లు మాట్లాడింది పాజిటివ్ అయినా సరే కొన్నిసార్లు నెగెటివ్ అర్థాలు వస్తుంటాయి. ఈ క్రమంలో వాళ్లు ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఇటువంటి సమస్య ఎదుర్కొన్నానని చెప్పుకొచ్చింది నటి, మోడల్ మాళవిక జిన్న. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాళవిక తనకు ఎదురైన చేదు అనుభవం గురించి షేర్ చేసుకుంది. టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండతో 'నీ వెనకాలే నడిచి' అనే వైరల్ సాంగ్ చేసిందామె. ఈ సందర్భంగా ఆమె చేసిన కామెంట్లు వైరల్ అయ్యాయి. 'విజయ్‌కి హిందీ అంటే పెద్దగా ఇంట్రెస్ట్ ఉండదని చెప్పాను. ఆ మాటను మీడియాలో వక్రీకరించారు. హిందీ అంటేనే తనకు గిట్టదని, ఆ భాషను అసహ్యించుకుంటాడని రాస్తున్నారు. అసలు నేను అలా అనలేదు. కానీ, ఎంతో దారుణంగా రాస్తున్నారు. ఈ రాతల కారణంగా మంచి స్నేహితుడికి దూరమయ్యాను. సరదాగా అన్న మాటలను సీరియస్‌గా రాశారు. ఆ కామెంట్లు చదివిన తర్వాత విజయ్ టచ్‌లోకి రావడం లేదు. ఆయన్ను ఇరికించాలనో, తప్పుడు ట్యాగ్‌తోనో ఆ మాటలు అనలేదు' అని వాపోయింది మాళవిక.



అచ్చంగా మన్మథుడే!

సీనియర్ హీరోయిన్, అందాల తార ఖుష్బూ టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పాపులారిటీ తెచ్చుకున్నారు. ఒకనాడు తెలుగు అగ్రహీరోల సరసన నటించారు. ఇటీవల టాలీవుడ్ హీరోపై ఆమె చేసిన కామెంట్లు 'హవ్వా!' అనుకునేలా ఉన్నాయి. నాగార్జునతో రొమాన్స్ చేయాలని ప్రతి మహిళా కోరుకుంటుందని వ్యాఖ్యలు చేశారామె. 'కింగ్ నాగార్జునకు ఇప్పుడు 65 ఏండ్లు. కానీ ఇప్పటికీ ఆయన 30 ఏండ్ల కుర్రాడిలా కనిపిస్తారు. ఇంకా చెప్పాలంటే నాగార్జున ఇప్పుడే మరింత అందంగా ఉన్నారు. మన్మథుడు అనే ట్యాగ్‌లైన్‌కు ఆయన న్యాయం చేస్తున్నారు. బిగ్‌బాస్ షోలో నాగార్జున మరింత స్టైలిష్‌గా ఉంటారు. 1980లో ఆయనతో కెమెరా నాగార్జున సినిమా చేశాను. అప్పటినుంచే ఇప్పుడు ఆయన మరింత స్టైలిష్‌గా మారారు' అని వ్యాఖ్యానించింది ఖుష్బూ.



నేను నాలాగే కనిపిస్తా

చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణ సరసన నటించిన నటి టబు. బాలీవుడ్‌లో తాజాగా క్రూ అనే సినిమాతో అలరించింది. ప్రస్తుతం అజయ్ దేవగన్‌తో 'ఔరోం మే కహాం దమ్ థా'లో కనిపించనుంది. నీరజ్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఆగస్టు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో వీఎఫ్ఎక్స్ ద్వారా యంగ్ లుక్‌లో కనిపించబోతున్నారా అనే ప్రశ్నకు టబు ఇచ్చిన సమాధానం వైరల్ అవుతున్నది. 'తెర్పై టీనేజ్ అమ్మాయిలా కనిపించాలని లేదు. ప్రస్తుతం నా లుక్ ఎలా ఉందో స్క్రీన్‌పై కూడా అలాగే కనిపించాలని అనుకుంటాను. నా వయసు తగ్గించి చూపించే సాహసాన్ని దర్శకుడు ఈ సినిమాలో చేయలేదు. తమ వయసుకు తగిన పాత్రల్లోనే ఇదివరకు నటీనటులు కనిపించేవారు. అయితే, ప్రస్తుతం వయసు ఎక్కువ ఉన్నవాళ్లు కూడా యంగ్‌గా కనిపించే పాత్రలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. రొమాంటిక్ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో 30 ఏండ్ల అమ్మాయిలా కనిపించ లేదు' అని చెప్పుకొచ్చింది టబు.

